

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

నవంబర్, 2025

సంపుటి - 11 | సంచిక-11 | పేజీలు- 52 | వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



విశ్వవిద్యాలయ ఆడిటోరియం, రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా "ఏడాది ప్రగతి నివేదిక" అనే పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రొ॥ ఎమ్. కోదండరాం మరియు ఇతరులు




విశ్వవిద్యాలయ పరిధిలోని బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కలు నాటడం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య



విశ్వవిద్యాలయ అగ్రిహబ్‌లో బియ్యం ఎగుమతులపై ఏర్పాటు చేసిన మేధో మథన సదస్సులో ప్రసంగిస్తున్న ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య



విశ్వవిద్యాలయ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సిహెచ్. విద్యాసాగర్




విస్తరణ విద్యా సంస్థ, రాజేంద్రనగర్‌లో మహిళా రైతుల సాధికారత అన్న అంశం పై ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసంగిస్తున్న విస్తరణ సంచాలకులు డా॥ ఎమ్. యాకాద్రి



తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, భువనగిరిలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు మరియు రైతులు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

నవంబర్, 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర కార్తీక శుద్ధ ఏకాదశి నుండి మార్గశిర శుద్ధ దశమి వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

డా॥ సి. పద్మవేణి
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ పి. లీలా రాణి
ప్రధాన శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) & హెడ్

డా॥ బి. పద్మజ
ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్

పర్యవేక్షణ

డా॥ ఆర్. సునీత దేవి
ప్రధాన శాస్త్రవేత్త, (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.
డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030
పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



చిరునామా :

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం........................................ 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు............... 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ..................... 14
4. సాంకేతిక వ్యాసాలు
   - వరి నూటి రకాలు - విత్తనోత్పత్తిలో పాటించవలసిన మెళకువలు........................................ 15
   - వరిలో జింక్ ధాతువు లోపం - యాజమాన్యం............. 17
   - యాసంగి మొక్కజొన్న సాగు పై రైతులకు ఉపయోగకరమైన సూచనలు........................................ 18
   - రైతుకు లాభదాయకమైన జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగులో పాటించవలసిన మెళకువలు................................ 20
   - పశుగ్రాస జొన్న సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు........................................ 22
   - ఉత్తర తెలంగాణ మండలానికి అనువైన ఆవాల రకాలు మరియు యాజమాన్య పద్ధతులు............................ 24
   - గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం లక్ష్యం: కోత నుండి నిల్వ వరకు రైతు చేపట్టాల్సిన సమగ్ర చర్యలు............. 26
   - వ్యవసాయ పదవినోదం........................................ 28
   - ఫ్యుజేరియం ఎండు తెగులును తట్టుకునే నూతన శనగ రకం - ఆదిలాబాద్ శనగ-2................................ 29
   - యాంత్రీకరణతో చెఱకు సాగులో కొత్త వెలుగు............. 30
   - యాసంగి పంటల్లో సమర్థవంతమైన కలుపు యాజమాన్యం- అధిక పంట దిగుబడికి మరియు రైతు రాబడికి మార్గం.... 32
   - సమగ్ర సస్యరక్షణ చర్యలలో గుడ్డు పరాన్నజీవుల పాత్ర..... 35
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్............................ 37
   - నవంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు........................................ 38
   - రబీ వేరు కూరగాయల సాగుకు సరియైన సమయం........ 40
   - "రైతులకు కొత్త ఆదాయ వనరు: స్పిరులినా సాగు"......... 42
   - చేపల మరణాలు సంభవించకుండా రైతులు పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు................................ 44
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు........................................ 46
6. రైతన్నకో ప్రశ్న........................................ 47
7. విశ్వవిద్యాలయ వార్తలు........................................ 48
8. రైతు విజయగాథ
   - వంగ సాగు బహు బాగు అంటున్న తాండూరు రైతు విజయగాథ........................................ 49

# నవంబర్ మాసం క్యాలెండర్ - 2025

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర కార్తీక శుద్ధ ఏకాదశి నుండి మార్గశిర శుద్ధ దశమి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| **30** దశమి సా. 4-04<br>ఉత్తరాభాద్ర<br>రా. 8-59<br>ఉ.వ. 7-06 ల<br>8-38 | | | | | | **1** కార్తీక శు॥ ఏకాదశి<br>రా. 2-41<br>శతభిషం ప. 2-26<br>రా.వ. 8-41 ల<br>10-15 |
| **2** ద్వాదశి రా. 1-15<br>పూర్వాభాద్ర ప. 1-54<br>రా.వ. 11-08 ల<br>12-40 | **3** త్రయోదశి<br>రా. 11-39<br>ఉత్తరాభాద్ర<br>ప. 12-59<br>రా.వ. 12-30 ల<br>2-02 | **4** చతుర్దశి రా. 9-38<br>రేవతి ప. 12-03<br>వర్జ్యము లేదు | **5** ○ పూర్ణిమ రా. 7-12<br>అశ్విని ఉ. 10-16<br>ఉ.వ. 6-34 ల 8-03<br>రా.వ. 7-13 ల 8-43 | **6** కార్తీక బ॥ పాడ్యమి<br>సా. 4-51<br>భరణి ఉ. 8-40<br>రా.వ. 7-49 ల 9-18 | **7** విదియ ప. 2-28<br>కృత్తిక ఉ. 6-59<br>రోహిణి తె. 5-21<br>రా.వ. 9-53 ల<br>11-22 | **8** తదియ ప. 12-08<br>మృగశిర తె. 3-49<br>ఉ.వ. 10-36 ల<br>12-05 |
| **9** చవితి ఉ. 9-54<br>ఆర్ద్ర రా. 2-29<br>ప.వ. 11-46 ల 1-16 | **10** పంచమి ఉ. 7-55<br>షష్ఠి తె. 6-10<br>పునర్వసు<br>రా. 1-24<br>ప.వ.1-56 ల 3-28 | **11** సప్తమి తె. 4-55<br>పుష్యమి రా. 12-39<br>ఉ.వ. 9-09 ల<br>10-42 | **12** అష్టమి తె. 3-58<br>ఆశ్రేష రా. 12-16<br>ప.వ. 1-14 ల<br>2-49 | **13** నవమి తె. 3-31<br>మఘ రా. 12-22<br>ప.వ. 12-20 ల<br>1-56 | **14** దశమి తె. 3-34<br>పుబ్బ రా. 12-57<br>ఉ.వ. 8-34 ల<br>10-13 | **15** ఏకాదశి<br>తె. 4-06<br>ఉత్తర రా. 2-01<br>ఉ.వ. 8-28 ల<br>10-09 |
| **16** ద్వాదశి తె. 5-09<br>హస్త తె. 3-34<br>ఉ.వ. 10-58 ల<br>12-40 | **17** త్రయోదశి పూర్తి<br>చిత్ర తె. 5-32<br>ప.వ. 12-13 ల<br>1-57 | **18** త్రయోదశి<br>ఉ. 6-35<br>స్వాతి పూర్తి<br>ఉ.వ. 11-41 ల<br>1-26 | **19** చతుర్దశి<br>ఉ. 8-29<br>స్వాతి ఉ. 7-50<br>ప.వ. 2-03 ల<br>3-49 | **20** ● అమావాస్య<br>ఉ. 10-35<br>విశాఖ ఉ. 10-24<br>ప.వ. 2-50 ల<br>4-36 | **21** మార్గశిర శు. పాడ్యమి<br>ప. 12-45<br>అనూరాధ ప. 1-02<br>రా.వ.7-32 ల<br>8-58 | **22** విదియ ప. 2-47<br>జ్యేష్ఠ ప. 3-31<br>రా.వ. 12-15 ల<br>2-00 |
| **23** తదియ సా. 4-32<br>మూల సా. 5-44<br>ప.వ. 3-59 ల<br>5-44<br>తె.వ.4-04 ల<br>5-48 | **24** చవితి సా. 5-55<br>పూర్వాషాఢ<br>రా. 7-36<br>తె.వ.4-04 ల<br>5-45 | **25** పంచమి<br>సా. 6-49<br>ఉత్తరాషాఢ<br>రా. 9-00<br>రా.వ. 1-09 ల<br>2-49 | **26** షష్ఠి రా. 7-14<br>శ్రవణం<br>రా. 9-56<br>రా.వ. 2-00 ల<br>3-37 | **27** సప్తమి<br>రా. 7-08<br>ధనిష్ఠ<br>రా. 10-22<br>తె.వ. 5-32 ల | **28** అష్టమి<br>సా. 6-33<br>శతభిషం<br>రా. 10-19<br>ఉ.శే.వ. 7-08 వ<br>తె.వ. 4-35 ల<br>6-10 | **29** నవమి సా. 5-31<br>పూర్వాభాద్ర<br>రా. 9-51<br>వర్జ్యము లేదు |

**05 కార్తీక పూర్ణిమ/ గురునానక్ జయంతి**

**16 సయ్యద్ మహమ్మద్ జువాన్‌పురి జయంతి**

**విశాఖ కార్తె (07.11.25 నుండి 19.11.25)**

| | | |
|---|---|---|
| జొన్న | : | రబీ జొన్నలో అంతరకృషి. తొందరగా విత్తిన వాటికి సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట. |
| మొక్కజొన్న | : | రబీ పంటకు విత్తనం వేయుట. |
| గోధుమ | : | భూమిని తయారుచేయుట, ఎరువులు వేయుట, రెండవ వారంలో విత్తుట. |
| ప్రత్తి | : | ఖరీఫ్ ప్రత్తిలో ఎరువులు. |
| కాయధాన్యాలు | : | తక్కువ పంట కాలపు పెసర, మినుము చల్లుట, కందికి సస్యరక్షణ. |

**అనూరాధ కార్తె (20.11.25 నుండి 02.12.25)**

| | | |
|---|---|---|
| వరి | : | మధ్యకాలిక రకాల కోతలు, రబీ పైర్లకు నారుపోయుట, ధాన్యాన్ని ఆరబెట్టుట |
| మొక్కజొన్న | : | సస్యరక్షణ. |
| మంచిశనగ | : | సస్యరక్షణ. |
| చెఱకు | : | చెఱకు తోటలు కొట్టడం ప్రారంభం. కార్శి తోటల పెంపకం, బెల్లం తయారి, చెఱకు పిప్పిని పాతరవేయుట. |
| గోధుమ | : | రెండవ వారంలో విత్తనిచో వెంటనే విత్తనం వేయుట. |
| జొన్న | : | రబీ పైరులో సస్యరక్షణ. |
| పశుగ్రాసాలు | : | చెఱకు పిప్పిని పాతర వేసి పశుగ్రాసంగా మార్చడం |
| కాయధాన్యాలు | : | కంది విత్తడం. |

# వైవిధ్య భరితమైన పంటల సాగుతో పోషకాహార భద్రత



అల్దాస్ జానయ్య
**ఉపకులపతి**

ఆహార మరియు పోషకాహార భద్రత మానవ మనుగడకు మరియు ఆర్థిక పురోగతికి పునాదిలాంటిది. పెరుగుతున్న జనాభా, అస్థిరమైన వాతావరణ పరిస్థితులు, మారుతున్న ఆహారపు అలవాట్లు మరియు సాంకేతికత అభివృద్ధి నడుమ ప్రతి వ్యక్తికి సురక్షితమైన మరియు పోషక భరితమైన ఆహారం పొందడం భవిష్యత్తుకు అనివార్యమైనది. ఆహారం కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక మరియు భావోద్వేగ శ్రేయస్సుకూ అవసరమైనది.

ఒక దేశం యొక్క దీర్ఘకాలిక ఆహార భద్రత మరియు మానవాళి అభివృద్ధి, వ్యవసాయ వ్యవస్థల సమర్థతపై ఆధారపడి ఉంటుంది. ఆహారం నుండి వ్యవసాయాన్ని వేరుచేయలేము. మంచి పోషక విలువలు కలిగిన ఆహారం కావాలంటే నాణ్యమైన మరియు వైవిధ్యమైన పంటలు పండించాలి. కానీ నేల క్షీణత, నీటి కొరత, పంట కోత తర్వాత నష్టాలు మరియు పంట వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలు మన ఆహార వ్యవస్థ స్థిరత్వాన్ని సవాలు చేస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఆధునిక సాంకేతికతను సాంప్రదాయ జ్ఞానంతో మిళితం చేసే సమగ్రమైన దృక్పథం అవసరం.

గత కొన్నేళ్ళుగా వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్ మరియు మానవ పోషణ వచ్చిన పురోగతులు, ఆహార లభ్యత మరియు ఆహార వైవిధ్యాన్ని గణనీయంగా పెంచాయి. ప్రస్తుత కాలంలో, సూక్ష్మ పోషక లోపాలు, ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, రక్తపోటు, క్యాన్సర్, మూత్రపిండ మరియు కాలేయ వ్యాధులు వంటి జీవనశైలికి సంబంధించిన వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణాలు అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ముఖ్యంగా పీచు పదార్థాలు, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు, పండ్లు మరియు కూరగాయలు తక్కువగా తీసుకోవటం వలన పోషకాహార లోపాలు పెరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో సమాజాన్ని సమతుల్య ఆహారం తీసుకోవడం యొక్క ప్రాముఖ్యతపై చైతన్యపరచడం అత్యవసరం. రోజువారీ ఆహారంలో కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పులు, గుడ్లు, మాంసం, చేప వంటి పదార్థాలను చేర్చడం, స్థానిక మరియు కాలానుగుణ పండ్లను దొరికే వాటిని విరివిగా తినడం, భోజన సమయాలను క్రమబద్ధంగా పాటించడం, రోజుకు 2–2.5 లీటర్ల నీరు తాగడం, రోజూ కనీసం ఒక ఆకుకూరను ఇతర కూరగాయలతో తినడం మరియు శీతల పానీయాలు, చిరుతిండ్లు (రెడీ టు ఈట్, రెడీ టు కుక్, ఇన్‌స్టెంట్ ఫుడ్స్) అధిక చక్కెరతో ఉన్న ఆహార పదార్థాలు, క్రమరహిత భోజన అలవాట్లను అరికట్టడం మన ఆరోగ్యానికి కీలకం.

రైతులు, పరిశోధకులు, ప్రభుత్వ నిర్ణయాలు, పరిశ్రమలు మరియు వినియోగదారులు కలిసి పనిచేసినపుడే ఆహార వ్యవస్థలను సమగ్రంగా మరియు సుస్థిరంగా మార్చగలము. ఈ దిశగా విశ్వవిద్యాలయం కూడా పలు కీలక కార్యక్రమాలు చేపట్టింది. చిరుధాన్యాల ఇన్క్యుబేషన్ సెంటర్, బేకరీ యూనిట్ వంటి ఆహార ప్రాసెసింగ్ విభాగాలను స్థాపించి, గ్రామీణ మహిళలకు సమతుల్య ఆహారం, ఆహార వైవిధ్యతపై శిక్షణ ఇవ్వడం, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన బియ్యం, రోగ నిరోధక మరియు అధిక దిగుబడి పంటలను అభివృద్ధి చేయడం ద్వారా పోషక భద్రత పెంచే దిశగా కృషి చేస్తున్నది.

పోషకాహారాన్ని వ్యవసాయంతో సమన్వయం చేయడం ద్వారా భావితరాలకు సుస్థిర, ఆరోగ్యకర మరియు ఆహార భద్రతతో కూడిన భవిష్యత్తు నిర్మించడానికి ప్రేరణనిచ్చే దీపస్తంభంలా ఉంటుందని ఆకాంక్షిస్తూ...

(అల్దాస్ జానయ్య)
**ఉపకులపతి**



# వరి

- వానాకాలంలో ముందుగా వరి నాట్లు వేసిన కొన్ని జిల్లాల్లో వరి కోతలు ఇప్పటికే పూర్తి అవుతున్నాయి. అలాగే మిగతా జిల్లాల్లో వరి పైర్లు గింజ పాలు పోసుకునే దశ నుండి గింజ గట్టిపడే దశలో ఉన్నాయి. ఈ వానాకాలంలో సాగుచేసిన వరి పంటలో కొన్ని ప్రాంతాలు మినహా (ఆకుముడత మరియు ఎండాకు తెగులు) చీడపీడల ఉధృతి కొంతమేరకు అదుపులో ఉన్నది. కాకపోతే ఆలస్యంగా వేసిన వరి పంటలో నవంబర్ మాసంలో ఉండే వాతావరణ పరిస్థితుల్లో మెడవిరుపు తెగులు, గింజ మచ్చ తెగులు, సుడిదోమ, కంకినల్లి ఆశించే అవకాశం ఉంది.
- ముఖ్యంగా ఈ వానాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా కాండంతొలుచు పురుగు ఆశించడం వలన తెల్లకంకులు ఏర్పడటం జరుగుతుంది. అయితే పూత, గింజ పాలు పోసుకునే దశలో తెల్లకంకులు గమనించినప్పుడు ఎలాంటి పురుగుమందులు కొట్టడం వలన ప్రయోజనం ఉండదని రైతులు గమనించాలి.
- ముఖ్యంగా వానాకాలంలో వరిలో సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్ 0.6 గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.48 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ + ఎథిప్రోల్ 0.25 గ్రా. లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- అలాగే గింజమచ్చ, కంకినల్లి గమనించినట్లైతే స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. + ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- మెడవిరుపు లక్షణాలు గమనించినప్పుడు ఐసోప్రోథయోలేన్ 300 మి.లీ. లేదా కాసుగామైసిన్ 500 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 500 గ్రా. ఎకరానికి పిచికారి చేయాలి.
- ఎక్కడైతే పాముపొడ తెగులు ఉధృతి అధికంగా ఉంటే తైఫ్లూజమైడ్ 0.75 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- వరి కోత మరియు నూర్పిడి సమయంలో ధాన్యంలో తేమశాతం 23-26 శాతం వరకు ఉంటుంది. వెంటనే ధాన్యాన్ని టార్పలిన్ లేదా ప్లాస్టిక్ పట్టాలపై పలుచగా ఆరబెట్టినచో గింజ రంగు మారకుండా నల్లగా కాకుండా మంచి నాణ్యతగా ఉంటుంది. ధాన్యానికి మంచి మార్కెట్ విలువ రావడానికి బెరుకు గింజలు 6%, తేమశాతం 17%, పుచ్చిపోయిన గింజలు 5%, ఇతర వ్యర్థ పదార్థాలు 1%, పక్వానికి రాని గింజలు 3% గరిష్ట స్థాయి మించకుండా నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చూసుకోవాలి.
- యాసంగిలో వరి నార్లు పోసుకోవడానికి నవంబర్ 15 నుండి డిసెంబర్ 20 వరకు అవకాశం ఉంది. నాట్లు ఆలస్యమైన కొద్దీ పంట దిగుబడులు తగ్గడమే కాకుండా, బియ్యం శాతం తగ్గి నూకశాతం పెరుగుతుందని రైతులు గుర్తుంచుకోవాలి.
- ముఖ్యంగా ఈ యాసంగిలో స్వల్పకాలిక దొడ్డుగింజ రకాలైన జగిత్యాల రైస్-1, కూనారం సన్నాలు, ఆర్.ఎన్.ఆర్.-29325, యం.టి.యం-1010, తెల్లహంస మరియు సన్నగింజ రకాలైన తెలంగాణ సోన, కె.ఎన్.యం.-1638, కె.ఎన్.యం-733, డబ్ల్యు.జి.ఎల్.-962, జగిత్యాల సాంబ జె.జి.యల్-27356, ఆర్.ఎన్.ఆర్-21278 వంటి రకాలను సాగు చేయాలి.
- వానాకాలంలో పండించిన విత్తనాలను యాసంగిలో సాగు చేయాలనుకున్నట్లైతే ఆయా రకాల నిద్రావస్థను బట్టి నత్రికామ్లం కలిపిన ద్రావణంలో నానబెట్టి తదుపరి శుభ్రంగా కడిగి మండె కట్టాలి.
- విత్తనశుద్ధి కొరకు కిలో విత్తనానికి కార్బండాజిమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 24 గంటలు నానబెట్టి తర్వాత మండె కట్టాలి.
- యాసంగిలో చలి వలన నార్లు ఎదగకపోవడం, జింకు లోపం, వేర్లు నల్లగా అవటం ఎక్కువగా గమనించే అవకాశం



ఉంటుంది. కనుక జింకు సల్ఫేట్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం, నార్లు ఎదగడానికి కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. ఒక కిలో యూరియాతో కలిపి చల్లుకోవాలి.

డా॥ ఐ. స్వర్ణలత దేవి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8333818218

## మొక్కజొన్న

మొక్కజొన్న పంటను యాసంగిలో నవంబరు 15 లోగా విత్తుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు. అందు కొరకు ఎకరాకు 8 కిలోల ధృవీకరించిన విత్తనాన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల నుండి సేకరించి విత్తుకోవాలి. సేకరించిన విత్తనాలు విత్తనశుద్ధి కానివి అయిన ఎడల రైతులు ఒక కిలో విత్తనానికి 6.0 మి.లీ సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సామ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. దుక్కి చేసిన నేలలో 60 సెం.మీ. ఎడం ఉండునట్లు బోదెలు చేసుకోవాలి. విత్తనాన్ని బోదెకు ఒక వైపున పైనుండి 1/3 వ వంతు ఎత్తులో 20 సెం.మీ. దూరంలో విత్తాలి. ఆ విధంగా ఎకరాకు 33333 మొక్కల సాంద్రత ఉండేటట్లుగా చూసుకోవాలి. విత్తనం విత్తిన వెంటనే నీటి తడిని ఇవ్వాలి.

విత్తిన 48 గంటలలోపు అట్రాజిన్ అనే కలుపు మందును తేలిక నేలల్లో ఎకరాకు 800 గ్రా. లేదా బరువు నేలల్లో 1200 గ్రా. లేదా పైరాక్సాసల్ఫోన్ 60 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారి చేయాలి. ఆ తర్వాత 25-30 రోజులకు కలుపు ఉధృతిని బట్టి టెంబోట్రయాన్ 34.4% ఎస్.సి. ద్రావణాన్ని 115 మి.లీ. లేదా టోప్రామిజోన్ 33.6% ఎస్.సి. 40 మి.లీ. 200 లీ. నీటిలో కలిపి కలుపు 3-4 ఆకుల దశలో పిచికారి చేసినట్లయితే వివిధ రకాల కలుపు మొక్కలను నియంత్రించవచ్చు. తుంగ సమస్య ఎక్కువగా ఉంటే ఈ కలుపు మందులకు హేలోసల్ఫ్యూరాన్ మిథైల్ 75 డబ్ల్యుజి ఎకరాకు 36 గ్రా. చొప్పున కలిపి వాడుకోవచ్చు లేదా మీసోట్రియాన్ + అట్రజిన్ ఎకరాకు 1400 మి.లీ. చొప్పున వాడుకోవాలి.

యాసంగిలో ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం మరియు 32 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. విత్తేటప్పుడు 1/4 వ వంతు నత్రజని ఎరువును, మొత్తం భాస్వరం ఎరువును వేయాలి. పొటాష్ ఎరువును బరువు నేలల్లో అయితే మొత్తం ఆఖరి దుక్కిలోను అదే తేలిక నేలల్లో అయితే మొదటి సగం విత్తే సమయంలో మిగతా పూత దశలో వేయాలి. పైపాటుగా మిగతా నత్రజనిని 1/4 వ వంతు 20 రోజులకు, 1/4 వ వంతు 40 రోజులకు మరియు 1/4 వ వంతు 60 రోజులకు వేయాలి. ఎరువులను వేసిన ప్రతిసారి తడులను తప్పని సరిగా ఇవ్వాలి.

## చిరుధాన్యాలు

**యాసంగి జొన్న:** యాసంగి జొన్న అక్టోబర్ రెండవ వారం నుండి నవంబర్ రెండవ వారం వరకు విత్తుకోవచ్చు. తాండూరు జొన్న 1 (ఎస్.వి.టి. 68), తాండూరు జొన్న 55 (ఎస్.వి.టి. 55), సి. ఎస్.వి 29 ఆర్ అనే మేలైన రకాలను ఎంచుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 12 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌ను కలిపి విత్తనశుద్ధి చేసుకొని విత్తుకోవడం వల్ల విత్తిన నెల రోజులలోపు వచ్చే మొవ్వు తొలిచే ఈగ నుండి పంటను కాపాడుకోవచ్చు.

**సజ్జ:** ఈ పంటను అక్టోబర్ రెండవ వారం నుండి నవంబరు చివరి వారం వరకు విత్తుకోవచ్చు. రెండు కిలోల విత్తనము ఎకరాకు సరిపోతుంది. తెగుళ్ళు ఆశించకుండా కిలో విత్తనానికి 6 గ్రా. మెటలాక్సిల్ 35 డబ్లుయస్. మందును కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. అక్టోబరులో విత్తుకున్న పంట మూడు నుంచి



నాలుగు వారాల దశలో ఉన్నట్లైతే గుంటక లేదా దంతితో వరుసల మధ్య అంతర సేద్యం చేయాలి. ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేయాలి. నత్రజనిని యూరియా రూపంలో ఎకరాకు 25-30 కిలోల చొప్పున పై పాటుగా వేయాలి.

**రాగి:** ఈ పంటను అక్టోబర్ చివరి వారం నుండి నవంబరు చివరి వారం వరకు విత్తుకోవచ్చు. ఎకరాకు రెండు కిలోల విత్తనము సరిపోతుంది. నారు పెంచి లేదా నేరుగా విత్తుకోవచ్చు. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. మ్యాంకోజెబ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9182968409**

## వేరుశనగ

- ప్రస్తుతం మన రాష్ట్రంలో వానాకాలంలో విత్తుకున్న వేరుశనగ కోతదశలో ఉంది. 75 నుండి 80 శాతం కాయలు పూర్తిగా పక్వానికి వచ్చినప్పుడు మాత్రమే పంటను కోయాలి. పంటకోత కొరకు డిగ్గర్‌ను వాడవచ్చు మరియు మొక్క నుండి కాయలను వేరుచేయటానికి త్రెషర్లను ఉపయోగించాలి. త్రెషర్ల ద్వారా ఒక గంటకి 2 నుండి 2 1/2 క్వింటాళ్ళ కాయలను మొక్కల నుండి వేరుచేయవచ్చు. ఈ విధంగా త్రెషర్లను ఉపయోగించడం ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చు. కోత తర్వాత కాయలను బాగా ఆరబెట్టాలి. మరియు తేమ ఎక్కువ లేకుండా చూసుకోవాలి.
- యాసంగిలో సాగు చేయు రైతులు నవంబర్ మాసం రెండవ పక్షం వరకు పంటను విత్తుకొనవచ్చు. ఎకరానికి 70 నుండి 80 కిలోల విత్తనం అవసరం అవుతుంది. యాసంగిలో ఒక చదరపు మీటరుకి 44 మొక్కలు ఉండే విధంగా వరుసల మధ్య 22.5 సెం.మీ. మరియు మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండే విధంగా చూసుకోవాలి.
- క్రొత్తగా పంట సాగు చేసే రైతులు 200 గ్రా. రైజోబియంను ఎకరానికి సరిపడే విత్తనానికి పట్టించి విత్తుకోవాలి. దీనివలన భూమిలో నత్రజని స్థిరీకరించబడుతుంది. అదేవిధంగా నేల ద్వారా వ్యాపించే కుళ్ళు తెగులు లేదా కాండం కుళ్ళు తెగుళ్ళను అరికట్టుటకు విత్తనానికి విత్తనశుద్ధి చేసుకోవాలి. దీని కోసం కిలో విత్తనానికి 1 గ్రా. టెబ్యుకొనజోల్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మా అనే జీవశిలీంధ్రనాశినిని పట్టించి విత్తనశుద్ధి చేయాలి.
- ఆఖరి దుక్కిలో 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 18 కిలోల యూరియా, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లతో పాటు 3-4 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలి. విత్తిన తరువాత 48 గంటలలోపు తడినేలపై డైక్లోసులామ్ అనే కలుపు మందును ఎకరానికి 12.4 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. విత్తిన తరువాత 20-25 రోజుల వరకు నీటితడిని ఇవ్వకూడదు. తద్వారా తదుపరి ఇచ్చే తడితో ఒకేసారి పూత ఎక్కువగా వచ్చి దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.
- అక్టోబర్ మాసంలో విత్తుకున్న పంట తొలి పూత దశలో ఉన్నప్పుడు 10-15 కిలోల యూరియాను వేసుకోవాలి. పంట 45 రోజుల దశలో ఉన్నట్లైతే 200 కిలోల జిప్సంను సాళ్ళలో వేసి మట్టిని ఎగద్రోయాలి. ఆకుమచ్చ తెగులు ఆశించినట్లైతే టెబ్యుకొనజోల్ 200 మి.లీ. లేదా క్లోరోథలోనిల్ 400 గ్రా. 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారి చేయాలి. లద్దె పురుగు ఆశించినట్లైతే ఫ్లూబెండమైడ్ 40 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- శనగపచ్చ పురుగు ఆశించినట్లైతే క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



## ఆముదం

- ప్రస్తుతం మన రాష్ట్రంలో వానాకాలంలో సాగుచేసుకున్న ఆముదం రెండవ గెల కోత దశలో ఉంది. యాసంగిలో సాగుచేసిన పంట 30 రోజుల దశలో ఉంది. ఈ దశలో మొలక కుళ్ళు తెగులు సోకే అవకాశం ఉంది. ఒక వేళ తెగులు గమనించినట్లైతే 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మొదళ్ళు తడిచేట్లు పిచికారి చేసుకోవాలి.
- పంటను విత్తిన 40-60 రోజుల వరకు ఎటువంటి కలుపు లేకుండా చూసుకోవాలి. అంతరకృషి చేసిన తరువాత మొక్క మొదళ్ళ దగ్గరికి మట్టిని ఎగదోయాలి.
- పంటకాలంలో నవంబర్ నుండి డిసెంబర్ వరకు తక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయి కావున 12-15 రోజులకొకసారి నీటి తడులను ఇవ్వాలి. రబీ పంటలో మొలక కుళ్ళు తెగులు గమనించినట్లైతే 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మెటలాక్సిల్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళు తడపాలి.
- పొగాకు లద్దె పురుగు మరియు దాసరి పురుగు ఆశించిన ఆకులను ఏరి నాశనం చేయాలి. పురుగు ఉధృతిని బట్టి వేపనూనె 5 మి.లీ. లేదా పంటలో కాయతొలుచు పురుగు ఉధృతి గమనించినట్లైతే నొవాల్యురాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.

## నువ్వులు

- ఆగష్టు మాసంలో విత్తుకున్న నువ్వుపంట ప్రస్తుతం కోత మరియు నూర్పిడి దశలో ఉంటుంది. 75% కాయలు లేత పసుపు వర్ణానికి వచ్చినప్పుడు పైరు కోయాలి. కోసిన పంటను కట్టలుగా కట్టి తలక్రిందులుగా నిలబెట్టాలి. 5-6 రోజులు ఎండిన తర్వాత కట్టెలతో కొట్టి నూర్పిడి చేయాలి.
- గింజల్లో తేమ 8 శాతానికి తగ్గిన తరువాత గోనె సంచిలో నిల్వ చేయాలి. ఈ సంచుల పై మలాథియాన్ పొడిని చల్లాలి.

## ప్రొద్దుతిరుగుడు

- వానాకాలంలో విత్తుకున్న ప్రొద్దుతిరుగుడు ప్రస్తుతం కోతదశలో ఉన్నది. పువ్వు వెనుక భాగం నిమ్మ పచ్చరంగులోకి మారిన తర్వాత పువ్వులను కోసి 2-3 రోజులపాటు ఆరనివ్వాలి. గింజల్లో తేమ 9-10 శాతం వచ్చినప్పుడు నూర్పిడి చేసుకోవాలి. యాసంగిలో నవంబర్-డిసెంబర్ మాసాలలో ఈ పంటను విత్తుకోవచ్చు. ఒక ఎకరాకు 2.5-3.0 కిలోల విత్తనం సరిపోతుంది.
- నెక్రోసిస్ వైరస్ తెగులు సమస్యను అధిగమించడానికి కిలో విత్తనానికి 3 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 5.0 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేయాలి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 2 గ్రా. ఇప్రోడియాన్ 25% + కార్బండాజిమ్ 25% తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- బోదెలు చేసి విత్తనం నాటినట్లైతే నీటితడులు ఇవ్వడానికి, ఎరువులను వేయుటకు అనుకూలంగా ఉండటమే కాకుండా మొక్కకు పటుత్వం కూడా లభిస్తుంది.
- నేల స్వభావాన్ని బట్టి విత్తే దూరం నిర్ణయించాలి. తేలిక నేలల్లో వరుసల మధ్య 45 సెం.మీ. మరియు మొక్కల మధ్య 20-25 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. బరువైన నేలల్లో వరుసల మధ్య 60 సెం.మీ. మరియు మొక్కల మధ్య 30 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి.
- ఆఖరి దుక్కిలో 2-3 టన్నుల పశువుల ఎరువు వేయాలి. పంట మొత్తానికి నత్రజని 30 కిలోలు, భాస్వరం 36 కిలోలు మరియు పొటాష్ 12 కిలోలు ఎకరానికి అవసరం. సగం నత్రజని ఎరువును ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. 50-55 కిలోల జిప్సంను ఆఖరి దుక్కిలో వేసుకున్నట్లైతే పంట నాణ్యత బాగుంటుంది.
- విత్తిన 48 గంటలలోపు 5 మి.లీ. పెండిమిథాలిన్ 30% లీటరు నీటికి కలిపి నేలపై పిచికారి చేయాలి. విత్తిన 25-30 రోజుల తర్వాత గుంటక / దంతితో అంతర సేద్యం చేయాలి.



- నేల రకాన్ని, పగటి ఉష్ణోగ్రతను బట్టి ఎర్ర నేలల్లో 8-10 రోజుల వ్యవధిలో, నల్లరేగడి నేలల్లో 15-20 రోజుల వ్యవధిలో నీటి తడులను ఇవ్వాలి.

## కుసుమ

- వర్షాభావ పరిస్థితులలో వానాకాలం పంట నష్టపోయినప్పుడు ఒక మంచి ప్రత్యామ్నాయ పంటగా కుసుమ పంటను సాగుచేసుకోవచ్చు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉండే మొక్కజొన్న, వేరుశనగ బదులుగా కుసుమను నిర్భయంగా సాగు చేయవచ్చు.
- ఈ పంటను యాసంగిలో అక్టోబర్ రెండవ పక్షం నుండి నవంబర్ మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి 4 కిలోల విత్తనం అవసరమవుతుంది. మొలక కుళ్ళు, వేరుకుళ్ళు వంటి అనేక రకాల శిలీంధ్ర వ్యాధులను నియంత్రించడానికి కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. వరుసల మధ్య 45 సెం.మీ. వరుసలో మొక్కల మధ్య 20 సెం.మీ. ఎడం ఉండేలా చూసుకోవాలి.
- దుక్కిలో 10-12 కిలోల యూరియా, 10 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులను వేసుకోవాలి. భాస్వరాన్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేసుకోవడం ఉత్తమం. గంధకం లభ్యత పెరగడం వలన నూనెశాతం పెరిగి అధిక గింజ దిగుబడిని పొందవచ్చు. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేసుకున్నట్లైతే 70 కిలోలు అవసరం అవుతుంది. విత్తిన 30-40 రోజుల మధ్య 10-12 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి.
- విత్తిన 20-35 రోజుల్లో కలుపు లేకుండా చూసుకోవాలి. పంటతొలి దశల్లో పేనుబంక ఆశించే అవకాశం ఉంటుంది. నివారణకు డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవచ్చు.
- అక్టోబర్‌లో విత్తుకున్న పంటలో 10-12 కిలోల యూరియాను 30-35 రోజుల తరువాత మొదటి తడి కట్టేటప్పుడు పైపాటుగా వేసుకోవాలి. విత్తిన 25 రోజులకు మరియు 45-50 రోజులకు అంతరకృషి చేసుకోవాలి.
- అక్టోబర్‌లో విత్తుకున్న కుసుమలో వత్తుగా ఉన్న మొక్కలను తీసివేసి పంటను పలచగా చేసుకోవాలి. ఇలా తీసివేసిన ఆకులను ఆకుకూరగా కూడా వినియోగించవచ్చు.

**డా॥ ఎమ్. శ్రీధర్, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8186945838**

## సోయాచిక్కుడు

- సోయాచిక్కుడు ప్రస్తుతం పంటకోత దశ పూర్తయి నూర్పిడి దశ నుండి పంట కళ్లాల్లో ఆరపెట్టుకునే దశలో ఉంది.
- పంటను మార్కెటింగ్ చేసుకునే ముందు రైతులు గ్రామస్థాయిలోనే జల్లెడ పట్టుకున్నట్లైతే అధిక ధర వచ్చే అవకాశం కలదు.
- విత్తనోత్పత్తి చేసి రైతులు మరియు వచ్చిన పంటను విత్తనంగా వాడే రైతులు పంట కోతానంతరం ఎక్కువ రోజులు కుప్పలు పెట్టకుండా వీలైనంత త్వరంగా మనుషుల ద్వారా లేదా 300-400 ఆర్‌పియం తో నూర్పిడి చేసుకుని పంట అవశేషాలను తీసివేసి నాణ్యమైన విత్తనాలను సేకరించాలి.
- నూర్పిడి చేసిన తర్వాత గింజలను 8-12 తేమశాతం వచ్చే వరకు ఆరబెట్టి, పాలిథీన్ లేదా గోనె సంచులలో నిల్వ చేయాలి.
- విత్తనోత్పత్తి చేసే రైతులు గింజలను ఆరబెట్టిన తర్వాత మొలకశాతాన్ని పరీక్షించుకోవాలి. 80% వరకు మొలక ఉన్న విత్తనాలను మాత్రమే నిల్వచేసుకోవాలి.



- నిల్వ చేసేటప్పుడు విత్తన సంచులను నేరుగా నేలపైన కాకుండా ఇనుప లేదా కట్టే కడ్డీల పైన నిల్వ చేయాలి. అలాగే బాగా వెలుతురు వచ్చి చల్లగా ఉండే గదిలో మాత్రమే నిల్వచేయాలి.

**డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు), వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 97041 34304**

## అపరాలు

పెసర / మినుము అక్టోబర్ నెలలో పంట మొగ్గ పూత దశలో ఉన్నది. మొగ్గ దశలో ఉన్నచో తేలికపాటి తడి ఇచ్చినచో సమంగా పూతకు వచ్చి పిందె బాగా నిలుస్తుంది. అధిక పగటి ఉష్ణోగ్రతల వలన రసంపీల్చే పురుగులు ముఖ్యంగా పేనుబంక ఆశించే అవకాశం ఉంది. పల్లాకు తెగులు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలి. తెల్లదోమ ఉనికిని తగ్గించడానికి పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలి.

**అక్టోబర్‌లో విత్తిన మినుము మరియు పెసర పైర్లలో యాజమాన్య పద్ధతులు:**

**తామరపురుగులు:** ఈ పురుగులు పైరు తొలి దశలో ఎక్కువగా ఆశించి ఆకులలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగజేయడమే కాకుండా ఆకుముడత అనే వైరస్ వ్యాధిని వ్యాపింప చేస్తాయి. నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెల్లదోమ:** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చుటయే కాక పల్లాకు తెగులును కూడా వ్యాపింప చేస్తాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక:** డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కంది:** తొలకరిలో వేసిన మధ్యకాలిక రకాలు పూత పిందె దశలో ఉన్నవి. పిందె దశలో ఉన్న పంటకు అవసరాన్ని బట్టి తేలికపాటి తడి ఇచ్చినచో దిగుబడి పెరుగును. ఆలస్యంగా విత్తిన కంది మొగ్గ నుండి తొలి పూత దశలో ఉన్నది. ఈ దశలో తేలికపాటి తడి ఇవ్వవలెను. శనగపచ్చ పురుగు మరియు మారుకా గూడు పురుగు నివారణకై క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో తొలిదశ లార్వాలు సమర్థవంతంగా నివారించబడును. ఉధృతి ఎక్కువగా ఉన్నచో లేదా బాగా ఎదిగిన లార్వాలు నివారించడానికి ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయవలెను.

**మారుకా మచ్చల పురుగు:** మారుకా మచ్చల పురుగు పూత, పిందె మరియు ఆకులను గూడుగా ఏర్పరచి లోపల ఉండి పూలు, పిందెలు తినివేయుట ద్వారా నష్టాన్ని కలుగజేస్తుంది.

పూత తొలి దశకు ముందే వేప సంబంధిత మందులు (వేపగింజల కషాయం 5% / వేపనూనె 0.05%) పిచికారి చేసినట్లైతే ఈ పురుగు ఉధృతి తగ్గుతుంది. అలాకాక, మారుకా పురుగు తొలిదశలో మొగ్గలను, పిందెలను ఆశించి నష్టపరుస్తుంది. ఈ దశలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పైరులో గూళ్ళు ఎక్కువగా ఉన్నట్లైతే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే ఈ పురుగు నివారించబడుతుంది.

**వరి మాగాణిలో మినుము మరియు పెసర:** నవంబర్ రెండవ పక్షం నుండి విత్తుకునే మినుము రకాలు: ఎల్.బి.జి-787, ఎల్.బి.జి.-752, టి.బి.జి.-104, ఎమ్.బి.జి.-1070, పి.యు.-31, జి.బి.జి.-1



**పెసర రకాలు:** యమ్.జి.జి.-351, ఎమ్.జి.జి.-385, టి.యం.96-2, ఐ.పి.ఎమ్.2-14 విత్తుకొనవచ్చు.

**శనగ:** శనగ పంట అక్టోబర్ నుండి నవంబర్ మొదటి పక్షంలో విత్తినచో పూత, పిందె దశలో బెట్ట పరిస్థితులు మరియు అధిక ఉష్ణోగ్రత సమస్య రాకుండా మంచి దిగుబడులు సాధించవచ్చును.

**అనువైన రకాలు:** జె జి – 11

**దేశీ రకాలు:** ఎన్.బి.ఇ.జి-3, ఎన్.బి.ఇ.జి-47, ఎన్.బి.ఇ.జి-49, జె.ఎ.కె.ఐ.-9218, నంద్యాల శనగ-1, నంద్యాల శనగ-852 (ఎన్.బి.ఇ.జి-857), ఎన్.బి.ఇ.జి-452, ఎన్.బి.ఇ.జి-776, ఎన్.బి.ఇ.జి-1267,

**కాబూలీ రకాలు:** ఐ.సి.సి.వి-2 (శ్వేత), కె.వి.కె-2 (విహార్), పూలేజి-95311, యం.ఎన్.కె-1, ఎన్.బి.ఇ.జి-119, ఎన్.బి.ఇ.జి-810.

**విత్తన మోతాదు:** శనగ రకాలలో విత్తన బరువును బట్టి ఎకరాకు విత్తన మోతాదు మారుతుంది. దేశీ రకాలను ఎకరానికి 35 కిలోల మరియు కాబూలీ రకాలను 40-50 కిలోల చొప్పున విత్తుకోవాలి.

**విత్తే దూరం:** 30×10 సెం.మీ.

**విత్తనశుద్ధి:** శనగ విత్తనాన్ని విత్తే ముందు 3 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. థైరామ్ / కాప్టాన్ లేదా 1.5 గ్రా. విటావాక్స్ పవర్ మరియు 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడి ఒక కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయడం వల్ల మొక్క తొలిదశలో ఆశించే నేల మరియు విత్తనం ద్వారా వచ్చే తెగుళ్ళను అరికట్టవచ్చు. మొదట శిలీంద్రనాశినితో విత్తనశుద్ధి చేసిన తరువాత ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలి. శనగలో 20-25 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. అంతరకృషి చేసి కలుపు నివారించాలి. తద్వారా తేమ కూడా ఎక్కువ రోజులు మొక్కకు అందేలా తోడ్పడుతుంది. రబీలో విత్తిన శనగ పంటకు విత్తిన 35-40 రోజులకు మరియు 55-65 రోజులకు తేలికపాటి నీటి తడి ఇచ్చినచో దిగుబడులు పెరుగుతాయి.

శనగలో మొగ్గదశలో 2% అనగా 20 గ్రా. లీటరు నీటికి డిఎపి లేదా యూరియా ద్రావణం పిచికారి చేసినచో దిగుబడి పెరుగుతుంది. ఆలస్యంగా విత్తిన శనగ పంట తొలిదశలో పచ్చ రబ్బరు పురుగు ఆశించి నష్టపరుస్తుంది. నివారణకై క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## ప్రత్తి

- రాష్ట్రంలో ప్రత్తి రైతులు మొదటి తీత ప్రత్తి తీసుకోవడం జరిగింది. కొన్ని చోట్ల రెండవ తీత ప్రత్తి తీస్తున్నారు.
- ప్రత్తి తీసేటప్పుడు గోనె లేదా గుడ్డ సంచులను వాడాలి. ఎండిన ఆకులు, కాయ తొడిమలు ప్రత్తితో కలువకుండా చూసుకోవాలి.
- తీసిన ప్రత్తిని పట్టాలపై నీడలో 8 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి అమ్మినట్లయితే మార్కెట్‌లో మంచి ధర వస్తుంది.
- గులాబి రంగు పురుగు ఉధృతిని తగ్గించడానికి లింగాకర్షక బుట్టలు ఎకరానికి 8-10 చొప్పున ప్రత్తి మొక్కకు అడుగు ఎత్తులో ఉండే విధంగా పెట్టుకోవాలి.
- గులాబి రంగు పురుగును ప్రత్తి చేనులో గమనించినచో లీటరు నీటికి సైపర్‌మెత్రిన్ + క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ + క్లోరాంట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. కలిపి పిచికారి చేసుకోవాలి.



- ప్రత్తి కాయకుళ్ళు గమనించినట్లైతే లీటరు నీటికి ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ + ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 0.6 గ్రా. పిచికారి చేసుకోవాలి.
- రాష్ట్రంలో ప్రత్తి పంట రెండవ తీత (120-140 రోజులు) దశలో ఉంది. పైపాటుగా ఎటువంటి ఎరువులు గాని పురుగు మందులుగాని వాడరాదు. పంటకాలంను పొడిగించరాదు.

**డా|| జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 8332970247**

## చెఱకు

మన రాష్ట్రంలో చెఱకు కర్మాగారాలు నవంబర్ మాసంలో ప్రారంభించి ఏటా 35 లక్షల టన్నుల గానుగాడించి, 3.5 లక్షల టన్నుల పంచదారను ఉత్పత్తి చేస్తున్నారు. గత సంవత్సరం మన రాష్ట్రం సరాసరి పంచదార రికవరీ శాతం 10.36 గా నమోదు చేసుకుంది. అయితే నాణ్యమైన పక్వం చెందిన చెఱకును కర్మాగారాలకు సరఫరా చేస్తేనే అధిక రికవరీ సాధించి, ఎక్కువ పంచదార దిగుబడులను సాధించవచ్చును. అయితే చెఱకు పక్వత రసనాణ్యత వివిధ అంశాలు/పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

దీర్ఘకాలిక రకాలు సాధారణంగా ఎక్కువ చెఱకు దిగుబడులనిస్తాయి. కాని స్వల్పకాలిక రకాలు దీర్ఘకాలిక రకాలకన్నా ఎక్కువ పంచదార శాతాన్ని కలిగి ఉంటాయి. కాలమాన పరిస్థితులకు ఈ స్వల్పకాలిక రకాలు తట్టుకొని పంచదార దిగుబడులను తగ్గకుండా కాపాడుకుంటాయి. అందుకని ఎక్కువ విస్తీర్ణంలో దీర్ఘకాలిక రకాలను మాత్రమే సాగుచేయకుండా కొంత విస్తీర్ణంలో స్వల్పకాలిక రకాలను కూడా కేటాయించడం వలన అధిక పంచదార దిగుబడులను పొందవచ్చును.

చెఱకు పంట పక్వతను గుర్తించుటకు ఆకులు పసుపు రంగుకు మారిన, గడలు బాగా లావై, అక్కడక్కడ చిరు పగుళ్ళు ఏర్పడటం, కన్నులు బాగా ఉబ్బినట్లుండటం, చిట్టచివర నాలుగైదు చెఱకు ఖండాలు ఎదుగుదల తగ్గడం వంటివి ఉంటే చెఱకు పక్వానికి వచ్చిందని నిర్ధారించుకోవచ్చు. ఇంతకంటే చెఱకు పక్వతను బాగా గుర్తించాలంటే ఆ రసములోని ఘనపదార్థ పరిమాణం సమానంగా ఉంటే ఆ తోట పక్వానికి వచ్చినట్లు నిర్ధారించుకోవచ్చు. ఉదాహరణకు కొన్ని చెఱకు రకాలు కో 6907, కో సి 671 వంటి రకాలను ఏ సమయంలో నాటినప్పటికీ పది నెలల వయస్సు వచ్చే సరికి పక్వానికి వస్తాయి.

పూత వచ్చిన నెల రోజుల తరువాత చెఱకు నరికినట్లైతే అటు పంచదార రికవరీలోను, ఇటు చెఱకు దిగుబడులలోను తరుగుదల ప్రభావం కనబడుతుంది. అందుకని చెఱకులో పూత కనబడిన నెల రోజులలోపు చెఱకు గడలను నరికి కర్మాగారాలకు పంపినట్లైతే దిగుబడిలో నష్టం తక్కువగా ఉంటుంది.

మంచి నాణ్యమైన చెఱకు పొందటానికి లోతైన దుక్కి అవసరం. పల్లపు భూముల్లో పెంచిన తోటలు తొందరగా పక్వానికి వస్తాయి. కాని దిగుబడుల నాణ్యత తొందరగా కోల్పోతాయి. ఇటువంటి తోటల్లో పండించిన చెఱకును త్వరగా గానుగాడించవలసి వస్తుంది. బరువైన నేలల్లో పండించిన చెఱకు రసంలో సున్నం, బూడిద అధికంగా ఉండి, భాస్వరం తక్కువగా ఉంటుంది. చౌడు భూముల్లో పెంచిన తోటల్లో రస నాణ్యత తక్కువగా ఉండి చెఱకు ఉప్పగా ఉంటుంది. చెఱకు పక్వానికి వచ్చేటప్పుడు నేలలో తేమ అధికంగా ఉన్నట్లైతే చెఱకు తొందరగా పక్వానికి రాక, సేంద్రియ ఆమ్లములు ఎక్కువై, రసంలో పంచదార ఘనపదార్థములు తక్కువగా ఉంటాయి.

**డా|| యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారత వాతావరణ విభాగం వారి సమాచారం ప్రకారం నైరుతి ఋతుపవనాలు మే 24వ తేదీన కేరళలో ప్రవేశించాయి. రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు మే 26వ తేదీన ప్రవేశించి రెండు రోజుల వ్యవధిలో అంటే మే 28వ తేదీ వరకు రాష్ట్రమంతటా విస్తరించాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో 01.06.2025 నుండి 30.09.2025 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 740.7 మి.మీ. గాను 988.3 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే 33 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైనది. జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే -20 శాతం తక్కువ వర్షపాతం, జులై మాసంలో 5 శాతం సాధారణ వర్షపాతం, ఆగష్టు మాసంలో సాధారణ వర్షపాతం కంటే 75 శాతం మరియు సెప్టెంబర్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే 60 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైనది. నైరుతి ఋతుపవనాలు రాష్ట్రం నుండి మరియు భారత దేశం నుండి అక్టోబర్ 16వ తేదీన నిష్క్రమించాయి.

రాష్ట్రంలో 01.10.2025 నుండి 31.10.2025 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 90.1 మి.మీ. గాను 175.7 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం (95 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో వానాకాలం పంటకాలానికి ఇప్పటి వరకు (24.09.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి - 108 శాతం (6730408), జొన్న - 71 శాతం (36239), మొక్కజొన్న - 124శాతం (644652), ప్రత్తి - 94 శాతం (4594685), కంది - 73 శాతం (491690), పెసర - 72 శాతం (61696), మినుములు - 87 శాతం (28706) మరియు వేరుశనగ - 39 శాతం (10865) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం వానాకాలం పంటకాలంలో ఇప్పటి వరకు 100 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 119 శాతం, పప్పుదినుసులు 74 శాతం, నూనె గింజల పంటలు 66 శాతం సాగుచేయటం జరిగింది.

వాతావరణ విభాగం సమాచారం ప్రకారం నవంబర్ మాసంలో భారతదేశంలో సాధారణ వర్షపాతం (77-123%) నమోదయ్యే సూచనలున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో నవంబర్ మాసంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి మరియు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- అక్టోబర్ మాసంలో 95 శాతం అధిక వర్షపాతం నమోదవడం వలన ఆలస్యంగా విత్తిన వరిలో వరి కంకినల్లి, గింజమచ్చ తెగులు మరియు మెడవిరుపు తెగులు ప్రత్తిలో గులాబి రంగు పురుగు, కందిలో ఆకుచుట్టు పురుగు వేరుశనగలో పొగాకు లద్దెపురుగు మరియు తిక్క ఆకుమచ్చ తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు
- వరిలో మెడవిరుపు తెగులు నివారణకు 2.5 గ్రా. ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ లేదా 1.6 మి.లీ. ఐసోప్రోథయోలేన్ లేదా 2.5 మి.లీ. కాసుగామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉన్నట్లయితే 1 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ + ట్రైసైక్లోజోల్ లేదా 0.4 గ్రా. టెబ్యుకొనజోల్ + ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 75 డబ్ల్యుజి లేదా 2 మి.లీ. పికాక్సీస్ట్రోబిన్ + ట్రైసైక్లోజోల్ లేదా 1 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ + డైఫెన్కొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- వరిలో కంకినల్లి నివారణకు 1 మి.లీ. స్పైరోమేసిఫిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- వరిలో గింజమచ్చ తెగులు నివారణకు 1 మి.లీ. ప్రొపికొనజోల్ + 1 మి.లీ. స్పైరోమెసిఫిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ప్రత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు, పొలం నుండి గుడ్డి పురుగులను ఏరి నాశనం చేయాలి. 2 మి.లీ. క్వినాల్ఫాస్ లేదా 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లీటరు నీటికి కలిపి వారం నుండి 10 రోజులకు ఒకసారి పిచికారి చేయాలి.
- కంది పంటలో ఆకుచుట్టు పురుగు గమనించినచో, నివారణకు 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- వేరుశనగలో పొగాకు లద్దె పురుగు నివారణకు, జల్లెడ ఆకులు ఏరి పురుగులను నాశనం చేయాలి. ఎకరానికి 10-15 పక్షి స్థావరాలను ఏర్పర్చుకోవాలి. పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5 శాతం వేపగింజల కషాయం పిచికారి చేయాలి. ఎదిగిన లార్వా నివారణకు 1 మి.లీ. నొవాల్యూరాన్ లేదా 0.2 మి.లీ. ఫ్లూబెండమైడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- వేరుశనగలో టిక్కా ఆకుమచ్చ తెగులు నివారణకు 1.0 మి.లీ. టెబ్యుకొనజోల్ లేదా 2 గ్రా. క్లోరోథాలోనిల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9704157445

# వరి సూటి రకాలు - విత్తనోత్పత్తిలో పాటించవలసిన మెళకువలు

డా॥ బి. లక్ష్మీప్రసన్న, డా॥ శ్రీధర్ సిద్ది, డా॥ వై. చంద్రమోహన్, డా॥ ఎమ్. పరిమళ్ కుమార్, డా॥ టి. కిరణ్‌బాబు,
డా॥ ఐ. అరుణ శ్రీ మరియు డా॥ ఐ. స్వర్ణలతా దేవి

**వరి పరిశోధన విభాగం, ఏ ఆర్ ఐ, రాజేంద్రనగర్, పిజెటిఏఎయు**





ప్రస్తుత కాలంలో పెరుగుతున్న దేశ జనాభా మరియు తరుగుతున్న సహజ వనరులను దృష్టిలో పెట్టుకున్నట్లైతే ఆహార భద్రతను కల్పించి వరిలో సగటు ఉత్పాదకతను అధికం చేయాల్సిన అవసరం ఉంది.

మనదేశంలో వరి ప్రధాన ఆహార పంట. తెలంగాణలో వరి దాదాపు 55 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు అవుతుంది. అధిక దిగుబడినిచ్చే వివిధ కొత్త రకాలు వరిలో అందుబాటులో ఉన్నాయి. మంచి అన్నం నాణ్యత కలిగిన రకాలైన తెలంగాణ సోనా (ఆర్.ఎన్.ఆర్ 15048), కె.ఎన్.ఎమ్ 1638 (కూనారం వరి-2) వంటి రకాలు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఇటువంటి రకాలతో రైతులు మంచి దిగుబడిని పొందవచ్చు.

అయితే వరిలో దిగుబడిని ప్రభావితం చేసే వివిధ అంశాల్లో నాణ్యమైన విత్తనాన్ని ఉపయోగించడం ప్రధానమైన అంశం. నాణ్యమైన విత్తనం అంటే కనీస నాణ్యతా ప్రమాణాలను అనుసరించి, అధిక జన్యుస్వచ్ఛత, అధిక మొలకశాతం కలిగి, అతి తక్కువ జడ పదార్థం, తక్కువ సంఖ్యలో కలుపు, తక్కువ సంఖ్యలో ఇతర పంటల విత్తనాలను కలిగి తెగుళ్ళ బారిన పడని విత్తనం.

రైతులకు ప్రతీ సీజన్లో వారికి కావలసిన అధిక మొత్తమైన విత్తనాన్ని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కానీ, వ్యవసాయ విశ్వవిద్యాలయ సంస్థలు కాని, ప్రైవేట్ సంస్థలు కానీ సరఫరా చేయలేవు. అందుకే రైతుల వారికి కావలసిన నాణ్యమైన విత్తనాన్ని తక్కువ ఖర్చుతో వారి పొలంలో తమంతట తాము తయారు చేసుకున్నట్లైతే నాణ్యమైన విత్తనం పొందడమే కాకుండా ఒక ఎకరానికి ఖర్చయ్యే విత్తన మొత్తం అంటే దాదాపు ఎకరానికి రూ. 800 నుండి రూ. 1000 వరకు ఆదా చేసుకోవచ్చు.

సామాన్యంగా ఒకే రకమైన విత్తనాన్ని కొంతకాలం సాగుచేసిన తర్వాత నాణ్యత, దిగుబడి తగ్గుతాయని అపోహ అందరి రైతుల్లోనూ ఉంది. కానీ ఇటువంటి పరిస్థితి యాంత్రిక కల్తీవల్లనో లేదా చీడపీడలు / తెగుళ్ళను నివారించగలిగితే నాణ్యమైన విత్తనాన్ని పొందవచ్చు.

- నాణ్యమైన విత్తనం కోసం మొదటగా ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులను బట్టి అనువైన రకాలను ఎంచుకోవాలి.
- విత్తన నాణ్యత దెబ్బతినకుండా ఉండాలంటే విత్తనోత్పత్తిని సారవంతమైన మంచి నీటి వసతి ఉన్న పొలాల్లోనే చేయాలి.
- విత్తనోత్పత్తి చేసే పొలం చుట్టూ అదే పంట వేరే రకానికి కనీసం 3 మీటర్లు అంతర దూరం పాటించాలి.
- అంతకు ముందు పంటకాలంలో అదే రకం కనీస పొలంలో లేదా వేరే పంట వేసిన పొలంలో సాగు చేసినట్లైతే స్వయంగా ఉత్పత్తి అయ్యే మొలకల వల్ల కల్తీ జరగకుండా ఉంటుంది.

- నారుమడిని తయారీకీ 2 వారాల ముందు 2 గుంటల నారుమడికి 2 క్వింటాళ్ళు బాగా మాగిన పశువుల ఎరువును వేసి పొలాన్ని 2-3 సార్లు కలియదున్నాలి.
- ఒక ఎకరానికి సరిపోయే నారుమడికి (5 సెంట్లు) 2-3 కిలోల యూరియా 4-5 కిలోల డి.ఎ.పి, 2-3 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి.
- నాట్లు వేసేటప్పుడు 20-30 రోజుల వయస్సు గల నారును కాల పరిమితిని బట్టి వేయాలి.
- జింకులోప లక్షణాలు కన్పించినట్లైతే 2 గ్రా. జింకు సల్ఫేట్ 1 లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.
- నారుమడిలో ఒక ఎకరాకు సరిపోయే నారుకి 800 గ్రా. చొప్పున కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు బురద పదనుకు వేసుకున్నట్లైతే మొగిపురుగు మరియు ఉల్లికోడు ఉధృతిని తగ్గించుకోవచ్చు. నారు పీకడానికి వారం రోజుల ముందుగా ఈ గుళికలు వేసుకున్నట్లైతే ప్రధాన పొలంలో 30 రోజుల వరకు రక్షణ కల్పించవచ్చు.
- కుదురుకి 2-3 మొక్కలని పైపైన నాటుకోవాలి. ఇలా నాటుకున్నట్లైతే గాలి బాగా సోకి మొక్కలు ఎక్కువ పిలకలు చేసే అవకాశం ఉంటుంది.
- ప్రతీ 2 మీటర్లు ఊడ్పుకి 20 సెం.మీ. కాలిబాటలు వదలాలి. దీని వల్ల మొక్కలకు గాలి, వెలుతురు బాగా తగిలి దోమ ఉధృతి తగ్గుతుంది.
- పైరు నాటిన 40 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.
- వరి విత్తనోత్పత్తిని సాధారణ వరి సాగుతో పోల్చినప్పుడు వేరు చేసే అతి ప్రధానమైన అంశం బెరుకుల ఏరివేత.
- బెరుకుల ఏరివేత 3 దశల్లో చేపట్టాలి.

అందులో మొదటి దశ పైరు దుబ్బు చేసే సమయం. ఈ సమయంలో మనం సాగు చేసే రకం భౌతిక లక్షణాలను బట్టి అంటే పైరు ఎత్తు, ఆకు రంగు, దుబ్బుచేసే గుణం ఇటువంటి లక్షణాలకు భిన్నంగా ఉన్న మొక్కలను అంటే పొట్టిగా లేదా పొడవుగా, ఆకురంగుల్లో మార్పు, ఇతరత్రా భౌతికంగా వేరుగా ఉండే మొక్కలను వేర్లతో సహా తీసివేయాలి.

**రెండవ దశ పూత దశ:** ఈ దశలో మనం సాగుచేసే రకం కంటే ముందుగా గానీ లేదా ఆలస్యంగా గానీ పూతకు వచ్చే మొక్కలను మరియు పోటాకు అమరికలో వ్యత్యాసం ఉన్న మొక్కలను గుర్తించి పూర్తిగా తీసివేయాలి.

**మూడవ దశ గింజ గట్టిపడే దశ:** ఈ దశలో వెన్ను లక్షణాలు, గింజ రంగు, గింజ ఆకారం, గింజ పరిమాణం మొదలగు లక్షణాల్లో తేడాగా ఉన్న మొక్కలను గుర్తించి సమూలంగా తీసివేయాలి.

పై విధంగా మూడు ముఖ్యమైన దశల్లో కేళీలను/ బెరకులను గుర్తించి ఏరి వేయాలి.

- భూసార పరీక్షననుసరించి సిఫార్సు చేసిన మేరకే ఎరువులను వేయాలి. భాస్వరంగానీ, భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులను గానీ పైపాటుగా వేయరాదు.
- విత్తన పంటకు మామూలు వాణిజ్య పంటలాగే నీటి యాజమాన్యం పాటించాలి.
- ముఖ్యంగా కీలక దశలైన అంకురం ఏర్పడడం, పూతదశ, గింజపాలు పోసుకుని, గింజగట్టి పడే దశల్లో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి.

ధృవీకరణ వరి విత్తన నాణ్యతా ప్రమాణాలు (శాతాల్లో)

| | | |
|---|---|---|
| జన్యు స్వచ్ఛత | : | 98% |
| భౌతిక స్వచ్ఛత | : | 98% |
| జడ పదార్థం | : | 2% |
| మొలక శాతం | : | 80% |
| తేమ శాతం | : | 13% |

**ఇతర పంటలు లేదా రకాలు విత్తనాలు :** 20 గింజలు / కిలో

పై పొట్టు లేని గింజలు : 2

- అయితే మొదటిసారిగా వరి స్వయం విత్తనోత్పత్తి చేసే రైతులు బ్రీడరు విత్తనాన్ని కొనుగోలు చేసి దాని నుండి తర్వాత పంటకాలాలకు సరిపోయే నాణ్యమైన విత్తనాన్ని తయారు చేసుకోవచ్చు.
- పైన సూచించిన మెళకువలను పాటించినట్లైతే రైతులు నాణ్యమైన విత్తనం పొందడమేకాక, విత్తన ఖర్చును తగ్గించుకొని ఇతర రైతులకు విత్తనాన్ని పంచుతూ, ఆదర్శంగా నిలవవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9573316477

# వరిలో జింక్ ధాతువు లోపం - యాజమాన్యం

డా॥ జె. భార్గవి, డా॥ ఆర్. శ్రవన్ కుమార్, కె. మానస, బి. మాధవి, బి. సౌందర్య, డా॥ జి. శేషు, డా॥ వై. హరి, డా॥ డి. వీరన్న, డా॥ యల్. కృష్ణ మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్



తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తారంగా సాగవుతున్న ప్రధాన ఆహారపు పంట వరి. కానీ మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన ఆలస్యంగా వర్షాలు కురవడం, చీడపీడల ఉధృతి పెరగడం, విచ్చల విడిగా రసాయన ఎరువులు వాడకం, కూలీల సమస్య వలన ఆలస్యంగా నాట్లు వేసుకొనే కారణాల చేత, సాగు ఖర్చులు పెరగడమే కాకుండా దిగుబడులు కూడా ఆశించినంతగా రావడం లేదు.

ముఖ్యంగా వానాకాలంలో వరి దిగుబడులు తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో స్థూల పోషకాలతోపాటు సూక్ష్మపోషకాలు మొక్క ఎదుగుదలకు తోడ్పడుతాయి. ఈ సూక్ష్మ పోషకాలలో జింక్ ధాతువు చాలా ముఖ్యమైనది. చాలా చోట్ల వరి నారుమళ్ళు మరియు ప్రధాన పొలాల్లో ఈ జింక్ ధాతు లోపం ప్రధాన సమస్యగా మారింది.

జింక్ తక్కువగా ఉండే నేలల్లో, ముఖ్యంగా సున్నపు నేలలు మరియు ఇసుక నేలల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండి జింక్ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. నేలల్లో సేంద్రియ కర్బనం తక్కువగా ఉన్నా, ఈ పోషక లోపం ఏర్పడుతుంది. భాస్వరం ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల కూడా జింకు లోపం కనిపిస్తుంది. అధిక క్షార నేలలు మొక్క జింక్ గ్రహించడాన్ని నిరోధిస్తాయి. కాబట్టి నేల ఉదజని సూచిక పెరిగే కొద్దీ జింక్ లోపం కనిపిస్తుంది.

వరి నారు మడిలో మరియు నాట్లు వేసుకున్న 20 నుండి 40 రోజుల వరకు జింక్ లోపం కనిపిస్తుంది. మొక్కలు గిడసబారి చివరి ఆకులు కుచ్చుగా మారతాయి. ఆకులు సాధారణ పరిమాణం కంటే సులువుగా పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. ఆకుల చివరి భాగంలో ఈనెల ఇరువైపులా ఇటుక రంగు మచ్చలు ఏర్పడుతాయి. అవి ఆకు అంతా వ్యాపించి ఆకులు లేత ఎరుపు లేదా ఇత్తడి రంగులోకి మారతాయి. జింక్ లోపం వలన మొక్కలలో జరిగే జీవ, రసాయన చర్యలకు అంతరాయం ఏర్పడి మొక్క ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతుంది. జింక్ లోపాన్ని సవరించకపోతే పిలకలు తగ్గి పంటకాలం పెరుగుతుంది.

జింక్ లోపాన్ని రెండు విధాలుగా నివారించుకోవచ్చు. నేలలో జింక్ లోపం ఉంటే నాట్లు వేయడానికి ముందు ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. ఒకవేళ మొక్కలు పెరుగుతున్నప్పుడు జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్‌ను కలుపుకొని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.

జింక్‌ను భాస్వరంతోపాటు కలిపి చల్లకూడదు. రెండూ కలిపి చల్లితే వాటి మధ్య రసాయనిక చర్య జరిగి జింక్ ధాతువు మొక్కకు అందకుండా పోతుంది. సమస్యాత్మక నేలలైతే ఎకరాకు 40 కిలోలు వేయాలి. సుమారు 200 కిలోల సేంద్రియ ఎరువును 15 కిలోల జింక్ సల్ఫేట్‌తో కలిపి ఒక నెల మాగనిచ్చి నాటు ముందు వేస్తే జింక్ సామర్థ్యం పెరుగుతుంది. జింక్ సల్ఫేట్ ద్రావణంలో ఎలాంటి తెగుళ్ళు పురుగుల మందులు కలిపి పిచికారి చేయకూడదు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9885257714

# యాసంగి మొక్కజొన్న సాగు పై రైతులకు ఉపయోగకరమైన సూచనలు

డా॥ డి. శ్రావణి, డా॥ డి. భద్రు, డా॥ బి. మల్లయ్య, డా॥ సి.హెచ్. అనూష, డా॥ సుశీల మరియు డా॥ యం. సుజాత

మొక్కజొన్న పరిశోధన విభాగం, రాజేంద్రనగర్



తెలంగాణ రాష్ట్రంలో యాసంగి కాలంలో మొక్కజొన్న పంట సుమారు ఐదు లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధానంగా నిర్మల్, ఖమ్మం, వరంగల్ మరియు మహబూబాబాద్ జిల్లాల్లో సాగవుతున్నది. యాసంగిలో నీటిపారుదల సౌకర్యం క్రింద మొక్కజొన్నను పండించి మంచి దిగుబడులు తీసుకోవచ్చు. మొక్కజొన్న ఉత్పత్తిని మనదేశంలో ప్రధానంగా కోళ్ళ దాణా పరిశ్రమలో 47%, పశువుల దాణా కొరకు 13%, స్టార్చ్ ఉత్పత్తిలో 14%, మరియు ఇతర ఉత్పత్తిలో 23% వాడటం జరుగుచున్నది. ముఖ్యంగా మన దేశంలో మొక్కజొన్న ఉత్పత్తిని రాబోయే 2030 సంవత్సరంలోపు 45 మిలియన్ టన్నులకు అలాగే 2047 వరకు 100 మిలియన్ టన్నులు ఉత్పత్తిని సాధించాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకోవడం జరిగింది.

మొక్కజొన్న ఉత్పత్తిని బయో ఇథనాల్ తయారీ కొరకు రాబోయే 2030 సంవత్సరంలోపు లక్ష్యాన్ని సాధించాలంటే మరో 18-20 మిలియన్ టన్నుల అదనపు ఉత్పత్తిని చేపట్టాలి. జాతీయ మరియు అంతర్జాతీయ అవసరాల రీత్యా మంచి మార్కెట్ ఉండటం వలన మరియు అధిక దిగుబడిని ఇచ్చే పంట కావడం వలన రైతులు మొక్కజొన్న సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రింది సాగు సూచనలు పాటించినచో మంచి దిగుబడులు పొందవచ్చు.

**విత్తుకునే సమయం:** అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 లోపు విత్తుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు. వరి మాగాణుల్లో ఆలస్యంగా విత్తుకోవలసిన పరిస్థితుల్లో నవంబర్ చివరి వారంలోపు విత్తుకోవచ్చు.

**విత్తన మోతాదు మరియు మొక్కల సాంద్రత:** ఎకరానికి 7-8 కిలోల విత్తనం మరియు 33,000 మొక్కలు తప్పనిసరిగా ఉండాలి.

**విత్తే దూరం:** వరుసల మధ్య 60 సెం.మీ. మరియు మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం పాటించాలి.

**విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 6.0 మి.లీ సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సామ్ కలిపి విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే తొలి దశలో ఆశించే కత్తెర పురుగును నివారించుకోవచ్చును.

**హైబ్రిడ్ ఎంపిక:** ప్రభుత్వ మరియు గుర్తింపు పొందిన ప్రైవేట్ రంగ సంస్థల యొక్క దీర్ఘకాలిక మరియు మధ్య కాలిక హైబ్రిడ్‌లను ఎంచుకోవాలి. మొక్కజొన్న పరిశోధన విభాగం, రాజేంద్రనగర్ నుండి విడుదలైన డిహెచ్ఎమ్-206, డిహెచ్ఎమ్-117 మరియు డిహెచ్ఎమ్-121 వంటి ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రీడ్స్‌ను ఎంచుకోవచ్చు.

**ఎరువుల యాజమాన్యము:** విత్తే ముందు ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ భూమిలో వేసి కలియదున్నాలి. వరి మాగాణుల్లో కూడా జింకు లోపం కనిపించవచ్చు. పంట పెరిగే దశలో కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రా. చొప్పున, రెండు సార్లు వారం వ్యవధిలో పిచికారి చేయాలి.

- చలి తీవ్రత వలన పంట పై భాస్వరం లోపం (ఆకులు ఊదా రంగులోకి మారడం) కనిపించవచ్చు. ఈ లోపాన్ని సవరించడానికి ఎకరానికి 19-19-19 కిలో (5 గ్రా. లీటరు నీటికి) లేదా డి.ఎ.పి. 1% (10 గ్రా. లీటరు నీటికి) రెండు సార్లు వారం వ్యవధిలో పైరుపై పిచికారి చేయాలి.
- ఎకరానికి 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం మరియు 32 కిలోల పొటాష్‌ను అందించాలి. అనగా 70 కిలోల డి.ఎ.పి., 50 కిలోల యూరియా, 27 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ లను విత్తే ముందు, 30-35 రోజుల దశలో అంతర కృషి తర్వాత 50 కిలోల యూరియా మరియు 65-70 రోజుల దశలో మరో 50 కిలోల యూరియా, 27 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.

**కలుపు యాజమాన్యము:** విత్తిన తరువాత అట్రజిన్ 50% డబ్ల్యూపి అనే కలుపు మందును ఎకరాకు 1 కిలో 200 లీటర్ల నీటిలో కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు నేలపై పిచికారి చేయాలి. పైరు 20-25 దశలో కలుపు సమస్య ఎక్కువగా ఉంటే టెంబోట్రియోన్ 34.4% ఎస్‌సి 115 మి.లీ. లేదా టోప్రమిజోన్ 36 మి.లీ.+400 గ్రా. అట్రజిన్ కలిపి లేదా మిసోట్రియన్ (2.27%). + అట్రజిన్ (22.7% ఎస్‌సి) ఎకరాకు 1400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తిన 30 నుండి 35 రోజులకు కల్టివేటర్‌తో అంతరకృషి చేసి కలుపు మొక్కలను పూర్తిగా నివారించవచ్చు.

**కత్తెర పురుగు నివారణ:** ప్రస్తుతం మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు కంటే కూడా కత్తెర పురుగు సమస్య అధికంగా ఉన్నది. ఈ పురుగు ఆకు మరియు కాండంపై రంధ్రాలు చేసి మొక్కలకు నష్టంచేసి పెరగకుండా చేస్తుంది. దీని నివారణకు విత్తనశుద్ధి చేసుకోవాలి. ఉధృతి ఎక్కువైనప్పుడు 30 శాతం వరకు దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. నివారణకు లార్వా తొలి దశలో వేపనూనె (అజాడిరాక్టిన్ 1500 పిపిఎం) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అలానే పంట 20-25 రోజుల దశలో కూడా పురుగు ఉధృతిని గమనించినట్లయితే స్పైనటోరం 0.5 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళ యాజమాన్యము:** యాసంగిలో పూతదశ అనంతరం ఎండు తెగుళ్ళు ఆశించినప్పుడు సోకిన మొక్కలు తీసివేసి 100 కిలోల పశువుల ఎరువులో 2 కిలోల ట్రైకోడెర్మా విరిడె కలిపిన మిశ్రమాన్ని పంట వరుసల మధ్య చల్లుకోవాలి.

**పంట కోత మరియు నూర్పిడి:** ప్రస్తుత వివిధ రకాల పంటకోత అలానే కోత మరియు నూర్పిడి కలిసి చేసే యంత్రాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. చాలా తక్కువ సమయంలో కోత మరియు నూర్పిడి పూర్తిచేసుకొని, గింజలను 12-14% తేమ ఉండేటట్లు ఆరబెట్టుకొని తర్వాత మార్కెట్‌కు తరలించాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8464943732**

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయశాఖ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న "రైతు నేస్తం"

### రైతు వేదికల వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా శాస్త్రవేత్తల - రైతుల ముఖాముఖి - నవంబర్ 2025

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| 1 | 04.11.2025 | ప్రస్తుత పంటలలో సస్యరక్షణ | **డా॥ ఎ. పద్మశ్రీ,** ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం ఫోన్ నెం.: 9000791123 |
| | | | **డా॥ వి. దివ్య రాణి,** శాస్త్రవేత్త (పాథలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.: 9603012196 |
| | | ప్రస్తుత పంటలలో యాజమాన్యం | **డా॥ జె.ఎస్. సుధారాణి,** సీనియర్ శాస్త్రవేత్త (అగ్రానమి) ఎలక్ట్రానిక్ వింగ్, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9550526096 |
| 2 | 11.11.2025 | యాసంగికి అనువైన వరి రకాలు | **డా॥ బి. లక్ష్మీ ప్రసన్న,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9573316477 |
| 3 | 18.11.2025 | జీరో టిల్లేజ్ పద్ధతిలో అనువైన పంటల సాగు | **డా॥ ఎ.వి. రామాంజనేయులు,** ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్ ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ అగ్రో ఫారెస్ట్రీ, రాజేంద్రనగర్, ఫోన్ నెం.:8333818216 |
| 4 | 25.11.2025 | యాసంగి అపరాల్లో సస్యరక్షణ | **డా॥ ఎస్. మాలతి,** ప్రొఫెసర్ (ఎంటమాలజీ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంటమాలజీ, వ్యవసాయ కళాశాల, వరంగల్ ఫోన్ నెం.: 9848481818 |

# రైతుకు లాభదాయకమైన జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగులో పాటించవలసిన మెళకువలు

డా॥ ఇ. రజనీకాంత్, డా॥ జి. ఉషారాణి, డా॥ ఇ. ఉమారాణి, డా॥ బి. హరికృష్ణ,
డా॥ కె. మధన్‌మోహన్ రెడ్డి, డా॥ ఎమ్. రాజేంద్రప్రసాద్ మరియు డా॥ బి. రాంప్రసాద్
వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్.



రైతులు ఖరీఫ్‌లో వరిసాగు చేసి రబీలో వరి సాగు చేయటానికి వీలులేని పరిస్థితిలో ఆరుతడి పంట క్రింద మొక్కజొన్నను నేరుగా దుక్కి దున్నకుండా తక్కువ ఖర్చుతో సాగుచేయవచ్చు. నేలను దుక్కి దున్న కుండా పంట సాగు చేయడాన్ని జీరో టిల్లేజ్ అంటారు. ముఖ్యంగా రబీ కాలంలో ఈ పద్ధతిని నీటి లభ్యత తక్కువగా ఉన్నచోట అవలంభించవచ్చు. ఇటీవలి కాలంలో ఈ పద్ధతి మొక్కజొన్న సాగుకి చాలా ప్రాచుర్యం పొందుతుంది. ఈ పద్ధతిలో ఖరీఫ్ వరి చేను కోసిన తర్వాత పొలంలో వరి కొయ్యకాళ్లలో దుక్కి దున్నకుండా నేలలో పదను చూసుకొని మొక్కజొన్న తాడుతో కాని సీడ్‌డ్రిల్‌తో గాని విత్తుకోవాలి.

**జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగుతో పాటించాల్సిన మెళకువలు**

1. తెలంగాణతో వరి పంట కోసిన తర్వాత అనగా నవంబర్-డిసెంబర్ మాసంలో మొక్కజొన్న విత్తుకోవాలి. ఆ తర్వాత విత్తినట్లైతే దిగుబడి తగ్గే అవకాశం ఉంది.
2. వరి కోసేటప్పుడు సాధ్యమైనంత వరకు నేలకు దగ్గరగా కోయాలి.
3. బరువైన మరియు తేమను నిలుపుకొను నేలలు మాత్రమే సాగుకు అనుకూలం. మొక్కజొన్న విత్తేటప్పుడు నేలలో సరైన పదును ఉండేటట్లు చూసుకోవాలి. ఒకవేళ పదునులేనిచో తేలికపాటి నీటితడి ఇచ్చి విత్తుకోవాలి.
4. ఏ మొక్కజొన్న రకాలైన ఈ పద్ధతిలో సాగుచేయవచ్చు. సాధారణంగా తాడును ఉపయోగించుకొని పుల్లతో కాని లేదా సీడ్‌డ్రిల్‌తో గాని వరుసకు వరుసకు మధ్య 60 సెం.మీ. మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీ. ఉండేటట్లు ఉంచి విత్తుకోవాలి. పుల్లతో విత్తేటప్పుడు గింజ పెట్టి మట్టితో కప్పుకోవాలి.
5. విత్తిన తర్వాత సరైన తేమ లేకపోతే 1-2 రోజుల్లో తేలికపాటి తడి ఇవ్వాలి.
6. వరి మాగాణుల్లో కలుపు ఎక్కువగా ఉంటుంది. మరియు వరి కొయ్యలు మళ్ళీ చిగురించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కావున విత్తిన 2 రోజుల్లోపు నేలలో సరైన తేమ ఉన్నప్పుడు కలుపు మందు 1 కిలో అట్రజిన్ 50% డబ్ల్యుపి+ పారాక్వాట్ డైక్లోరైడ్ 24% ఎస్ఎల్ అనే కలుపుమందు 1 లీటరు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఈ యొక్క అట్రజిన్ మరియు పారాక్వాట్ డైక్లోరైడ్ అను గడ్డిమందులు వరి మొలకలను మరియు మొలకెత్తిన కలుపు మొక్కలను చంపుతుంది. అట్రజిన్ గడ్డిమందు కొత్త కలుపును మొలకెత్తకుండా చేస్తుంది. ఒకవేళ విత్తిన తర్వాత కలుపు మొలిస్తే వెడల్పాకు కలుపు నివారణకు 2-4,డి - సోడియం సాల్ట్ 400 గ్రా॥ మందును 200 లీ॥ నీటిలో కలిపి కలుపు మొక్కల పై పడేట్లు పిచికారి చేయాలి.
7. ఈ జీరోటిల్లేజ్ పద్ధతిలో పంట కోసేవరకు ఎలాంటి అంతర కృషి చేయనవసరం లేదు.

**ఎరువుల యాజమాన్యం:** ఎకరాకు 96-32-32 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరానికి యూరియా 50 కిలోలు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 200 కిలోలు, మరియు మ్యూరేట్ ఆఫ్ పొటాష్

25 కిలోలను బాగా కలిపి మొలక వచ్చిన 10-15 రోజులకు కుదురుకు ఒకే మొక్క ఉండేటట్లు చూసుకొని మొక్కకు 5 సెం.మీ. దూరంలో పదనులో వేసుకొని మట్టికప్పాలి. 25-30 రోజుల మధ్య, మరో 50 కిలోల యూరియాను మరియు 60-65 రోజులప్పుడు 50 కిలోల యూరియాతోపాటు 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పైన తెలిపిన విధంగా వేసుకోవాలి. జీరో టిల్లేజ్ సీడ్ డ్రిల్ గానీ హ్యాపి సీడర్ యంత్రాలతో విత్తినప్పుడు విత్తనంతో పాటు ఎరువులు కూడా వేసుకునే సౌలభ్యం కలుగుతుంది.

జింక్ లోపమున్న మొక్కల్లో కొత్తగా వచ్చే ఆకులకు జింక్ అందకపోవడంతో దాదాపు తెల్లగా మారతాయి. దీనిని తెల్ల మొగ్గ అంటారు. నివారణకు 2 గ్రా. జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**నీటి యాజమాన్యం:** మొక్కజొన్నలో పూతకు ముందు (మోకాలెత్తు దశ), పూతదశ, గింజ పాలు పోసుకునే దశలు చాలా సున్నితమైనవి. కావున ఈ దశల్లో నీరు తప్పని సరిగా పెట్టుకోవాలి. మొక్కజొన్న తొలి దశలో అనగా 40 రోజుల్లోపు అధిక నీరు హానికరం. ఎక్కువ నీరు పెట్టినచో వరి మాగాణులు కాబట్టి నీరు నిలిచి మొక్క ఎర్ర బడిపోతుంది. ముఖ్యంగా ఆకులు చుట్టలు చుట్టుకుపోయినట్లైతే నీటి ఆవశ్యకత ఉన్నట్లు గ్రహించి నీటి తడులు ఇవ్వాలి.

**పంట కోత:** సాధారణంగా పంటకోతకు వచ్చినట్లైతే బుట్ట ఎండిపోయి క్రిందకు వేలాడుతూ ఉంటుంది. గింజను పరిశీలించినట్లైతే గట్టిగా ఉండి క్రింది భాగంలో నల్లని చారలు ఉండటం గమనించవచ్చు. ఈ దశలోనే పంటకోత చేపట్టాలి.

### సస్యరక్షణ:

**కాండం తొలుచు పురుగు:** ఈ రకం పురుగు లార్వాలు ఆకులు విచ్చుకోకముందే ఆకులు తినడం వల్ల ఆకులపై గుండ్రని చిల్లులు ఏర్పడతాయి. పెరిగిన లార్వాలు కాండంలోకి చొచ్చుకుపోయి లోపలి భాగాలను తినివేస్తాయి. ఈ విధంగా చేయడం వల్ల మొవ్వు ఎండిపోయి చనిపోతుంది. కాండం చీల్చి చూసినట్లైతే 4-5 లార్వాలు ఒక చోట కనిపిస్తాయి. దీని నివారణకు గాను క్లోరిపైరిఫాస్ 2.5 మీ॥ నీటికి కలిపి 10-15 రోజుల పైరు మీద పిచికారి చేయాలి. ఆ తర్వాత కూడా పురుగు ఉధృతి కనబడిన ఎడల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు ఎకరాకు 3 కిలోలు చొప్పున ఆకుల సుడుల్లో కాని లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మి.లీ॥ ఎకరాకి 200 లీ॥ నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక:** ఇది మగ పుష్పం కి ఆశించి రసం పీల్చి పుప్పొడి ఉత్పత్తిని దెబ్బతీస్తుంది. కావున దీని నివారణకు డైమిథోయెట్ 2 మి.లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఎండుతెగులు:** ఈ తెగులు ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలో అధికంగా వస్తుంది. ఈ తెగులు ఆశించిన తర్వాత ఈ తెగులు లక్షణాలు పుష్పించిన తర్వాత గింజపాలు పోసుకునే దశలో కనిపిస్తాయి. మొక్కల పై నుంచి క్రిందకు ఆకులు లేత ఆకుపచ్చ నుంచి పసుపు రంగులోకి మారి ఎండిపోతాయి. క్రింద కణుపులు గోధుమ రంగులోకి మారి మెత్తబడతాయి. కాండాన్ని చీల్చినట్లైతే లోపల నాళాలు ఎరుపుతో కూడిన గోధుమ రంగులో ఉంటాయి.

**నివారణ:** పంట అవశేషాలను తీసివేయాలి. ఈ తెగుళ్ళను తట్టుకునే రకాలను ఎంచుకోవాలి. పంటకు నీటి ఎద్దడి రాకుండా దగ్గరి దగ్గరి తడులు ఇవ్వాలి. సేంద్రియ ఎరువులను వేసుకోవాలి. ట్రైకోడెర్మావిరిడి లేదా సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ వంటి జీవ నియంత్రణ శిలీంద్రాలను 2 కి॥, 90 కి॥ పశువుల పెంట, 10 కి॥ వేప పిండిలో కలిపి 15-20 రోజులు నీడలో ఉంచి వృద్ధి చెందించి ఒక ఎకరాకు వేసి నీరు పెట్టుకోవాలి.

**టర్సెకమ్ ఆకు ఎండు తెగులు:** ఆకులపై పొడవైన గోళాకారం బూడిదరంగుతో కూడిన గోధుమ రంగు మచ్చలు 2.5 సెం.మీ. నుండి 25 సెం.మీ. పొడవు మరియు 4 సెం.మీ. వెడల్పుతో ఏర్పడతాయి. ఈ మచ్చలు మొదట క్రింది ఆకులపై ఏర్పడి లేత ఆకులకు వ్యాపిస్తుంది. ఈ తెగులు ఎక్కువైతే ఆకు అంతా ఎండి మొక్క చనిపోతుంది. దీని నివారణకు 500 గ్రా. మ్యాంకోజెబ్ ఎకరాకు 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి.

### జీరో టిల్లేజ్ వల్ల కలిగే లాభాలు:

1. పొలం తయారయ్యే ఖర్చు మరియు నీటి యాజమాన్యానికి అయ్యే ఖర్చును తగ్గించవచ్చు.
2. ప్రధాన పొలం తయారుకయ్యే సమయం తగ్గించవచ్చు.
3. 2-3 తడులు తగ్గుతాయి.
4. అంతర కృషి చేయవలసిన అవసరం లేదు.
5. మొక్క మొలకెత్తినప్పటి నుంచి వేరు వ్యవస్థ బలంగా ఉండి గాలికి పడిపోదు.
6. మొక్కల ఎదుగుదల ఒకే రకంగా ఉండి దిగుబడి కూడా పెరుగుతుంది.
7. పంట కాలం 10-15 రోజులు తగ్గుతుంది.
8. వరికొయ్య కాళ్ళు భూమి పై పరుచుకొని ఉండటం వల్ల కలుపు తగ్గడమే కాకుండా నేలలో తేమ కూడా చాలా రోజుల వరకు ఉంటుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9908698043**

# పశుగ్రాస జొన్న సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు

డా॥ యస్. మహేశ్వరమ్మ, డా॥ కె. సుకుమార్, డా॥ కె. ప్రభావతి మరియు డా॥ సి.హెచ్. దామోదర్ రాజు
విత్తన పరిశోధన మరియు సాంకేతిక సంస్థ, రాజేంద్రనగర్



వ్యవసాయ ఆధారితమైన మన భారతదేశంలో 65 శాతం మంది ప్రజలు గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా కలిగి ఉన్నారు. అదనపు ఆదాయం కొరకు, కొంతమంది ప్రజలు పశుపోషణను అదనపు వృత్తిగా చేపట్టుతున్నారు. అయితే ప్రస్తుత వాతావరణ ఒడిదుడుకుల దృష్ట్యా మరియు పాలు, పాల ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ వల్ల పశుపోషణ అనేది క్రమేణ ఆదాయాన్ని ఆర్జించే ప్రధాన వనరుగా మారిపోతుంది. మనదేశంలో పశుసంపద అధికంగా ఉన్నప్పటికీ పాడి ఉత్పత్తులు, వాటి దిగుబడులు ఆశించిన స్థాయిలో లేవు. దీనికి నాణ్యమైన పశుగ్రాస కొరత, పశుగ్రాసాల సాగు చేపట్టకపోవడం, వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గుచూపడం లాంటివి కారణాలుగా చెప్పుకోవచ్చు.

జొన్నలో ఉండే ప్రత్యేక గుణాల వలన ఈ పంటను ముఖ్య పశుగ్రాస పంటగా పరిగణిస్తారు. పశుగ్రాస జొన్న సాగులో మనకు అందుబాటులో ఉన్న నీటి వసతి, మనం సాగుచేసే భూమి, దాని తర్వాత సాగుచేసే పంట మొదలగు అంశాలను దృష్టిలో ఉంచుకొని రకాలను ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. పశుగ్రాస జొన్నలో ప్రధానంగా 3 రకాలు కలవు.

**1. ఒక్కసారే కోతకు వచ్చే రకాలు:** ఇవి కేవలం ఒక్కసారే కోతకు వస్తాయి. వీటిని వర్షాధారంగా లేదా నీటి పారుదల సౌకర్యం ఉన్న ప్రదేశాలలో సాగు చేయవచ్చు. 70-80 రోజుల్లో కోతకు వస్తాయి. హెక్టారుకు 45-55 టన్నుల వరకు పచ్చిగడ్డి, 11-14 టన్నుల వరకు ఎండుగడ్డిని ఇస్తాయి. రైతులు తమ పొలాలలోనే కొంత భాగాన్ని విత్తనం కొరకు కేటాయించి విత్తనం తయారు చేసుకుంటే రైతులు లాభదాయకంగా ఉంటుంది. విత్తనం సుమారుగా 130-140 రోజులలో తయారవుతుంది. విత్తన దిగుబడి హెక్టారుకు 8-14 క్వింటాళ్ళ వరకు ఉంటుంది.

**కొన్ని రకాలు:** పూసా చారి 6, పంథ్ చారి 5, సియస్‌వి 21 ఎఫ్, సియస్‌వి 30 ఎఫ్, హెచ్‌సి 171, కె1, కె3, కె7

**2. కోతనిచ్చు రకాలు:** ఇవి 60-65 రోజుల్లో మొదటిసారి కోతకు వస్తాయి. మొదటికోతలో హెక్టారుకు 40-45 టన్నుల పచ్చిమేత, తరువాత కోతల్లో 20-25 టన్నుల పశుగ్రాసం లభిస్తుంది. మొదటి కోత తర్వాత ఈ రకాల పెరుగుదల చాలా వేగంగా ఉంటుంది. సాధారణంగా 2 కోతల తర్వాత 3వ కోతను విత్తనం కొరకు వదిలేస్తే, తరువాతి పంటకు విత్తనం అందుబాటులో ఉంటుంది. ఈ రకాలను ఫిబ్రవరి - మార్చిలో విత్తుకుని, నీటి లభ్యత బాగా ఉంటే మరుసటి సంవత్సరం విత్తనోత్పత్తి చేపట్టడం లాభదాయకంగా ఉంటుంది. మొదటగా మనం ఎన్ని పశువులకు పచ్చిమేత కావాలో నిర్ణయించుకొని, దాని ప్రకారం పది రోజుల వ్యవధిలో 3-4 సార్లు విత్తుకున్నట్లైతే పచ్చిమేతను ఎక్కువ కాలం పాటు అందిస్తాయి.

**కోతలనిచ్చు సూటి రకాలు:** యస్.యస్.జి 59-3, పంథ్‌చారి 6, పూసాచారి 23, ఎం.పి.చారి

**కోతలనిచ్చు సంకర రకాలు:** సి.యస్.హెచ్ 20 ఎమ్ఎఫ్, సి.యస్.హెచ్ 24 ఎమ్ఎఫ్, పి.సి.హెచ్ 109, పి.సి.హెచ్ 106, సఫేద్ మోతి

**3. ద్విప్రయోజన రకాలు:** ఇవి గింజ దిగుబడిని మరియు పశుగ్రాసాన్ని ఇస్తాయి. వీటిని వర్షాధారంగా మరియు నీటి పారుదల సౌకర్యం ఉన్న దగ్గర వేసుకోవచ్చు. ఒక హెక్టారుకు 40-45 టన్నుల పచ్చిమేత లేక 12-14 టన్నుల ఎండుచొప్ప మరియు 3-3.5 టన్నుల గింజ దిగుబడిని ఇస్తాయి.

**ద్విప్రయోజన రకాలు:** సి.యస్.వి 15, సి.యస్.వి 27, పాలెం 2, ఎన్‌టిజె 2, తెలంగాణ జొన్న 1

**ద్విప్రయోజన సంకరాలు:** సి.యస్.హెచ్ 13

**బహువార్షిక రకాలు:** ఈ రకాలను ఒక్కసారి విత్తుకున్నట్లైతే 3 సం॥ల వరకు కోతలను తీసుకొనవచ్చును. సంవత్సరానికి 80 టన్నుల పచ్చిమేత దిగుబడిని ఇస్తుంది.

**బహువార్షిక సూటి రకాలు:** కో.ఎఫ్.ఎస్ 29, కో.ఎఫ్.ఎస్ 31

**సాగు మెళకువలు:**

**నేలలు:** ఎటువంటి నేలలైన పశుగ్రాస జొన్న సాగుకు అనుకూలం.

**విత్తే సమయం:** వేసవిలో అయితే ఫిబ్రవరి మరియు ఏప్రిల్ నెలల మధ్య వేసుకోవాలి.

**విత్తన మోతాదు, సాళ్ళ మధ్య దూరం:**

**ఒక్కసారే కోతకు వచ్చు రకాలు:** హెక్టారుకు 25 కిలోల విత్తనం సరిపోతుంది. వరుసల మధ్య 30 సెం.మీ. దూరం ఉండేలాగ చూడాలి.

**పలుసార్లు కోతకు వచ్చు రకాలు:** హెక్టారుకు 15 కిలోల విత్తనం సరిపోతుంది. వరుసల మధ్య 45 సెం.మీ. దూరంతో విత్తుకోవాలి.

**బహువార్షిక రకాలు:** హెక్టారుకు 8 కిలోల విత్తనం, వరుసల మధ్య 45 సెం.మీ. దూరం ఉండేలాగా చూసుకోవాలి.

**ఎరువులు:** దుక్కిటకు ముందు బాగా చివికిన పశువుల ఎరువును 3-4 టన్నులు ఒక ఎకరానికి వేసి బాగా కలియదున్నాలి. వర్షాధారా సాగుకు 1 హెక్టారుకి 60 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం మరియు 30 కిలోల పొటాష్‌లను ఇచ్చే ఎరువులను; నీటి పారుదల పంటకు 100 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్‌లను ఇచ్చే ఎరువులను వేసుకోవాలి. సగం నత్రజని, పూర్తి భాస్వరం మరియు పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలోనే వేసుకోవాలి. మిగిలిన సగం నత్రజనిని పంట విత్తిన 30-35 రోజుల తర్వాత వేయాలి. నాలుగైదుసార్లు కోసుకునే రకాలు వేసుకున్నప్పుడు కోసిన వెంటనే ఒకసారి, నెలరోజులకు మరోసారి నత్రజని ఎరువులను పై పాటుగా వేసుకుని నీరు కట్టాలి.

**నీటి యాజమాన్యం:** భూమిలో తేమను మరియు పంట పెరుగుదలను బట్టి పొలానికి నీరు పెట్టడం మంచిది. పలు కోతనిచ్చే రకాలను కోసిన వెంటనే నీరు పెట్టాలి. ఇది మామూలుగా 10-15 రోజులకు ఒకసారి పెడితే సరిపోతుంది.

**కలుపు నివారణ:** అట్రజిన్ 50% పొడిమందును ఎకరాకు 600 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే లేదా 48 గంటలలోపు తడినేలపై పిచికారి చేయాలి.

**విత్తనశుద్ధి:** థైరమ్ అనే మందుతో (4-5 గ్రా./కిలో విత్తనానికి) విత్తనశుద్ధి చేపట్టవచ్చు.

**అంతరపంటలు / మిశ్రమ పంటలు:** జొన్నను పప్పుజాతి పంటలలో కలిపి వేసుకుంటే పశుగ్రాసం యొక్క పోషకశక్తి పెరుగుతుంది. అనగా అలసంద, సోయా, స్టైలో లాంటివి 1 వరుస 2 వరుసల జొన్నతో కలిపి వేసుకోవచ్చు.

**సస్యరక్షణ:** పశుగ్రాస పంటలపై క్రిమి సంహారక మందులు వాడకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితులలో వాడినప్పటికీ 15 రోజుల దాకా పశుగ్రాసంగా వాడకూడదు.

**పంటకోత:** ఒక్కసారే కోతకు వచ్చే రకాలను పంట సగం పూతదశలో ఉన్నప్పుడే కోసుకోవాలి. అంతకంటే ముందుగా కోసినట్లైతే ఈ దశలో మొక్కలో ఉండే సయనైడ్ అనే విషపదార్థం పశువులకు హాని కలిగిస్తుంది. ఇది పంట పూతదశలో తగ్గిపోతుంది. కనుక పంటను 50% పూతదశ తరువాత కోసి మేతగా వాడుకోవచ్చు.

పలుకోతలనిచ్చు జొన్నలో మొదటి కోతను సగం పూతదశలో తర్వాత కోతలను 40 రోజులకు కోసుకోవడం ఉత్తమం. పంటను కోసేటప్పుడు భూమి మీద మొదళ్ళు 5-8 సెం.మీ. పైన ఉండేలాగ కోసుకోవాలి. ఇందువల్ల పిలకలు అధికంగా వస్తాయి. కోసిన ప్రతిసారి 15-20 కిలోల నత్రజని ఎకరానికి వాడి నీరు పెట్టడం వల్ల పంట పెరుగుదల బాగుంటుంది. ద్విప్రయోజన రకాలను గింజ పక్వానికి వచ్చిన దశలో కోసుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8978229445**

# ఉత్తర తెలంగాణ మండలానికి అనువైన ఆవాల రకాలు మరియు యాజమాన్య పద్ధతులు

డా॥ పి. మధుకర్ రావు, డా॥ టి. అరుణ్ బాబు, ఎమ్. శ్రీజ, డా॥ బి. మధుకర్, డా॥ ప్రితికా రెడ్డి మరియు డా॥ కె.బి. సునీత దేవి
బి జె ఆర్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల





మన భారతదేశ జనాభా రోజురోజుకు పెరుగుతూ ఉంది. ఈ పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నూనె గింజల దిగుబడిని కూడా పెంచడం అత్యంత ఆవశ్యకం. ఈ నూనె గింజ పంటలసాగులో ముఖ్యమైన పంట ఆవాలు. మన దేశ జనాభా అవసరాలలో దాదాపు 26.8 మిలియన్ మెట్రిక్ టన్నుల నూనెగింజలు అవసరం. మనదేశ జనాభా అవసరాలకు 16.5 మిలియన్ మెట్రిక్ టన్నుల నూనెగింజలు దిగుమతి చేసుకోవడం జరుగుచున్నది. ఇంకా మనకు 10.3 మిలియన్ మెట్రిక్ టన్నులు అవసరం. నూనెగింజ పంటలలో ఆవ పంట ముఖ్యమైన పంట. ఆవ పంటలో నూనె శాతం 30-46% ఉంటుంది. తక్కువ నీటి వనరులు, సులభ యాజమాన్య పద్ధతులు మరియు స్థిర మార్కెట్ ధర వలన ఉత్తర తెలంగాణ రైతులు పంట సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

**ఉత్తర తెలంగాణకు అనువైన ఆవాల రకాలు:**

**ఎ) ఐసిఏఆర్ - ఐఎఆర్ఐ - న్యూఢిల్లీ వారి మేలైన వంగడాలు:**

**1. పూసా - అగ్రాన్:**

దిగుబడి - 1700-1750 కిలోలు / హెక్టార్
కాలపరిమితి - 105-110 రోజులు
నూనెశాతం - 39-41%
మొక్క ఎత్తు - 1.5-1.8 మీ.

**2. పూసా మెహక్:**

దిగుబడి - 1750-1800 కిలోలు / హెక్టార్
కాలపరిమితి - 115-120 రోజులు
నూనెశాతం - 40-42%

**3. పూసా మస్టర్డ్:**

దిగుబడి - 1470 కిలోలు / హెక్టార్
కాలపరిమితి - 107-115 రోజులు
నూనెశాతం - 38-41%
మొక్క ఎత్తు - 1.5-1.8 మీ.

**4. పిఎమ్-26:**

దిగుబడి - 1600-1650 కిలోలు / హెక్టార్
కాలపరిమితి - 115-120 రోజులు
నూనెశాతం - 39-42%
మొక్క ఎత్తు - 1.6-1.8 మీ.

**బి) అఖిల భారత ఆవ పరిశోధన స్థానం, భరత్‌పూర్, రాజస్థాన్ వారి మేలు రకం వంగడాలు:**

**1. డిఆర్ఎమ్ఆర్ఐజె-3 (గిరిరాజ్)**

దిగుబడి - 2000-2200 కిలోలు/హెక్టార్
పంటకాలం - 125-130 రోజులు
నూనెశాతం - 40-42%
మొక్క ఎత్తు - 1.8-2.1 మీ.

**2. ఎన్ఆర్సిహెచ్ 101:**

దిగుబడి: 1400 కిలోలు / హెక్టార్

పంటకాలం - 105 రోజులు,

నూనెశాతం - 34-42%

**3. ఎన్ఆర్సిడిఆర్2:**

దిగుబడి - 1950 కిలోలు / హెక్టార్

పంటకాలం - 130 రోజులు

నూనెశాతం - 36-42%

మొక్క ఎత్తు - 1.6-2.1 మీ.

**నేలలు:** ఆవాల పంటను ఒక మోస్తరు బరువైన నేలల్లో సాగు చేసి మంచి దిగుబడులు సాధించవచ్చు. అయితే ఈ పంటను తేలికపాటి నేలలు, నల్లరేగడి నేలలు మరియు ఒండ్రు నేలల్లో కూడా పండించవచ్చు.

**విత్తన మోతాదు:** 2.0-2.5 కిలోలు / ఎకరానికి

**విత్తే దూరం: విత్తే పద్ధతి:** ఎకరా మోతాదు విత్తనానికి కనీసం 5 కిలోల ఇసుక కలిపి గొర్రు సహాయంతో 45 సెం.మీ. వరుసల మధ్య, 15-20 సెం.మీ. మొక్కల మధ్య దూరం ఉండేలా విత్తాలి.

**విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేయాలి.

**ఎరువులు యాజమాన్యం:** భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలి. ఎకరాకు 2-3 టన్నుల పశువుల ఎరువుని విత్తే ముందు వేసుకోవాలి. నత్రజని, భాస్వరం మరియు పొటాషియం 24 కిలోలు, 16 కిలోలు మరియు 16 కిలోలు నిచ్చే ఎరువులను ఒక ఎకరానికి వేయాలి. రెండవ దఫాగా నత్రజనిని పూత వచ్చే ముందు (55-60 రోజులు) వేయాలి.

**కలుపు యాజమాన్యం:** విత్తిన 48 గంటలలోపు ఆక్సాడయార్జిల్ 6% ఇసి అనే కలుపు మందును ఎకరానికి 600 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. మొలకెత్తిన 3 వారాలలోపు కుదురుకు ఒక మొక్క ఉండేలా మొక్కలను పలుచన చేయాలి. పైరు 30 మరియు 60 రోజుల దశలో వరుసల మధ్య అంతర సేద్యం చేయాలి.

**నీటి యాజమాన్యం:** ఆవాల పంట సాగుకు సుమారు 300-400 మి.మీ. నీరు అవసరమవుతుంది. మొత్తంగా 3-4 తడులు ఇచ్చి మంచి దిగుబడులు సాధించవచ్చును. కొమ్మలు ఏర్పడే దశ (30-40 రోజులు) మరియు పూత, కాయ ఏర్పడే దశలు (60-80 రోజులు) కీలకమైనవి.

**అంతరపంటలు, పంటల సరళి:** వానాకాలం మొక్కజొన్న, సోయాచిక్కుడు, ప్రత్తి తర్వాత ఆవాల పంటను సాగు చేయవచ్చును.

**శనగ:** ఆవాలు (5:1) లేదా (3:1) నిష్పత్తిలో అంతరపంటల సాగు లాభదాయకం.

**సస్యరక్షణ:**

**సాఫ్లై:** ఈ పురుగు ఆకులపై చిన్న చిన్న రంధ్రాలు చేసి తింటూ, కేవలం ఈనెలను మాత్రమే మిగులుస్తుంది. ఈ పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెల్ల తుప్పు తెగులు:** ఆకులపై తెల్లటి బుడిపెల్లాంటి పదార్థం ఏర్పడుతుంది. ఈ తెగులు నివారణకు మెటలాక్సిల్ అనే శిలీంధ్రనాశిని 6 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. తెగులు సోకిన మొక్కలపై మెటలాక్సిల్ 2 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**పంటకోత:** పంట పక్వానికి వచ్చినప్పుడు కాయలు పసుపు రంగుకు మారుతాయి. మొక్కలను కోసి ఎండిన తర్వాత కర్రలతో కొట్టి విత్తనాన్ని కాయల నుండి వేరుచేయాలి. విత్తనాలలో తేమ శాతం 8-9 శాతం వరకు వచ్చేలా ఎండబెట్టాలి.

**దిగుబడి:** ఎకరాకు 5-6 క్వింటాళ్ళు దిగుబడి సాధించవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9505507995**

**అక్టోబర్ 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1. | 01.10.2025 | డ్రాగన్ ఫ్రూట్ సాగు సూచనలు - (రైతు నేస్తం ఎపిసోడ్ 69) |
| 2. | 16.10.2025 | యాసంగికి అనువైన వేరుశనగ రకాలు |
| 3. | 22.10.2025 | యాసంగి వేరుశనగ - మేలైన యాజమాన్యం |
| 4. | 31.10.2025 | పూర్వపు విద్యార్థులు - గెస్ట్ లెక్చరర్ (డా॥ టి.వి. నాగేంద్ర ప్రసాద్) |

# గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం లక్ష్యం: కోత నుండి నిల్వ వరకు రైతు చేపట్టాల్సిన సమగ్ర చర్యలు





డా॥ కె. లక్ష్మీప్రసన్న, డా॥ యమ్. పల్లవి, డా॥ కె. కనకదుర్గ,
డా॥ బి. వరప్రసాద్, డా॥ యమ్.వి. నగేష్ కుమార్ మరియు
డా॥ సి.హెచ్. దామోదర్ రాజు
సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, సీడ్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ
సెంటర్, రాజేంద్రనగర్, హైదరాబాద్

ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేయబడిన 'గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం' కిట్ల ఫలితం ఇప్పుడు పొలాల్లో కనబడుతోంది. ముఖ్యంగా వరి వంటి ప్రధాన పంటల్లో, జొన్న వంటి చిరుధాన్యాలలో మరియు పెసర, కంది వంటి పప్పు దినుసు పంటలలో రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. అయితే, విత్తనోత్పత్తిలో జన్యు మరియు భౌతిక స్వచ్ఛతను కాపాడటానికి, పంట చేతికి వచ్చే ఈ కీలక సమయంలో తీసుకునే జాగ్రత్తలే ముఖ్యం. సాధారణంగా బెరుకుల ఏరివేత ప్రక్రియ పూత మరియు పక్వానికి రాకముందు దశల్లోనే పూర్తవుతుంది. అయినప్పటికీ, విత్తనం యొక్క జన్యు స్వచ్ఛతను కాపాడటానికి, కోత సమయంలో కూడా చివరిసారి బెరుకుల ఏరివేత చేయడం చాలా ముఖ్యం. కొన్ని రకాల మొక్కలు లేదా కలుపు మొక్కలు పూర్తి పక్వానికి వచ్చినప్పుడు మాత్రమే వాటి రంగు, పరిమాణం, లేదా ఆకారంలో తేడా స్పష్టంగా కనిపిస్తుంది. పంట కోసే సమయానికి పక్వానికి వచ్చిన కలుపు మొక్కలు విత్తనాలను రాలుస్తాయి. ఈ కలుపు విత్తనాలు పంట విత్తనాలతో కలవకుండా నివారించాలి. ముఖ్యంగా కంకులు లేదా కాయల రంగులో, ఆకారంలో తేడా ఉన్న మొక్కలను, అలాగే పక్వత ఆలస్యంగా ఉన్న మొక్కలను గుర్తించి తొలగించాలి. ఈ అవాంఛనీయ మొక్కలను కోత యంత్రం పొలంలోకి ప్రవేశించే ముందే చేతితో పెకిలించి పొలం నుండి పూర్తిగా తొలగించాలి. కేవలం కోత వరకు మాత్రమే కాకుండా కోత సమయంలోనూ మరియు అనంతరం జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మాత్రమే అనవసర విత్తనాలు మరియు వ్యర్థాలు నాణ్యమైన విత్తనంలో కలవకుండా కాపాడవచ్చు. అందుకు వేరు వేరు దశలలో ఈ క్రింది సూచనలను పాటించాలి.

## 1. కోత మరియు నూర్పిడి యంత్రాల శుభ్రత

- యంత్రాలలో మిగిలిపోయిన పాత విత్తనాలు, దుమ్ము లేదా మట్టి నాణ్యమైన విత్తన పంటతో కలిస్తే, అది మొత్తం విత్తనం యొక్క స్వచ్ఛతను దెబ్బతీస్తుంది.
- యంత్రంలో గతంలో నూర్పిడి చేసిన వేరే పంట విత్తనాలు లేదా మరొక రకం విత్తనాలు ఎక్కడా చిక్కుకొని ఉండకుండా చూసుకోవాలి.
- యంత్రంలోని గింజలు ప్రయాణించే అన్ని మార్గాలను (కన్వేయర్లు, డ్రమ్ములు, ఎలివేటర్లు) అధిక పీడనం ఉన్న గాలి ఉపయోగించి లోపలికి ఊదడం ద్వారా చిన్నపాటి విత్తనాలను కూడా బయటకు పంపాలి.
- హార్వెస్టర్లలో గింజలు నిల్వ అయ్యే ట్యాంక్‌ను, అలాగే అక్కడికి విత్తనాన్ని చేర్చే మార్గాన్ని పూర్తిగా ఖాళీ చేసి, తుడిచి శుభ్రం చేయాలి.
- విత్తనాన్ని యంత్రంలోకి పోయడానికి లేదా సంచులలో నింపడానికి ఉపయోగించే పారలు, బకెట్లు వంటి పరికరాలు కూడా వేరే విత్తనాల అవశేషాలు లేకుండా శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి.

## 2. నూర్పిడి

- నూర్పిడి స్థలం తరచుగా మట్టి, రాళ్లు మరియు పాత పంట అవశేషాలతో కలుషితమై ఉంటుంది. విత్తన మిశ్రమాలను నివారించడానికి ఈ స్థలాన్ని సిద్ధం చేయాలి.
- నూర్పిడి చేసే నేల పూర్తిగా పొడిగా, శుభ్రంగా ఉండాలి. నూర్పిడి సమయంలో మట్టి లేదా బురద విత్తనంలో కలవకుండా చూసుకోవాలి.
- నూర్పిడి చేయాలనుకున్న స్థలాన్ని ముందుగా చీపురుతో బాగా తుడిచి, దుమ్ము, రాళ్లను తొలగించాలి. వీలైతే, నీటితో కడిగి ఆరబెట్టాలి.
- గతంలో అదే స్థలంలో నూర్పిడి చేసిన విత్తనాలు లేదా ఇతర పంటల గింజలు ఏమైనా ఉంటే, వాటిని పూర్తిగా తొలగించాలి.
- నూర్పిడి చేసే స్థలంపై కొత్త లేదా శుభ్రంగా కడిగిన టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ షీట్‌ను పరచాలి. ఇది పెద్దలు విత్తనంతో కలవకుండా నివారిస్తుంది..
- నూర్పిడి తర్వాత విత్తనం నేరుగా నేలను తాకకుండా, ఎప్పుడూ టార్పాలిన్ పై లేదా సిమెంట్ ఫ్లోర్ పై మాత్రమే ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

**3. ఆరబెట్టడం:** విత్తనాన్ని నిల్వ చేయడానికి ముందు సరైన పద్ధతిలో ఆరబెట్టడం అత్యవసరం. సరిగా ఆరబెట్టకపోతే విత్తనం త్వరగా పాడైపోతుంది, మొలక సామర్థ్యం తగ్గుతుంది మరియు శిలీంధ్రాల బెడద పెరుగుతుంది.

| పంట రకం | సిఫారసు చేయబడిన తేమ శాతం (దాదాపుగా) |
|---|---|
| వరి, జొన్న | 12% - 13% |
| నూనె గింజలు (వేరుశనగ, నువ్వులు) | 8% - 10% |
| పప్పుధాన్యాలు (పెసర, కంది) | 10% - 12% |

రైతులు వీలైతే, తేమ కొలిచే యంత్రాన్ని ఉపయోగించి విత్తనంలోని తేమ శాతాన్ని కచ్చితంగా కొలవాలి. ఈ యంత్రం లేకపోతే, విత్తనాన్ని కొరికి చూడడం లేదా గోరుతో నొక్కడం వంటి సాంప్రదాయ పద్ధతుల ద్వారా అనుభవాన్ని బట్టి నిర్ణయించుకోవచ్చు. విత్తనంలో తేమ అధికంగా ఉంటే శిలీంధ్రాలు పెరిగి, విత్తనంపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. సంచులలో విత్తనం వేడెక్కి, మొలక సామర్థ్యాన్ని కోల్పోతుంది.

- నేరుగా మట్టిపై విత్తనాన్ని ఆరబెట్టడం మానుకోవాలి. సిమెంట్ ఫ్లోర్, కడిగిన టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ షీట్‌ను మాత్రమే ఉపయోగించాలి.
- ఆరబెట్టే స్థలాన్ని పశువులు, పెంపుడు జంతువులు లేదా పక్షుల సంచారం లేని చోట ఎంచుకోవాలి. పక్షుల రెట్టలు విత్తనంపై పడితే, అది అత్యంత తీవ్రమైన జీవ కాలుష్యానికి దారితీస్తుంది.
- విత్తనాన్ని ఆరబెట్టేటప్పుడు పలచటి పొరగా పరవాలి. మందంగా ఉంటే, పై భాగం ఆరిపోయినా లోపలి తేమ ఉండిపోతుంది.
- విత్తనాన్ని ప్రతి కొన్ని గంటలకు తప్పనిసరిగా తిప్పాలి. దీనివల్ల ప్రతి గింజకు సమానంగా గాలి, ఎండ తగిలి, ఒకే రకంగా ఆరిపోతుంది.
- విత్తనాన్ని ఆరబెట్టేటప్పుడు గట్టిగా గాలి వీస్తున్నా లేదా దుమ్ము రేగుతున్నా, ఆ సమయంలో ఆరబెట్టడం మానుకోవాలి లేదా విత్తనాన్ని కప్పి ఉంచాలి. దుమ్ము రేణువులు విత్తనంతో కలిస్తే, భౌతిక స్వచ్ఛత దెబ్బతింటుంది.

**4. తూర్పార పట్టడం:** ఈ ప్రక్రియలో, గాలిని ఉపయోగించి విత్తనం నుండి తేలికైన, అనవసరమైన పదార్థాలను వేరు చేస్తారు. దీని ప్రధాన లక్ష్యం విత్తనంలో ఉండే పొట్టు, ఇతర వ్యర్థాలు, సరిగ్గా పక్వానికి రాని తేలికపాటి గింజలు, మరియు అతి ముఖ్యంగా, చిన్న కలుపు మొక్కల విత్తనాలను తొలగించడం. రైతు సోదరులు, గాలి బాగా వీచే బహిరంగ ప్రదేశంలో, మిశ్రమాన్ని చేటలు లేదా గంపలలో తీసుకుని ఎత్తు నుండి కిందకు పోస్తారు. బరువు ఎక్కువగా ఉన్న మంచి నాణ్యత గల విత్తనాలు నేరుగా కిందకు పడి ఒక కుప్పగా చేరతాయి, అయితే బరువు తక్కువగా ఉన్న పొట్టు మరియు కలుపు విత్తనాలను గాలి కొట్టుకుపోతుంది. ఈ విధంగా కలుషిత పదార్థాలను తొలగించడం వల్ల విత్తనం యొక్క భౌతిక స్వచ్ఛత మెరుగుపడుతుంది. అంతేకాక, వ్యర్థాలు తొలగిపోవడం వల్ల విత్తనంలో తేమ శాతం త్వరగా తగ్గి, శిలీంధ్రాలు పెరిగే అవకాశం తగ్గి, నిల్వ సమయంలో విత్తనం పాడైపోకుండా ఉంటుంది.

**5. జల్లెడ పట్టడం:** విత్తనం యొక్క పరిమాణం ఆధారంగా అనవసరమైన పదార్థాలను వేరు చేస్తుంది. తూర్పార పట్టడం ద్వారా తొలగించబడని బరువుగా ఉన్న కలుషితాలు, రాళ్లు, మట్టిపెళ్లలను ఇది సమర్థవంతంగా తొలగిస్తుంది. విత్తనాలను జల్లించడం వలన వాటి భౌతిక స్వచ్ఛత పెరుగుతుంది. రైతులు తాము శుద్ధి చేయాలనుకుంటున్న పంట రకం (వరి, జొన్న, పప్పుధాన్యాలు) యొక్క పరిమాణం మరియు ఆకారాన్ని బట్టి, తగిన రంధ్రాల సైజు ఉన్న జల్లెడలను ఎంచుకోవాలి. తప్పు సైజు జల్లెడ వాడితే, మంచి విత్తనం కూడా వ్యర్థాలతో పాటు పోతుంది.

**6. తదుపరి సీజన్ కొరకు నిల్వచేయడం:** విత్తనాన్ని తదుపరి సీజన్ వరకు నాణ్యత తగ్గకుండా కాపాడుకోవడానికి నిల్వ చేయడం చాలా కీలకం. జల్లెడ పట్టడం, ఆరబెట్టడం పూర్తయిన తర్వాత, విత్తనంలో తేమ శాతం 10-12% మధ్య ఉన్నట్లు నిర్ధారించుకోవాలి. ఆ తర్వాత విత్తనాన్ని కొత్త లేదా శుభ్రమైన, పొడి సంచులలో నింపి, గాలి చొరబడని విధంగా మూయాలి. ఈ సంచులను నిల్వ చేసే గిడ్డంగి లేదా గది పొడిగా, చల్లగా మరియు మంచి గాలి తగిలే విధంగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ సంచులను నేలపై లేదా గోడలకు ఆనించి ఉంచకూడదు వాటిని చెక్క పలకలు లేదా రంధ్రాల ప్లాస్టిక్ షీట్లపై పేర్చాలి. ఇది తేమను అరికడుతుంది. అంతేకాకుండా, ఎలుకలు మరియు పురుగుల నుండి నష్టం జరగకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలి. సరైన నిల్వ పద్ధతులు పాటించడం ద్వారా, విత్తనం యొక్క మొలక సామర్థ్యం ఎక్కువ కాలం నిలిచి ఉంటుంది.

విత్తనోత్పత్తిలో బెరుకుల ఏరివేత, నూర్పిడి యంత్రాల శుభ్రత, ఆరబెట్టడం, తూర్పార పట్టడం, మరియు జల్లెడ పట్టడం వంటి కోతానంతర చర్యలు విత్తనం యొక్క జన్యు మరియు భౌతిక స్వచ్ఛతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రైతు-రైతు విత్తన మార్పిడిలో నాణ్యత కొరకు ఈ సూక్ష్మ జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. ప్రతి గ్రామానికీ అధిక దిగుబడినిచ్చే, ఆరోగ్యకరమైన విత్తనాన్ని అందుబాటులోకి తీసుకురావడం ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన "గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం" కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. పైన చర్చించిన పద్ధతులను స్థానికంగా అమలు చేయడం ద్వారానే, రైతులు మార్పిడి చేసుకునే విత్తనం ధృవీకరణ స్థాయి నాణ్యతను సాధించి, గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం అనే లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకోవడానికి పునాది అవుతుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9493451857

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునీత దేవి




**అడ్డం:**

1. రైతుల నుండి ప్రత్తి కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ప్రారింభించిన నూతన యాప్ ఏది? (8)
5. నూనెగింజలకు సంబంధించిన ఓ పంట పూరేకులను డికాక్షన్‌గా వాడుతారు? ఏ పంట? (3)
6. వంగలో మొక్కలు గుబురుగా, చీపురు కట్టలా కనిపిస్తాయి. ఆకులు సన్నగా ముడుచుకొని పోయి పాలిపోయిన ఆకుపచ్చని రంగులో గుబురుగా ఉంటాయి. తెగులు పేరు? (5) (కుడి నుండి ఎడమకు)
7. లద్దె పురుగు నివారణకు విరివిగా వాడే రసాయనం పేరు? (7) (కుడి నుండి ఎడమకు)
9. నేల అవసరం లేకుండా నీటితో మొక్కలను పెంచే వినూత్న పద్ధతిని ఏమంటారు? (5) (కుడి నుండి ఎడమకు)
10. వివిధ పంటల్లో కాండం తొలుచు పురుగులకు గ్రుడ్డు దశలో ఆశించే పరాన్న జీవి? (4)
12. వరి పంటలో సాధారణంగా విత్తనశుద్ధికి వాడే శిలీంద్రనాశిని? (5) (కుడి నుండి ఎడమకు)

**నిలువు:**

2. వరి పంటలో ఆకుల తొడిమెల పైన, కాండం మీద, రెండు లేదా మూడు సెం.మీ. పొడవు కలిగిన దీర్ఘ వృత్తాకారంలో మచ్చలు ఏర్పడి, ఒకదానితో ఒకటి కలిసిపోయి పాము పొడ ఆకారం పోలి ఉంటాయి. ఏ తెగులు? (7)
3. వరి పంటలో మొక్క మొదళ్ళ దగ్గర నీటి మట్టంపై ఉండి రసం పీల్చడం వలన ఆకులు పసుపు రంగుకు మారి తర్వాత సుడులు సుడులుగా ఎండిపోతాయి. ఏ పురుగు వలన? (4)
4. బత్తాయిలో కాయలు పగలడం ఏ ధాతు లోపం వలన జరుగుతుంది? (3) (క్రింది నుండి పైకి)
8. వరిలో ఏ పురుగు ఆశించడం వల్ల అంకురం ఉల్లికోడు వలె పొడుగాటి గొట్టంగా మారుతుంది? (4)
11. బంగిన పల్లి, దశేరి రకాలు ఏ పండ్ల రకం? (3) (క్రింది నుండి పైకి)
12. వరిలో అంకురం నుండి చిరుపొట్ట దశలో ఉన్న వరి పైర్లలో ఏ రసాయనం పిచికారి చేయటం వలన కాండం తొలుచు పురుగును అదుపులో ఉంచవచ్చును? (8) (క్రింది నుండి పైకి)

సమాధానాలు 50వ పేజీలో

# ఫ్యుజేరియం ఎండు తెగులును తట్టుకునే నూతన శనగ రకం - ఆదిలాబాద్ శనగ-2

జి. అనిల్ కుమార్ , డా॥ జి. ప్రవీణ్ కుమార్, డా॥ వై. ప్రశాంత్, డా॥ ఎమ్. రాజేందర్ రెడ్డి, డా॥ ఎమ్. రఘువీర్, డా॥ బి. రామ్ ప్రసాద్ మరియు డా॥ డి. మోహన్ దాస్

వ్యవసాయ కళాశాల, ఆదిలాబాద్













తెలంగాణ రాష్ట్రంలో యాసంగి ఆరుతడి పంటలలో శనగ ప్రధానమైన పంట. మన రాష్ట్రంలోని ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి మరియు గద్వాల జిల్లాల్లో శనగ పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుతుంది. సాలీన సుమారుగా 3 నుండి 3.5 లక్షల ఎకరాలలో ఈ పంట సాగు చేయడం జరుగుతుంది.

మొత్తం విస్తీర్ణంలో ఎక్కువ భాగం జెజి-11, జెఏకెఐ-9218 వంటి రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా సాగు చేసే శనగ రకాల్లో ఫ్యుజేరియం మరియు మాక్రోఫోమిన ఎండు తెగులును తట్టుకునే సామర్థ్యం తగ్గిపోవడం వలన దిగుబడులు తగ్గి పంట సాగు విస్తీర్ణం కూడా తగ్గడం జరుగుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో ఫ్యుజేరియం మరియు మాక్రోఫోమిన ఎండు తెగుళ్ళ వలన సుమారుగా 9-41% పంట దిగుబడి తగ్గుతుంది. రైతులు అధిక దిగుబడినిచ్చే ఎండు తెగులును తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవడం వలన పంట దిగుబడి పెరిగి నికర ఆదాయం పెరగడానికి అవకాశం ఉంటుంది.

జెఏకెఐ-9218 మరియు జెజి-11 వంటి రకాలకు ప్రత్యామ్నాయంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్ నుండి ఆదిలాబాద్ శనగ-2 అనే నూతన రకాన్ని రూపొందించడం జరిగింది. ఈ రకం తెలంగాణలోని శనగ పండించే వివిధ ప్రాంతాల్లోని రైతు పొలాల్లో రెండు సంవత్సరాల పాటు చేసిన చిరు సంచి దశ ఫలితాలలో హెక్టారుకు సగటున 25 క్వింటాళ్ళు దిగుబడి సాధించి జెజి-11 రకం కన్నా 12.6% అధిక దిగుబడిని నమోదు చేయడం జరిగింది.

**ఆదిలాబాద్ శనగ-2 యొక్క గుణగణాలు:**

**పంటకాలం:** 100-105 రోజులు

**సాగుకు అనుకూల సమయం:** అక్టోబర్-15 నుండి నవంబర్ 15 వరకు విత్తుకోవచ్చు.

**దిగుబడి సామర్థ్యం:** సరాసరి దిగుబడి 2562 కి / హెక్టార్ లేదా 1025 కి / ఎకరానికి

**ప్రత్యేక లక్షణాలు:** 45 - 51 రోజులలో పూతకు వచ్చి, మొక్క 41-54 సెం.మీ. ల ఎత్తు వరకు పెరుగుతుంది, ఫ్యుజేరియం ఎండు తెగులును సమర్థవంతంగా (4.1%) తట్టుకుంటుంది, మాక్రోఫోమిన ఎండు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది, 100 -105 రోజులలో కోతకు వచ్చే స్వల్పకాలిక రకం, గింజలు గోధుమ రంగులో ఉంటాయి, 100 గింజల బరువు 23 గ్రా. ఉంటుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9849402550



# యాంత్రీకరణతో చెఱకు సాగులో కొత్త వెలుగు


జి. రాకేష్, ఏ. కృష్ణ చైతన్య, ఎం. సాయి చరణ్, బి. మంజు భార్గవి, ఏ. దినేష్, డా॥ టి. అంజయ్య మరియు డా॥ ఎం. విజయ్ కుమార్

ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్, నిజామాబాద్


ప్రస్తుతంలో భారతదేశం అనిశ్చిత వాతావరణ పరిస్థితులతో పోరాడుతోంది. గ్రామాల నుంచి జీవనోపాధి కోసం పట్టణాలవైపు వలసలు పెరుగుతుండటంతో, వ్యవసాయ రంగంలో శ్రామికుల కొరత తీవ్రమవుతోంది. దీనికి తోడు, రోజురోజుకీ పెరిగిపోతున్న ఉత్పత్తి ఖర్చులు, కూలీల కొరత వల్ల వ్యవసాయ కార్యకలాపాలు ప్రతిసారీ సవాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో చెఱకు సాగులో యాంత్రీకరణ అనేది ఒక సమర్థవంతమైన పరిష్కారంగా నిలుస్తోంది.

యాంత్రీకరణ ద్వారా చెఱకు నాట్లు, ఎరువులు, పురుగు మందుల వాడకం వంటి పనులను ఖచ్చితమైన మోతాదులో, తక్కువ సమయంలో పూర్తి చేయడం ద్వారా వ్యవసాయ ఖర్చులను తగ్గించుకోవచ్చు. అలాగే, శ్రమ ఆదా కావడంతో పాటు దిగుబడిలోనూ మెరుగుదల సాధ్యమవుతుంది. అయితే, యంత్రాల అధిక ధరలు, నిర్వహణలో రైతులకు ఉన్న అనుభవలేమి వంటి అంశాలు యాంత్రీకరణ అంగీకారానికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. అయినప్పటికీ, చెఱకు పంట పంచదార, బెల్లం వంటి ప్రధాన ఉత్పత్తులతో పాటు ఆల్కహాలు, ఎరువులు, పేపరు వంటి అనేక ఉప ఉత్పత్తులను ఇచ్చే లాభదాయక పంట. కాబట్టి ఈ పంటను లాభసాటి మార్గంలో నడిపించేందుకు యాంత్రీకరణను ప్రోత్సహించడం మనకున్న అవసరం.

**చెఱకు సాగులో అనుసరించవలసిన కొన్ని ముఖ్యమైన యాంత్రీక పద్ధతుల వివరాలు ఈ క్రింద ఇవ్వబడ్డాయి:**

**1. పంట అవశేషాల నిర్వహణ – భూసారాన్ని పెంచే మొదటి అడుగు:** చెఱకు కోత అనంతరం ఎకరాకు సుమారు 3 టన్నుల వరకు పంట అవశేషాలు లభిస్తాయి. సాధారణంగా రైతులు ఈ అవశేషాలను కాల్చే పద్ధతిని అనుసరిస్తారు. అయితే, దీనివల్ల హెక్టారుకు సుమారు 16 కిలోల నత్రజని, 0.5 కిలోల ఫాస్ఫరస్, 17 కిలోల పొటాష్, 1 కిలో సల్ఫర్ వంటి ముఖ్య పోషకాలు నష్టమవుతాయి. ఇదంతా నివారించేందుకు ట్రాష్ ఇన్‌కార్పోరేటర్ వంటి యంత్రాల సహాయంతో అవశేషాలను నేలలో కలియదున్ని, సేంద్రీయ పదార్థాన్ని పెంచటం ద్వారా భూసారాన్ని మెరుగుపర్చవచ్చు.

**2. దుక్కి దున్నుట – మంచి మొలకలకు పునాది:** పంట నాటే ముందు దుక్కి దున్నుట అత్యంత అవసరం. మొక్కలు బాగా మొలకెత్తేందుకు, నేల తేమను నిలుపుకోవడంలో దుక్కి కీలక పాత్ర పోషిస్తుంది. అందుకోసం మౌల్డ్ బోర్డ్ ప్లవ్, డిస్క్ ప్లవ్, రోటవేటర్ వంటి యంత్రాలను ఉపయోగించవచ్చు. 10–12 అంగుళాల లోతుతో దున్నటం వలన నేల గుల్ల బారి, తేమ నిల్వ, వేర్ల పెరుగుదల మెరుగుపడతాయి.

**3. నాట్లు వేయుట – యాంత్రీక నాటు పద్ధతులు:** సాంప్రదాయంగా చెఱకు నాటు కోసం ఎకరాకు 6–8 మంది కూలీలు అవసరం. కానీ చెఱకు నాటు యంత్రం సహాయంతో కేవలం ఇద్దరు కూలీలతో ఈ పని నిర్వహించవచ్చు. ఈ యంత్రం మొక్కలతో పాటు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను కూడా వేసే విధంగా రూపొందించబడి ఉంటుంది.

నాట్ల మధ్య వ్యాసాన్ని (90–150 సెం.మీ.) మరియు మొక్కల మధ్య వ్యాసాన్ని (30–60 సెం.మీ.) పరిగణనలోకి తీసుకుని నాటే విధంగా ప్రణాళిక చేయవచ్చు.

**4. బడ్ చిప్ నారు మొక్కల ద్వారా చెఱకు సాగు:** సాంప్రదాయ సాగులో విత్తనాల ఖర్చు సుమారు 15–20% ఉంటుంది. ఈ ఖర్చును తగ్గించేందుకు బడ్ చిప్/ఒంటి కన్ను నారు మొక్కలు ఉపయోగించవచ్చు.



ట్రాష్ షద్దర్



మౌల్డ్ బోర్డ్ ప్లవ్



చెఱకు నాట్లు వేయు యంత్రం









**లాభాలు:**

- విత్తన శుద్ధి, ఆరోగ్యవంతమైన నారు
- పురుగుల నివారణ
- ఒకే రీతిగా పెరిగే పిలకలు
- అధిక చెక్కర శాతం
- 2 టన్నుల వరకు అధిక దిగుబడి

బడ్ చిప్ మిషన్, క్వార్టో సింగిల్ నోడ్ కట్టర్ వంటి పరికరాలను ఇందుకోసం ఉపయోగిస్తారు.

**5. కలుపు నివారణ – మెషిన్స్‌తో సమర్థవంతమైన నియంత్రణ:** కలుపు మొక్కలు నీరు, పోషకాలు శక్తివంతంగా తీసుకుంటాయి. బాల్యదశలోనే వాటిని నివారించాలి. ఇందుకోసం మినీ ట్రాక్టర్, డ్రాన్ రోటవేటర్, కల్టివేటర్, పవర్ వీడర్ వంటి యంత్రాలను వాడవచ్చు.

ఇవి నేలను గుల్లబార్చి, మొక్క పెరుగుదలను మెరుగు పరచడంలో దోహదపడతాయి.

**6. మట్టిని ఎగద్రోయుట:** వేసవిలో వేర్లు ఎక్కువ వేడి చెందకుండా ఉండాలంటే మట్టిని ఎగద్రోయటం అవసరం. దీనికోసం రిడ్జ్ మేకర్ ఉపయోగించి కూలీల అవసరాన్ని తగ్గించవచ్చు.

**7. జడలు వేయుట:** పొలుసు పురుగు, పిండి నల్లి, ఎర్ర నల్లి వంటి ప్రమాదకర పురుగుల ప్రభావాన్ని తగ్గించేందుకు పైరులోని పాత ఆకులను తీసివేయాలి. దీనికోసం సరైన పనిముట్లను ఉపయోగించి ఈ పనిని తక్కువ సమయంలో పూర్తిచేయవచ్చు.

**8. కోతకోయుట:** చాపర్ హార్వెస్టర్ వంటి యంత్రాల సహాయంతో కోత పనులు వేగంగా, ఖచ్చితంగా పూర్తవుతాయి. ఇవి గడలను నేల స్థాయిలో కోస్తాయి, చెత్తను వేరు చేస్తాయి, పై భాగాన్ని కూడా కత్తిరిస్తాయి. కూలీలపై ఆధారపడే అవసరం తగ్గుతుంది.

**9. కార్శి చేయుట:** కోత అనంతరం రటూన్ మేనేజర్ వాడటం వలన పాత వేర్లను తొలగించవచ్చు, ఎరువులను వేసేందుకు అనువుగా మారుతుంది, నీటి ప్రవాహం మెరుగవుతుంది. ఇది కొత్త మొలకల పెరుగుదలలో సహాయపడుతుంది.

వ్యవసాయ పనులు శ్రమగా మారుతున్న ఈ కాలంలో, యాంత్రీకరణ సరికొత్త దిశగా మారుతోంది. ఇది కేవలం సమయం, శ్రమ, ఖర్చులను తగ్గించడమే కాకుండా, ఉత్పాదకతను గణనీయంగా పెంచుతోంది. ముఖ్యంగా యువతను వ్యవసాయ రంగానికి ఆకర్షించడంలో ఇది కీలక పాత్ర పోషించగలదు.

యంత్రాల వినియోగం ఎంతమాత్రం ముఖ్యమో, వాటి నిర్వహణ కూడా అంతే అవసరం. ఎప్పటికప్పుడు శుభ్రత, సరైన మరమ్మత్తులు పాటించడం ద్వారా యంత్రాల పనితీరు మెరుగవుతుంది, వాటి జీవనకాలం గణనీయంగా పెరుగుతుంది. ఈ విధంగా, యాంత్రిక వ్యవసాయం దశలవారీగా గ్రామీణాభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోంది.










ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8501059411

# యాసంగి పంటల్లో సమర్థవంతమైన కలుపు యాజమాన్యం - అధిక పంట దిగుబడికి మరియు రైతు రాబడికి మార్గం

డా॥ బి. పద్మజ, డా॥ టి. అంజయ్య మరియు డా॥ టి. రామ్ ప్రకాశ్

అఖిల భారత కలుపు యాజమాన్య విభాగం, హైదరాబాద్







రాష్ట్ర రైతాంగం పంటల సాగులో ఎదుర్కొనే సమస్యల్లో అతి ముఖ్యమైనది కలుపు యాజమాన్యం. కలుపు మొక్కలు పంట మొక్కలతో సమానంగా భూమి, గాలి, వెలుతురు, నీరు మరియు పోషక పదార్థాలకు పోటి పడి పంట మొక్కలకు చాలా నష్టం కలుగజేస్తాయి. అయినప్పటికీ మన రైతుసోదరులు తెగుళ్ళు, పురుగుల నివారణలో ఉన్న శ్రద్ధ కలుపు యాజమాన్యంపై కనబరుచుట లేదు. పంట దిగుబడిలో కలుపు మొక్కల వల్ల సుమారుగా 35-40 శాతం వరకు నష్టం కలిగితే తెగుళ్ళ వల్ల 26 శాతం, పురుగుల వల్ల 20 శాతం నష్టం జరుగుతున్నట్లు పలు పరిశోధనల్లో గమనించడం జరిగింది. దేశంలో నష్టపోతున్న పంట దిగుబడి రూపాయల్లో చూసినట్లైతే సుమారుగా 1100 కోట్ల పైమాటే. కలుపు యాజమాన్యంపై హెక్టారుకు వర్షాకాలంలో 6000 రూపాయల వరకు మరియు యాసంగిలో 4000-5000 రూపాయల వరకు వెచ్చించడం జరుగుతుంది. కావున కలుపు మొక్కల నిర్మూలన సకాలంలో చేపట్టి పంట దిగుబడి పెంచుకోవాలి.

తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో ముఖ్యంగా వరితోపాటు, మొక్కజొన్న, శనగ, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, పెసర, మినుము, కంది మరియు ఆముదం పంటలు వేయడం జరుగుతుంది.

గత సంవత్సరం అనగా 2024-25 యాసంగి కాలంలో మొక్కజొన్న పంటను 3,66,792 హె॥ విస్తీర్ణంలో, వేరుశనగ 94,043 హె॥, శనగ 69,737 హె॥, మినుము 20,443 హె॥, ప్రొద్దుతిరుగుడు 8591 హె॥, పెసర 5959 హె॥ మరియు కంది 4477 హె॥ విస్తీర్ణంలో వేయడం జరిగింది.

యాసంగిలో వేసుకునే ప్రధాన పంటల్లో మొదటి 15 నుండి 45 రోజులు కలుపు మొక్కలు అధికంగా వస్తాయి. ముఖ్యంగా పంట మొక్కల తొలిదశలో కలుపు మొక్కలతో పోటీ ఉండటం వల్ల పంట మొక్కల పెరుగుదల దెబ్బతింటుంది. కావున కలుపు నివారణ అత్యంత కీలకం.

### మొక్కజొన్న:

యాసంగిలో మొక్కజొన్నను అక్టోబర్-నవంబర్‌లో విత్తుకోవాలి. జీరో టిల్లేజ్ పద్ధతిలో వరి మాగాణుల్లో డిసెంబర్ చివరి వరకు విత్తుకోవచ్చు. విత్తిన 40-45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.

### కలుపు యాజమాన్యం:

మొక్కజొన్నను ఏక పంటగా విత్తినప్పుడు విత్తిన 48 గంటలలోపు భూమిలో సరైన తేమ ఉండేటట్లుగా చూసి ఎకరాకు 800 గ్రా. - 1.0 కిలో వరకు అట్రాజిన్ 50% డబ్ల్యుపి పొడి

మందును లేదా అల్లాక్లోర్ 50% ద్రావకం 2.0 లీటర్లు లేదా పైరాక్సా సల్ఫోన్ 85% గుళికలు 60 గ్రా. వాడుకోవచ్చు. వరి మాగాణుల్లో జీరో టిల్లేజ్ పద్ధతిలో విత్తుకున్నప్పుడు పైన కలుపు మందులలో ఏదో ఒక దానితో పాటు లీటరు నీటికి 5 మి.లీ. పారాక్వాట్‌ను కలుపుకొని పిచికారి చేసుకుంటే అప్పటికే మొలచిన కలుపును కూడా అణచివేయవచ్చు.

మొక్కజొన్నలో అంతరపంటలు (అపరాలు, నూనె గింజలు) వేసినప్పుడు అట్రజిన్ కలుపు మందును వాడరాదు. పెండిమిథాలిన్ 30% ఇసి ఎకరాకు 1.0-1.3 లీటరు లేదా పెండిమిథాలిన్ 38.7% సిఎస్ ఎకరాకు 700 మి.లీ. వాడుకోవాలి.

విత్తిన 20-25 రోజులలోపు (కలుపు మొక్కలు 2-4 ఆకుల దశలో) ఎకరాకు టెంబోట్రియోన్ 34.4% ద్రావకం 115 మి.లీ. లేదా టోప్రామిజోన్ 33.6% ద్రావకం 30 మి.లీ. + 400 మి.లీ. అడ్జువెంట్ లేదా మీసోట్రియాన్ 2.27% డబ్ల్యు/డబ్ల్యు + అట్రజిన్ 22.7% డబ్ల్యు/డబ్ల్యు ద్రావకం 1.40 లీటర్లు లేదా హాలోసల్ఫ్యూరాన్ 75% గుళికలు 36 గ్రా. (తుంగ సమస్య ఎక్కువగా ఉంటే) లేదా అట్రజిన్ + హాలోసల్ఫ్యూరాన్ గుళికలు 450-500 గ్రా. లేదా అట్రజిన్ + టోప్రామిజోన్ ద్రావకం 450-500 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే మొలచిన కలుపు చనిపోతుంది.

మరల పంట 40-45 రోజుల దశలో ఉన్నప్పుడు వెడల్పాకు కలుపు, తీగజాతి కలుపు ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 2 గ్రా. 2,4-డి సోడియం సాల్ట్ 80% పొడి లేదా 5 మి.లీ. 2,4-డి ఇథైల్ వెస్టర్ 38% ద్రావకం లేదా 2.0 మి.లీ. 2,4-డి డై మిథైల్ ఎమైన్ 58% ద్రావకంను పిచికారి చేయవచ్చు. అన్ని రకాల కలుపు మొక్కలు సమస్యగా ఉంటే లీటరు నీటికి 5 మి.లీ. పారాక్వాట్‌ను గాని గ్లుఫోసినేట్ అమ్మోనియం గాని కలుపుకుని మొక్కజొన్న పంటపై పడకుండా స్ప్రేయర్ నాజిల్‌కు డోమ్‌ను అమర్చుకొని పిచికారి చేసుకోవచ్చు.

**జొన్న:**

జొన్న పంటను యాసంగిలో నీటిపారుదల క్రింద అక్టోబర్ నుండి డిసెంబర్ చివరి వారం వరకు విత్తుకోవచ్చు. మొదటి నెలరోజుల వరకు కలుపు సమస్య లేకుండా చూడాలి.

విత్తిన 48 గంటలలోపు అట్రజిన్ 50% కలుపు మందును ఎకరాకు 400 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలి. తర్వాత నెల రోజులకు అంతరకృషి చేయాలి. వెడల్పాకు కలుపు మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరాకు 2,4-డి ఇథైల్ ఎస్టర్ 58% ద్రావకం 1.0 లీటరు వరకు వాడుకోవచ్చు. తుంగ సమస్య ఎక్కువగా ఉంటే హాలోసల్ఫ్యూరాన్ మిథైల్ అనే కలుపు మందును ఎకరాకు 36 గ్రా. చొప్పున అట్రజిన్ 400 గ్రా.లతో గాని 2,4-డి ఇథైల్ ఎస్టర్‌తో గాని కలిపి వాడుకోవచ్చు.

**పెసర మరియు మినుము:**

యాసంగిలో పెసర మరియు మినుము పంటలను అక్టోబర్ రెండో పక్షం లోగా విత్తుకోవాలి. వరి మాగాణుల్లో (ఖమ్మం మరియు వరంగల్) 15 నవంబర్ నుండి డిసెంబర్ మొదటి వారం వరకు విత్తుకోవచ్చు. విత్తిన 25 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.

**కలుపు యాజమాన్యం:**

విత్తిన 48 గంటలలోపు తడినేలపై ఎకరాకు పెండిమిథాలిన్ 30% ద్రావకం 1.0-1.3 లీటర్లు లేదా పెండిమిథాలిన్ 30% + ఇమాజితాఫిర్ 2% ద్రావకం 1.0 లీటరు పిచికారి చేయాలి. పొడిదుక్కిలో విత్తుకున్నప్పుడు పెండిమిథాలిన్ 38.7% సిఎస్ ద్రావకం ఎకరాకు 700 మి.లీ. 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి.

కలుపు మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు (పంట విత్తిన 20 రోజులలోపు) ఎకరాకు ఇమాజితాఫిర్ ద్రావకం 300 మి.లీ. + 300 మి.లీ. అడ్జువెంట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే వెడల్పాకు కలుపు మొక్కలు చనిపోతాయి. తుంగ పెరుగుదల తగ్గుతుంది. గడ్డిజాతి కలుపు ఎక్కువగా ఉంటే ఎకరాకు క్విజాలోఫాప్ ఇథైల్ 5% ద్రావకంను 400 మి.లీ. లేదా ప్రొపాక్విజాఫాప్ 10% ద్రావకం 250 మి.లీ. లేదా ఫెనాక్సాప్రాప్ ఇథైల్ 9.3% ద్రావకం 250 మి.లీ. చొప్పున పిచికారి చేయాలి.

అన్ని రకాల కలుపు మొక్కలు సమానంగా ఉన్నప్పుడు ప్రొపాక్విజాఫాప్ 2.5% + ఇమాజితాఫిర్ 3.75% డబ్ల్యు/డబ్ల్యు ద్రావకం ఎకరానికి 800 మి.లీ. చొప్పున పిచికారి చేయవచ్చు.

**వరి మాగాణులలో యాసంగి పెసర లేదా మినుము విత్తుకున్నప్పుడు కలుపు నివారణ:**

ఈ పద్ధతిలో వరి పంటను కోసే ముందు నానబెట్టిన విత్తనాలను వెదజల్లుతారు. కాబట్టి మొలచిన తర్వాత మాత్రమే కలుపు మందులను వాడే అవకాశం ఉంటుంది. విత్తిన 21-28 రోజుల మధ్య చిప్పెర మరియు ఇతర గడ్డి జాతి నివారణకు ఎకరాకు ఫెనాక్సాప్రాప్ ఇథైల్ 250 మి.లీ. లేదా సైహాలోఫాప్ బ్యుటైల్ 300 మి.లీ. లేదా సోడియం ఎసిఫ్లోర్‌ఫెన్ + క్లోడినాఫాప్ ప్రొపర్జిల్ 400 మి.లీ. పిచికారి చేయాలి. వెడల్పాకు కలుపు మరియు బంగారు తీగ నివారణకు ఇమాజితాఫిర్ 10% ద్రావకాన్ని 250 మి.లీ. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**బంగారు తీగ (పరాన్న జీవ జాతికి చెందిన కలుపు మొక్క) ఆశించే ప్రాంతాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు:**

- స్వచ్ఛమైన విత్తనాన్ని ఎంచుకోవాలి.
- గత పంట కాలంలో బంగారు తీగ ఆశించిన పొలం నుండి సేకరించిన విత్తనాన్ని వాడరాదు.
- మొక్కజొన్న లేదా జొన్న వంటి గడ్డిజాతి పంటలతో పంటమార్పిడి చేయాలి.
- యంత్రాలను, పనిముట్లను బాగా శుభ్రపరిచిన తర్వాత మాత్రమే వేరే పొలంలో వాడుకోవాలి.
- పెండిమిథాలిన్ మరియు ఇమాజితాఫిర్ కలుపు మందులు పిచికారి చేయటం వలన బంగారు తీగను అరికట్టవచ్చు.

**శనగ:**

శనగ పంటను అక్టోబర్ నుండి నవంబర్ మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. మొదటి 30-45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.

విత్తిన రెండు రోజులలోపు పెండిమిథాలిన్ 30% ద్రావకం ఎకరాకు 1.3 లీ. లేదా పెండిమిథాలిన్ 30% + ఇమాజితాఫిర్ 2% ద్రావకం ఎకరాకు 1.0 లీ. చొప్పున పిచికారి చేయాలి.

విత్తిన 20 రోజులలోపు (కలుపు మొక్కలు 2-4 ఆకుల దశలో) ఎకరాకు క్విజాలోఫాప్ ఇథైల్ 5% ద్రావకం 400 మి.లీ. లేదా ప్రొపాక్విజాఫాప్ 10% ద్రావకం 250 మి.లీ. చొప్పున పిచికారి చేయాలి.

**కంది:**

యాసంగిలో కంది పంటను అక్టోబర్ 15-20 వరకు విత్తుకోవచ్చు. రకాన్ని బట్టి యాసంగిలో 130-140 రోజులు పంటకాలం కలిగి ఉంటుంది. మొదటి 40-45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.

విత్తిన 48 గంటలలోపు భూమిలో తేమ ఉండేటట్లు చూసుకుని ఎకరాకు పెండిమిథాలిన్ 30% ద్రావకం 1.3-1.6 లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. పొడి దుక్కిలో విత్తినప్పుడు పెండిమిథాలిన్ 38.7% ద్రావకం 700 మి.లీ. చొప్పున పిచికారి చేయాలి. లేదా తడి నేలపై పెండిమిథాలిన్ 30% + ఇమాజితాఫిర్ 2% ద్రావకం ఎకరాకు 1.0 లీ. చొప్పున పిచికారి చేయాలి.

విత్తిన 20 రోజులలోపు లేదా కలుపు మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజితాఫిర్ 10% ద్రావకం ఎకరాకు 250 మి.లీ. + అడ్జువెంట్ (300 మి.లీ.) (వెడల్పాకు కలుపు మరియు తుంగ ఎక్కువగా ఉన్నప్పుడు) లేదా క్విజాలోఫాప్ 5% ద్రావకం 400 మి.లీ. లేదా ఫెనాక్సాప్రాప్ ఇథైల్ 9.3% ద్రావకం 250 మి.లీ. లేదా ప్రొపాక్విజాఫాప్ 10% ద్రావకం 250 మి.లీ. (గడ్డిజాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు) పిచికారి చేయాలి. అన్ని రకాల కలుపు మొక్కలు సమానంగా ఉన్నప్పుడు ప్రొపాక్విజాఫాప్ 2.5% + ఇమాజితాఫిర్ 3.75% ద్రావకం ఎకరాకు 800 మి.లీ. లేదా ఇమాజామాక్స్ 35% + ఇమాజితాఫిర్ 35% పొడి మందు ఎకరాకు 40 గ్రా. చొప్పున పిచికారి చేయాలి.

**కలుపు యాజమాన్యంలో పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలు:**

- ఆయా పంటలకు సిఫారసు చేసిన సరైన కలుపు మందులను, సరైన మోతాదు మరియు సరైన సమయంలోనే వాడాలి.
- అంతరపంటలు వేసినప్పుడు కలుపు మందులను మార్చాలి. రెండు పంటలకు సురక్షితమైన కలుపు మందులనే వాడాలి.
- భూమిలో సరైన తేమ ఉన్నప్పుడు పిచికారి చేస్తేనే కలుపు మందులు ప్రభావవంతంగా పనిచేస్తాయి.
- కొన్ని పంటలలో మొలచిన తర్వాత కలుపు మందులు వాడలేని పక్షంలో అంతరకృషి చేసి నివారించవచ్చు. అంతేకాక పుష్పించే ముందు అంతరకృషి లేదా చేతితో తీయటం వలన కలుపు మొక్కల విత్తన వ్యాప్తిని తగ్గించవచ్చు.
- చేతి పంపు వాడి ఫ్లడ్ జెట్ లేదా ఫ్లాట్ ఫాన్ నాజిల్ వాడినప్పుడు కలుపు మందులు బాగా పనిచేస్తాయి.
- కలుపు మందులను గాలి వేగం తక్కువగా ఉన్నప్పుడు పిచికారి చేయాలి.
- 2,4-డి కి సంబంధించిన కలుపు మందులను చుట్టు ప్రక్కల పొలాల్లో అపరాలు లేదా ఇతర సున్నితమైన పంటలు లేనప్పుడు వాడాలి.
- కలుపు మందులను కొన్నప్పుడు వాటితోపాటు వచ్చే అడ్జువెంట్‌ను తప్పనిసరిగా కలుపుమందుకు కలిపి వాడుకోవాలి. దీనివలన కలుపుమందు ప్రభావవంతంగా పని చేయటమే కాక పంట మొక్కలు రక్షించబడతాయి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. **9440040605**

# సమగ్ర సస్యరక్షణ చర్యలలో గుడ్డు పరాన్నజీవుల పాత్ర

డా|| ఎస్. శ్రీనివాస్ నాయక్, డా|| ఎస్. మాలతి, డా|| ఇ. రాంబాబు, డా|| ఎన్. రమ్యశ్రీ మరియు డా|| ఎస్. వంశీకృష్ణ

వ్యవసాయ కళాశాల, వరంగల్, పిజెటిఏయు



ప్రపంచ మానవ జనాభా 800 కోట్లు దాటింది. పెరుగుతున్న జనాభా మనుగడకి ఎక్కువ పరిమాణంలో ఆహార ఉత్పత్తులను అందించే దిశలో రైతు సోదరులు సంకరజాతి వంగడాలను వాడుచున్నారు. ఈ సంకర వంగడాలు ముఖ్యంగా చీడపీడలను తట్టుకునే రోగనిరోధక శక్తి తక్కువగా కలిగి ఉంటాయి. ఈ యొక్క చీడపీడలను నివారించడానికి రైతు సోదరులు రసాయనిక పురుగుమందులను ఎక్కువ మోతాదులో, అనేక మార్లు ఒకే పంట కాలంలో పిచికారి చేయడం మనం చూస్తునే ఉన్నాం. అంతేకాకుండా రెండు మూడు రకాల ఒకే తరగతికి చెందిన పురుగుమందులను అవసరం లేకున్నా వాడటం జరుగుతుంది. దీని వలన చీడపీడల ఉధృతి తగ్గి పంట ఉత్పత్తి పెరగడం అనే ఆలోచన ప్రక్కన పెడితే, పురుగులు రోగ నిరోధక శక్తి పెంచుకుంటున్నాయి. అంతేకాకుండా పంట ఉత్పత్తులపైన పురుగుమందుల అవశేషాలు ఉండటం వలన అంతర్జాతీయ మార్కెట్‌లో తిరస్కరించబడుతున్నాయి. ఈ విపత్తును ఎదుర్కొనే దిశలో రెచెల్ కార్సన్ అను శాస్త్రవేత్త సమగ్ర సస్యరక్షణ చర్యలను వాడుకోవడానికి మూల బీజం వేసింది. దీనిలో భాగంగా జీవనియంత్ర పద్ధతిలో సస్యరక్షణ చర్యలను చేపట్టడం ద్వారా పంటకి అయ్యే ఖర్చు తగ్గడమే కాకుండా, మన వాతావరణాన్ని మరియు వనరులను భవిష్యత్తు తరాలకు అందించవచ్చును. ఈ జీవనియంత్రణ పద్ధతిలో గుడ్డు పరాన్న జీవులు రెక్కల జాతి పురుగుల యొక్క గుడ్డు దశని ఆశించి చంపటం ద్వారా పంట నష్టం కాకుండా గ్రుడ్డు దశలోనే ఆగిపోతుంది. ఈ ఆశించే క్రమంలో ఈ గుడ్డు పరాన్నజీవి ఆడ కీటకం పంటలో వదిలిన తరువాత వేటను ప్రారంభించి, ఎక్కడయితే హాని చేయు పురుగుల గుడ్డు దశ ఉంటుందో, ఆ గుడ్డులోకి తన గుడ్డును పెట్టి, క్రమేణ హాని చేయు కీటకాల గుడ్డు దశ నుండి పిల్ల లార్వాలు బయటకు రాకుండా చేస్తాయి. ఈ విధంగా ఆదిలోనే చంపివేయడం ద్వారా, గ్రుడ్డు పరాన్న జీవుల విలువైన పాత్రగా అభివర్ణించవచ్చును.

**వివిధ పంటలలో గుడ్డు పరాన్న జీవులు మరియు వాటి మోతాదులు:**

| క్ర.సం. | పంట | ఆశించు పురుగు | గుడ్డు పరాన్నజీవి | మోతాదు |
|---|---|---|---|---|
| 1. | వరి | కాండంతొలుచు పురుగు | ట్రైకోగ్రామ జపానికమ్ | 50,000 / హెక్టారు 6 విడతలలో నాటిన 30 రోజుల నుండి |
| | | ఆకుముడత పురుగు | ట్రైకోగ్రామ కిలోనిస్ | 50,000 / హెక్టారు 6 విడతలలో పురుగు కనిపించిన దశ నుండి |
| 2. | ప్రత్తి | శనగపచ్చ పురుగు, గులాబిరంగు పురుగు, పొగాకు లద్దెపురుగు, తలనత్త పురుగు | ట్రైకోగ్రామ కిలోనిస్ లేదా ట్రైకోగ్రామ అకియో | 1,50,000 / హెక్టారు 6 విడతలలో వారానికి ఒకసారి |

| క్ర.సం. | పంట | ఆశించు పురుగు | గుడ్డు పరాన్నజీవి | మోతాదు |
|---|---|---|---|---|
| 3. | చెఱకు | పీక పురుగు<br>కాండం తొలుచు పురుగు | ట్రైకోగ్రామ కిలోనిస్<br>ట్రైకోగ్రామ జపానికమ్ | 50,000 / హెక్టారు 4 నుండి<br>6 విడతలలో 10 రోజుల వ్యవధిలో |
| 4. | టమాట | శనగపచ్చ పురుగు | ట్రైకోగ్రామ<br>ప్రీటియోజమ్ | 50,000 / హెక్టారు 6 విడతలలో<br>పురుగు కనిపించిన దశ నుండి |
| 5. | క్యాబేజీ /<br>క్యాలీఫ్లవర్ | రెక్కల పురుగు | ట్రైకోగ్రామ బ్రాసికే | 1,00,000 / హెక్టారు 6 విడతలలో<br>వారానికి ఒకసారి |
| 6. | కూరగాయలు<br>(బెండ / వంగ) | రెక్కల జాతి పురుగులు | ట్రైకోగ్రామ కిలోనిస్ | 50,000 / హెక్టారు 6 విడతలలో<br>పురుగు కనిపించిన దశ నుండి |
| 7. | మొక్కజొన్న | కాండంతొలుచు పురుగు | ట్రైకోగ్రామ కిలోనిస్<br>లేదా ట్రైకోగ్రామ<br>ప్రీటియోజమ్ | 1,50,000 / హెక్టారు 6 విడతలలో<br>పురుగు కనిపించిన దశ నుండి |

**జాగ్రత్తలు:**

- పురుగుమందులు పిచికారి సమయంలో ఈ గుడ్డు పరాన్న జీవులను పొలంలో వదలకూడదు.
- నలుపు వర్ణంలో ఉన్నటువంటి గుడ్డు పరాన్నజీవి కార్డులను మాత్రమే తీసుకోవాలి.
- ఈ గుడ్డు పరాన్నజీవి కార్డులను తీసుకున్న 1-2 రోజులలో విడుదల చేసుకోవలయును.
- ఈ పరాన్నజీవులు గుడ్ల (నలుపు వర్ణంలో) కార్డులపైన ఒత్తుగా ఉన్నవో లేదో చూసుకోవలయును.
- పొలం గట్ల పైన పుప్పొడి మరియు తేనెనిచ్చె మొక్కలను పెట్టినట్లైతే ఎక్కువ కాలం పొలంలో ఉండే అవకాశం ఉంటుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8778857772**

# ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి గురువారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్ ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. నవంబర్, 2025 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 06.11.2025 | కుసుమ పంట సాగు మరియు యాజమాన్యం | **డా॥ కె. పరిమళ,** ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)<br>వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూర్, ఫోన్ నెం.: 9885040499 |
| 13.11.2025 | యాసంగి వరి నారుమడిలో చలి యాజమాన్యం | **డా॥ వి. శ్రీధర్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)<br>వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్, ఫోన్ నెం.: 9640370666 |
| 20.11.2025 | యాసంగిలో కూరగాయల సాగు | **శ్రీమతి జి. స్వాతి,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (హార్టికల్చర్)<br>వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, కంపాసాగర్, ఫోన్ నెం. 7780794422 |
| 27.11.2025 | యాసంగికి అనువైన పశుగ్రాసాలు | **డా॥ డి. పద్మజ,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)<br>ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ ఫోరేజ్ క్రాప్స్, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9959306929 |



# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2025-26 సం॥ ఖరీఫ్ మరియు రబీ కాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంటకోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 7 నుండి 23 సం॥ల నెలవారీ మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2025-26 ఖరీఫ్ మరియు రబీ పంటకోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది, దానిని అనుసరించి:

**వానాకాలం (ఖరీఫ్) పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | వరి (సాధారణం) | సూర్యాపేట్ | నవంబర్-డిసెంబర్ | 2300-2540 |
| 2. | వరి (గ్రేడ్ ఏ) | జమ్మికుంట | నవంబర్-డిసెంబర్ | 2400-2820 |
| 3. | ప్రత్తి | వరంగల్ | నవంబర్-ఫిబ్రవరి | 6800-7300 |
| 4. | జొన్న | గడ్డిఅన్నారం | నవంబర్-జనవరి | 1650-2150 |

**2025-26 రబీ పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | వరి (సాధారణం) | సూర్యాపేట్ | మార్చి-మే | 2300-2460 |
| 2. | వరి (గ్రేడ్ ఏ) | జమ్మికుంట | మార్చి-మే | 2389-2900 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక :** గత 20 సంవత్సరాల ధరలను విశ్లేషించి పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును, కావున భవిష్యత్‌లో పంటల ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.



# నవంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట

**మామిడి:** ఇటీవల వరకు కురిసిన అధిక వర్షాల వల్ల తేనె మంచు పురుగు, పిండినల్లి, పొలుసు పురుగుల ఉధృతి అధికమయ్యే అవకాశం ఉంది. నివారణకు బుప్రొఫెజిన్ 2 మి.లీ. లేదా డెల్టామెత్రిన్ 0.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా లామ్డాసైహలోథ్రిన్ 1 మి.లీ. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. కొన్ని ప్రాంతాలలో ఈ మాసంలో చలి పెరిగి, పొగమంచు పడే అవకాశం ఉంది. దీని వల్ల బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా మైక్లోబుటానిల్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**జామ:** పిండినల్లి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. + 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారి చేసుకోవాలి. పిందె, కాయగా పెరిగే దశలో 10 గ్రా. యూరియా లేదా 10 గ్రా. 13.0.45 ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయడం వల్ల కాయ పరిమాణం పెరిగి అధిక దిగుబడి వస్తుంది. సూక్ష్మపోషక లోపాల నివారణకు ఫార్ములా-4, 5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. గత మాసంలో అధికంగా కురిసిన వర్షాల వల్ల జామకు ఎండుతెగులు ఆశించే అవకాశం ఉంది. దీని వల్ల ఆకులు పసుపు పచ్చ రంగుకు మారతాయి. కొమ్మలు పై నుండి క్రిందకు ఎండుతాయి. నివారణకు కార్బండాజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు మొదలు చుట్టూ నేల తడిచేటట్లు పోయాలి.

**అరటి:** ఫెర్టిగేషన్ విధానంలో ఎరువులు అందించేవారు మొక్క నాటిన 3వ వారం నుండి 25వ వారం వరకు ప్రతి వారం ప్రనతి మొక్కకు 10 గ్రా. యూరియా, 7 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ని ఇవ్వాలి. సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 20 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ:** జనవరిలో పూత రావడం కోసం ఈ మాసం నుండి నీటితడులు ఇవ్వడం ఆపివేయాలి. కాయ మీద వచ్చే మంగు నివారణకు 2 మి.లీ. ఇథియాన్ లేదా 1 మి.లీ. స్పైరోమెసిఫెన్ లీటరు నీటికి చొప్పున కలిపి, నవంబర్, డిసెంబర్, జనవరి మాసాలలో పిచికారి చేసుకోవాలి.

**ద్రాక్ష:** పిండినల్లి నివారణకు కత్తిరింపులు జరిపిన 20వ, 40వ రోజున ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. + 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై, పాదులో పిచికారి చేయాలి. తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పూలగుత్తులు పొడవు పెరగడానికి జిబ్బరెల్లిక్ ఆమ్లం 10 పిపియం రెండు సార్లు పిచికారి చేయాలి.

**సపోట:** అధిక వర్షాల వల్ల వచ్చే ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఆపిల్ రేగు:** బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పండు ఈగ ఉధృతి నుండి కాపాడుకోవడానికి ఫిరమోన్ ఎరలను పెట్టుకోవాలి. పిందె బఠాని గింజ సైజు నుండి మలాథియాన్ మందును 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 2-3 సార్లు పిచికారి చేసుకోవాలి.





**బొప్పాయి:** గత మాసంలో కురిసిన అధిక వర్షాల వల్ల ఆకులపై గోధుమ వర్ణపు మచ్చలు ఏర్పడి ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోతాయి. నివారణకు లీటరు నీటికి మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**ఉసిరి:** కాయలు కోసిన వెంటనే కొమ్మలను సగంకు కత్తిరించుకోవాలి.

**కూరగాయలు:**

**టమాట:** తామర పురుగులు, పచ్చదోమ నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాయతొలుచు పురుగు నివారణకు నాటిన 28,35 రోజులకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వంగ:** మొవ్వు మరియు కాయతొలుచు పురుగుల నివారణకు, సైపర్‌మెత్రిన్ 1 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఆకుమాడు మరియు కాయకుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రా. చొప్పున కలిపి పైరుపై 10 రోజుల వ్యవధితో 2 సార్లు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారి చేసుకోవాలి.

**బెండ:** రసంపీల్చే పురుగులు నివారణకు ఫిప్రోనిల్, డైమిథోయేట్ మందులలో ఏదైనా ఒక మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. ఎండుతెగులు నివారణకు మొక్కల మొదళ్ళ వద్ద కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని పోయాలి.

**తీగజాతి కూరగాయలు:**

ఈ మాసంలో కాకర, బీర, దోసలలో బూజుతెగులు అధికంగా ఆశిస్తుంది. నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా మెటలాక్సిల్ ఎమ్‌జెడ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పుచ్చ, ఖర్బూజాలను ఈ మాసం రెండవ పక్షం నుండి విత్తుకోవచ్చు. 2-2.5 ఎడంతో, 60 సెం.మీ. వెడల్పు గల నీటి కాలువలు తయారు చేసుకొని కాలువలు ఇరువైపులా 30-50 సెం.మీ. దూరంలో విత్తనాలు విత్తుకోవాలి.

**ఉల్లి:** రబీ ఉల్లి కోసం ఈ మాసంలో నారుపోసుకోవాలి. 1 మీ. వెడల్పు, 3 మీ. పొడవు 15 సెం.మీ. ఎత్తైన నారుమళ్ళను తయారు చేసుకొని విత్తనాన్ని పలుచగా 5 సెం.మీ. దూరం గల వరుసలో విత్తుకోవాలి.

**మిరప:** ఈ మాసంలో మిరపకు పై ముడత, క్రింది ముడత ఆశించే అవకాశం ఉంది. నివారణకు డైఫెన్‌థయూరాన్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మిరపలో పూత పురుగుల వల్ల కాయలు గిడసబారి, ఆకృతి మారిపోయి వంకరలు తిరుగుతాయి. నివారణకు థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లేదా థయోక్లోప్రిడ్ 0.2 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ + థయోమిథాక్సామ్ 0.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. గత మాసంలో కురిసిన వర్షాల వల్ల మొక్కల్లో పెరుగుదల తక్కువగా ఉండి, గిడసబారిపోతాయి. ఈ తరుణంలో అధిక దిగుబడుల కోసం 28:28:0, 10 గ్రా. 13:0:45 10 గ్రా. మరియు ఫార్ములా 4 లను నెలకొకసారి పిచికారి చేసుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.9441168156**







# రబీ వేరు కూరగాయల సాగుకు సరియైన సమయం

డా॥ ఇ. రాంబాబు, డా॥ యస్. వంశీకృష్ణ, డా॥ యస్. శ్రీనివాస్ నాయక్, డా॥ యస్. మాలతి మరియు
డా॥ వి. రవీందర్ నాయక్

వ్యవసాయ కళాశాల, వరంగల్



వేరు కూరగాయల్లో క్యారేట్, బీట్‌రూట్ పంటలు ముఖ్యమైనవి. వీటి వేర్లు దుంపలుగా మారడం వల్ల సలాడ్‌గా తినడానికి, పలు రకాల కూరలు, స్వీట్లు తయారు చేయడానికి వాడుతారు. వీటిల్లో విటమిన్-ఎ, బి-కాంప్లెక్స్ విటమిన్లు ప్రోటీన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉండటం వలన మంచి పౌష్టికాహారంగా గుర్తింపబడింది.

**వాతావరణం:** క్యారేట్, బీట్‌రూట్ చల్లని వాతావరణంలో పండించే దుంప పంటలు, నాణ్యమైన దుంపల దిగుబడికి 18-24$^{0}$ సెల్సియస్ ఉష్ణోగ్రత ఉండాలి. ఈ వాతావరణంలో ముదురు రంగు ఎక్కువ చక్కెర శాతం, మంచి ఆకృతితో నాణ్యమైన దుంపలు ఏర్పడతాయి.

**రకాలు:**

**క్యారేట్:** పూసాకేసర్, పూసా యామదగ్ని, ఎర్లీనాన్‌టిస్, చాన్‌టనీ, ప్రైవేట్ నుండి లక్ష్మణ్, ఫోటోన్ రకాలు అందుబాటులో ఉన్నాయి.

**బీట్‌రూట్:** డెట్రాయిట్ డార్క్‌రెడ్, క్రిమ్సన్ గ్లోబ్, ఎర్లీ వండర్, ప్రైవేట్ కంపెనీల నుండి రుచిక్వీన్, డిడిరెడ్, ఇండమ్ రుబిరెడ్, క్యాస్టెల్, రుబీక్వీన్, డిడికె రకాలు అందుబాటులో ఉన్నాయి.

ఎక్కువ ఉష్ణోగ్రతతో దుంప పెరుగుదల, రంగు సరిగా ఉండదు. అతి తక్కువ ఉష్ణోగ్రత వద్ద దుంపల రంగు తక్కువగా, దుంపలు విభిన్న ఆకారాల్లో ఉంటాయి.

**నేలలు:** మురుగు నీటి వసతి కలిగిన లోతైన ఇసుకతో కూడిన గరప నేలలు చాలా అనుకూలం. బరువైన నల్లరేగడి నేలలు పనికిరావు మరియు ఉదజని సూచిక 6-7 ఉన్న నేలలు అనుకూలం.

**విత్తే సమయం:** ఆగష్టు నుండి నవంబర్ చివరి వరకు విత్తుకోవచ్చు. దఫదఫాలుగా ఒక్కొక్క దఫాకు 15 రోజుల తేడాతో విత్తుకుంటే మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంట పొందవచ్చును.

**విత్తన మోతాదు:**

**క్యారేట్:** ఎకరానికి 2 కిలోల విత్తనం సరిపోతుంది.

**బీట్‌రూట్:** ఎకరానికి 3-4 కిలోల విత్తనం సరిపోతుంది.

**ప్రధాన పొలం తయారీ మరియు సాగు విధానం:** ఎంపిక చేసిన పొలాన్ని 4 లేదా 5 సార్లు బాగా దుక్కి దున్ని చదును చేయాలి.

**క్యారేట్:** ఈ పంటను చిన్న చిన్న మడులు లేదా బోదెలు తయారు చేసి సాగు చేయవచ్చును. పొలంలో చిన్న మడులను తయారు చేసి 22.5 సెం.మీ. దూరంలోని వరుసల్లో విత్తనాలను 1-1.5 సెం.మీ. లోతులో పడేటట్లు విత్తాలి. లేదా 30 సెం.మీ. దూరంలో బోదెలు తయారు చేసి విత్తనాలను 5 సెం.మీ. దూరంలో విత్తాలి. విత్తనాలు చిన్నవిగా ఉండటం వల్ల, కిలో విత్తనానికి 10 కిలోల సన్నని ఇసుకతో కలిపి విత్తుకుంటే మంచిది.

**బీట్‌రూట్:** వరుసల మధ్య 45 సెం.మీ. వరుసలలోని మొక్కల మధ్య 8-10 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తుకోవాలి.

**ఎత్తైన మడుల పద్ధతి:** ఇటీవల కాలంలో బెడకమ్ సీడ్ ప్లాంటర్ మార్కెట్‌లో లభ్యమవుతుంది. ఈ యంత్రంలో బెడ్ తయారీ, విత్తనం ఒకేసారి 8 వరుసల్లో రెండు బెడ్లవైపు నాటడానికి వీలుగా యంత్రాన్ని తయారు చేసారు. ఇది ప్రస్తుతం వ్యాపార సరళితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలనుకునే వారికి అత్యంత

సులభమైన పద్ధతి. ఈ పద్ధతిలో దుంపలు బెడ్లపైన పెరుగుతాయి. నీరు నిలువదు కనుక వేరుకుళ్ళు సోకే అవకాశం ఉండదు.

**కలుపు నివారణ:** పెండిమిథాలిన్ మందును ఎకరాకు 1.25 లీ. లేదా అలాక్లోర్ 1.0 లీ. చొప్పున 200 మి.లీ. నీటిలో కలిపి విత్తిన 24-48 గంటలలోపు భూమిపై పిచికారి చేయాలి. క్యారేట్ పంటలో విత్తిన 15 రోజులకు మెట్రిబుజిన్ 300 గ్రా. 200 లీ. నీటిలో కలిపి కలుపు నివారించుకోవచ్చు.

**అంతరకృషి:**

**క్యారేట్:** బోదెల్లో మొక్కలు ఒత్తుగా ఉంటే 5 సెం.మీ. కు ఒకటి చొప్పున ఉంచి మిగిలినవి తీసివేయాలి. ఖాళీగా ఉన్న ప్రదేశాలను పూరించాలి. విత్తిన నెల రోజులలోపు ఎలాంటి కలుపు లేకుండా చూసుకోవాలి. కూలీలతో కలుపు తీయించుకొని మట్టిని మొక్కల మొదళ్ళకు ఎగద్రోయాలి. దుంపలు పెరిగేటప్పుడు ఎండ తగలకుండా మట్టిని ఎగదోయాలి లేకుంటే దుంపలు ఆకుపచ్చ రంగుకు మారి ధర పలకదు.

**బీట్‌రూట్:** గింజలు మొలకెత్తిన తరువాత ఒక్కో సీడ్ బాల్ నుండి 2-6 మొలకలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి బలమైన మొలక ఉంచి మిగిలినవి పీకివేయాలి. ఇది చాలా ముఖ్యం. ఇలా కనీసం రెండుసార్లు చేసి, మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా చూడాలి. దీని వలన గడ్డ బాగా ఊరుతుంది.

**ఎరువులు:** ఆఖరి దుక్కిలో ఎకరానికి బాగా మాగిన పశువుల ఎరువుతో (10 టన్నులు) పాటు 16 కిలోల భాస్వరం, 10 కిలోల పొటాష్‌నిచ్చు ఎరువులు వేసుకోవాలి. 20 కిలోల నత్రజని ఎరువులను రెండు సమభాగాలుగా చేసి ఒక భాగం విత్తిన నెల రోజుల తరువాత మిగతా సగం విత్తిన 45-50 రోజులకి వేసుకోవాలి.

**సస్యరక్షణ:** ఈ పంటల్లో ఆశించే పురుగులు మరియు తెగుళ్ళ నివారణకు (ఆకుమచ్చ తెగులు, మాడు తెగులు, బూడిద తెగులు మరియు ఆకు తినే పురుగులు) మలాథియాన్ 2 మి.లీ. + నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు నీటికి కలిపి విత్తిన 4, 7, 10 వారాల తర్వాత పిచికారి చేయాలి. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. మరియు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పంటకోత మరియు దిగుబడి:**

**క్యారేట్:** విత్తిన 90 రోజులకి పంట కోతకు సిద్ధంగా ఉంటుంది. ఆలస్యం అయితే పీచు శాతం ఎక్కువై నాణ్యత తగ్గిపోతుంది. ఎకరాకు 8-10 టన్నుల దిగుబడి వస్తుంది.

**బీట్‌రూట్:** రకాన్ని బట్టి 60-90 రోజుల్లో పంట తయారవుతుంది, ఎకరాకు 10-13 టన్నుల దిగుబడి వస్తుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8247350264**

**నవంబర్ 2025లో పి.జె.టి.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:20 నుండి 1:50 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 05.11.2025 | కుసుమ పంట సాగు విధానం |
| | భూమి యాజమాన్యం ఇన్‌పుట్‌లు శిక్షణ మరియు సాంకేతిక మద్దతులో సమాన హక్కులు అవసరం |
| 12.11.2025 | ప్రత్తి పంట తరువాత నువ్వుల పంట సాగు |
| | దానం చేయగలిగే అవయవాలు వాటి చట్టాలు |
| 19.11.2025 | నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం |
| | సమగ్ర వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత |
| 26.11.2025 | సమీకృత వ్యవసాయం |
| | శాకహార జీవన విధానాన్ని ప్రోత్సహించు - జంతువుల హక్కులపై అవగాహన కల్పించడం |

# “రైతులకు కొత్త ఆదాయ వనరు: స్పిరులినా సాగు”



డా॥ సురుకుంట కిరణ్ రెడ్డి, డా॥ ఎం. సునీల్ కుమార్, డా॥ జి. అనిల్ కుమార్,
పి. సంధ్య శ్రీ మరియు డా॥ వై. ప్రవీణ్ కుమార్
వ్యవసాయ కళాశాల, ఆదిలాబాద్, పిజెటిఏయు



ప్రపంచం మొత్తం ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇస్తున్న ఈ రోజుల్లో, “సూపర్ ఫుడ్” గా గుర్తింపు పొందిన స్పైరులీనా వ్యవసాయ రంగంలో ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. చిన్న పాండ్లలో లేదా ట్యాంకుల్లో పెరిగే ఈ నీలి-ఆకుపచ్చ శైవలం ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలతో నిండిపోయి ఉండటమే కాకుండా, ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలను అందిస్తుంది. తక్కువ భూమి, తక్కువ నీరు, తక్కువ ఖర్చుతో అధిక లాభాలను అందించే ఈ ఉత్పత్తి, రైతులకు మరియు యువ పారిశ్రామికవేత్తలకు కొత్త దారులు చూపుతోంది. తెలుగు రాష్ట్రాలలో ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న ఈ వ్యాపారాన్ని చేయడానికి యువరైతులు ఎందరో ముందుకొస్తున్నారు. అయితే సరైన మార్కెటింగ్ ఛానెల్ని తయారు చేసుకోవడం అనేది ఈ స్పిరులినా వ్యాపారంలో ఎంతో కీలకం.

### స్పిరులీనా అంటే ఏమిటి?

- స్పిరులీనా ఒక రకమైన సూక్ష్మశైవలం. ఇది పచ్చనీలి రంగులో ఉండి, అధిక పోషక విలువల వల్ల సూపర్ ఫుడ్గా పేరుగాంచింది.
- 60-70% వరకు ప్రోటీన్ కలిగి ఉంటుంది
- విటమిన్ బి12, ఐరన్, బీటా కెరోటిన్ వంటి విటమిన్లు మరియు ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి
- యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

### స్పిరులీనా సాగు కోసం అవసరమైన సౌకర్యాలు

- స్పిరులీనా పెంపకం ముఖ్యంగా నీటి ఆధారంగా జరుగుతుంది.
- ట్యాంకులు/పాండ్లు - సిమెంట్ ట్యాంకులు లేదా ప్లాస్టిక్ లైనర్ పాండ్లలో సాగు చేయవచ్చు (130 × 22 అడుగుల సైజు సాధారణం).
- నీరు మరియు పోషక ద్రావణం - శుభ్రమైన తాగునీరు లేదా బోర్వెల్ నీరు; సోడియం బైకార్బోనేట్, యూరియా, సూపర్ ఫాస్ఫేట్, సముద్ర ఉప్పు వంటి పదార్థాలతో కలిపిన ద్రావణం అవసరం.
- **సూర్యకాంతి:** రోజుకు కనీసం 6-8 గంటల సూర్యకాంతి ఉండే ప్రదేశం.
- **పిహెచ్ స్థాయి:** 9-11 పిహెచ్ కలిగిన క్షార ద్రావణం.
- **ఉష్ణోగ్రత:** 25-35$^{0}$ సెల్సియస్ మధ్య ఉండటం ఉత్తమం.

### స్పిరులీనా ఉత్పత్తి విధానం:

**ముందుగా స్పిరులీనా ఉత్పత్తి చేసే స్థలాన్ని చదునుగా దున్నుకోవాలి:**

- 130 అడుగుల పొడవు, 22 అడుగుల వెడల్పు మరియు 1.5 అడుగుల లోతు ఉన్న సిమెంట్ ట్యాంక్ను నిర్మించుకోవాలి.
- వాటి పైన 44 అడుగుల వెడల్పు ఉన్న టార్పలీన్ షీట్లను నీటిని నిలిపే విధంగా అమర్చుకోవాలి.
- ఈ ట్యాంక్లలో 25 సెం.మీ. లోతులో నీరు ఉండేట్లు ఎప్పుడు చూసుకోవాలి.
- తర్వాత ఈ ట్యాంక్లలోకి నీటిని వదలాలి. ఈ నీటిని సముద్రపు నీటి లాగా మార్చడానికి 100 కిలోల ఉప్పుని ముందుగా కలపాలి.
- ఇంట్లో ఆహారంలో వాడే సోడాని నీటిలో రెగ్యులర్ మెయింటెనెన్స్ కోసం కలపాలి, అలాగే నీమ్ ఆయిల్, మెగ్నీషియం, సల్ఫర్ని కూడా కలపాలి.
- నీటి ట్యాంక్లలో 1 హెచ్ పి రొటేటర్స్ని అమర్చి ఎప్పుడు నీటిని వాటితో కలుపుతూ ఉండాలి, దీని వల్ల నీటి ఉష్ణోగ్రత ట్యాంక్లో అన్ని భాగాలలో ఒకేలా ఉంటుంది.

- ఒక నీటి ట్యాంక్‌లో 70 కిలోల మదర్ కల్చర్‌ని వేయాలి. ఈ కల్చర్ వేసిన 15 రోజుల తర్వాత ఉత్పత్తి మొదలవుతుంది.
- ఒక సారి ఉత్పత్తి మొదలయిన తర్వాత ప్రతి 24 గంటలకి ఒక బ్యాచ్ స్పిరులీనా రెడీ అవుతుంది.
- ముందుగా ట్యాంక్‌లలో ఏర్పాటు చేసిన బకెట్ మరియు నీటిని పీల్చే పంపు సహాయంతో మెయిన్ ట్యాంక్లలో ఉన్న స్పిరులీనాతో కూడిన నీరు వేరే చిన్న ట్యాంక్‌లోకి నైలాన్ క్లాత్ గుండా పంపబడుతుంది.
- ఈ నైలాన్ క్లాత్‌లో స్పిరులీనా పేరుకు పోతుంది. ఇలా పేరుకు పోయిన స్పిరులీనాని వేరే బక్కెట్స్ లోకి తీసుకుని ఎండబెడతారు.
- ఇలా స్పిరులీనా ఉత్పత్తిని వివిధ అంచెలుగా తయారు చేస్తారు.
- స్పిరులీనా ఉత్పత్తికి అయ్యే ఖర్చు మరియు రాబడి:

**ఖర్చు:**

- 2 ట్యాంక్లు (ఒక యూనిట్) నిర్మించడానికి = 2–3 లక్షలు
- 1 కేజి పొడి స్పిరులీనా ఉత్పత్తి చేయడానికి = 100 నుండి 200 రూపాయలు/కేజి
- నెలవారీ నిర్వహణ ఖర్చు = రూ. 20,000 – రూ. 30,000 (కూలీలు, పోషక ద్రావణం, నీటి పరీక్షలు)

**రాబడి:**

- 60 కిలోల తడి స్పిరులీనా / యూనిట్ / 1 రోజుకి = 5 – 6 కిలోల పొడి స్పిరులీనా / 1 రోజుకి
- 1 కేజి పొడి స్పిరులీనా ధర = 500 రూపాయలు
- ఖర్చు పోగా 1 కిలో స్పిరులీనాకి మిగిలే లాభం = 300 రూపాయలు
- 5 కిలోలు×300 = 1500 (ఒక రోజుకి నిఖర లాభం)
- 1500×30 = 45000 (ఒక నెలకి నిఖర లాభం)

**మార్కెట్ & వినియోగం:**

1. ఆరోగ్య ఆహార పరిశ్రమలలో – స్పిరులీనాని ఉపయోగించి టాబ్లెట్స్, క్యాప్సుల్స్, ప్రోటీన్ పౌడర్స్ తయారు చేస్తున్నారు.
2. బేకరీ & ఫుడ్ ప్రోడక్ట్స్ అయిన కుకీస్, పాస్తా, సూప్స్, జ్యూసెస్‌లలో కూడా దీని వినియోగం ఎక్కువగా ఉంది.
3. పశువులకి ఇచ్చే దానలో మరియు చేపల ఫీడ్, కోళ్ల ఫీడ్‌లో కూడా పోషకంగా వాడతారు, దీని వల్ల పశువుల పాల దిగుబడి, కోళ్ళ మరియు చేపల మాంసం దిగుబడి పెరుగుతుంది.
4. కాస్మెటిక్స్ – స్కిన్ కేర్ & హెయిర్ కేర్ ఉత్పత్తుల్లో కూడా ఈ స్పిరులీనాని ఉపయోగిస్తున్నారు.

**ముగింపు:** ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న ఈ కాలంలో, స్పిరులీనా ఉత్పత్తి ఒక భవిష్యత్ దృష్టితో కూడిన వ్యాపారం. తక్కువ పెట్టుబడితో ప్రారంభించగలిగే ఈ యూనిట్ రైతులు, యువత మరియు చిన్న స్థాయి వ్యాపారవేత్తలకు గొప్ప లాభాలను అందిస్తుంది. సరైన సాంకేతికత, శుద్ధత, మార్కెటింగ్ పద్ధతులను అనుసరిస్తే, ఇది హరిత బంగారంగా నిలుస్తుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8309504636**

**అక్టోబర్ 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన షార్ట్స్**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1 | 06.10.2025 | వరిలో కాటుక తెగులు/మెడ విరుపు తెగులు/గింజ నల్ల మచ్చ తెగులు నివారణ |
| 2 | 09.10.2025 | వంగ పంటలో కొమ్మ మరియు కాయ తొలుచు పురుగు – నివారణ |
| 3 | 10.10.2025 | మిరపలో నల్ల తామర పురుగు – నివారణ |
| 4 | 11.10.2025 | టమాటలో శనగపచ్చ పురుగు – నివారణ |
| 5 | 18.10.2025 | వేరుశనగలో విత్తన శుద్ధి |
| 6 | 18.10.2025 | వేరుశనగ విత్తన మోతాదు |
| 7 | 18.10.2025 | వేరుశనగలో పోషక యాజమాన్యం |
| 8 | 18.10.2025 | వేరుశనగలో కలుపు యాజమాన్యం |
| 9 | 18.10.2025 | వేరుశనగలో నీటి యాజమాన్యం |
| 10 | 22.10.2025 | వేరుశనగలో సస్యరక్షణ |

# చేపల మరణాలు సంభవించకుండా రైతులు పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు

డా॥ అరుణ్ కొండూరి, రవీందర్ బానోతు, డా॥ ఎం. శ్యామ్ ప్రసాద్, దివ్య బానోతు మరియు నాగరాజు శిగ

మత్స్య పరిశోధన స్థానం, పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పాలేరు, ఖమ్మం







**పరిచయం**

ప్రస్తుతం చేపల పెంపకం చాలా మంది గ్రామీణ రైతులకు మంచి ఆదాయ వనరుగా మారింది. అయితే చేపల పెంపకంలో రైతులు ఎక్కువగా ఎదుర్కొనే సమస్యల్లో ఒకటి చేపల మరణాలు (చెరువుల్లో చేపలు చనిపోవడం). ఎక్కువ సంఖ్యలో చేపలు చనిపోతే చేపల ఉత్పత్తి తగ్గిపోతుంది, ఖర్చు పెరుగుతుంది, చివరికి రైతుల లాభం గణనీయంగా తగ్గిపోతుంది. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం, చెరువుల్లో జరిగే చేపల మరణాల్లో 60-70% వరకు నీటి నాణ్యత సరిగా లేకపోవడం మరియు సరైన నిర్వహణ లేకపోవడమే కారణం. కానీ వ్యాధులు మాత్రమే ప్రధాన కారణం కాదు. అయితే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించటం ద్వారా చేపల మరణాలను చాలా వరకు తగ్గించుకోవచ్చు.

**1. నీటి నాణ్యత నిర్వహణ - చేపల పెంపకానికి శాస్త్రీయ ఆధారం**

నీరు చేపలకు జీవనాధారం. మనుషులకి గాలి ఎంత ముఖ్యమో, చేపలకు నీరు అంతే ముఖ్యం. మంచి నీటి నాణ్యత ఉంటే చేపలు వేగంగా పెరుగుతాయి. నీటి నాణ్యత చెడిపోతే ఒత్తిడి, వ్యాధులు, మరణాలు ఎక్కువ అవుతాయి.

**ఎ) కరిగిన ప్రాణ వాయువు**

- **శాస్త్రీయ సమాచారం:** చేపలు ఆరోగ్యంగా పెరగడానికి కనీసం లీటరు నీటికి 5 మి.గ్రా. ప్రాణ వాయువు అవసరం.
- డిఓ (డిస్సాల్వ్డ్ ఆక్సిజన్) లీటరు నీటికి 3 మి.గ్రా. కన్నా తక్కువైతే చేపలు బలహీనపడతాయి, 1 మి.గ్రా. కన్నా తక్కువైతే చేపలు చనిపోవచ్చు.
- సాధారణంగా తెల్లవారు జామున (సూర్యోదయం ముందు), మబ్బు వాతావరణం లేదా వర్షపు రోజుల్లో డిఓ తక్కువగా ఉంటుంది.

**రైతులకు ఉపయోగకరమైన సూచనలు:**

- ఏరేటర్లు వాడటం లేదా మోటార్‌తో నీటిని చల్లడం ద్వారా ప్రాణ వాయువును పెంచుకోవచ్చు.
- ఎక్కువ సాంద్రతలో చేప పిల్లలను చేపల చెరువులో వదలకూడదు, అదేవిధంగా ఎక్కువ మోతాదులో ఆహారం వేయకూడదు. ఎందుకంటే మిగిలిపోయిన ఆహారం కుళ్లి ప్రాణ వాయువుని తగ్గిస్తుంది మరియు అమ్మోనియా మోతాదును పెంచుతుంది.
- అలాగే నీటిలో పెరిగే కలుపు మొక్కల యాజమాన్య చర్యలు చేపట్టాలి.

**బి) నీటి పిహెచ్ స్థాయి**

- చేపలు ఎక్కువగా పిహెచ్ 7.0-8.5 మధ్య ఉన్న నీటిలో బాగా పెరుగుతాయి.
- పిహెచ్ 6.5 కన్నా తక్కువైతే (ఆమ్ల ధర్మం గల నీరు) చేపలు బలహీనమవుతాయి, వ్యాధులకు గురవుతాయి.
- పిహెచ్ 9 కన్నా ఎక్కువైతే (క్షార ధర్మం గల నీరు) చేపల మొప్పలు దెబ్బతింటాయి, మరియు చేపల్లో ప్రాణ వాయువుని గ్రహించే శక్తి తగ్గుతుంది.

**సూచన:** చేపల చెరువుల్లో పిహెచ్ తగ్గించడానికి పటిక లేదా బెల్లం వాడతారు. పిహెచ్ పెంచడానికి సున్నం వాడుతారు. కానీ వేసే మోతాదు నీటి నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. అందుకే నిపుణుల సలహా తీసుకుని వాడటం మంచిది.

**సి) అమ్మోనియా మరియు హానికర పదార్థాలు**

- మిగిలిన ఆహారం, చేపల మలమూత్రం కుళ్లిపోవడం వలన నీటిలో అమ్మోనియా (ఎన్‌హెచ్$_3$) ఏర్పడుతుంది.

- శాస్త్రీయ సమాచారం: 0.05 మి.గ్రా./లీ. కన్నా ఎక్కువ అమ్మోనియా చేపలకు విషం లాంటిది.
- అమ్మోనియా చేపల మొప్పలకి హాని చేస్తుంది, ప్రాణ వాయువు పీల్చుకోవడాన్ని తగ్గిస్తుంది.

**సూచనలు:**

- చేపల చెరువులలోని నీటిని క్రమం తప్పకుండా, అవసరమైనప్పుడు మార్చాలి
- ఎక్కువ మోతాదులో ఆహారం వేయకూడదు.
- చెరువును శుభ్రంగా ఉంచడం ద్వారా అమ్మోనియా స్థాయిని తగ్గించవచ్చు.

## 2. చేపల సాంద్రత మరియు చెరువు సామర్థ్యం

చాలా మంది రైతులు చేపలు ఎక్కువ వేస్తే ఎక్కువ ఉత్పత్తి వస్తుంది అని అనుకుంటారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. ప్రతి చెరువుకు ఒక మోసే/తట్టుకునే సామర్థ్యం ఉంటుంది. అంటే ఆ చెరువు ఒక పరిమితి వరకు మాత్రమే చేపలను ఆరోగ్యంగా పెంచగలదు.

- మిశ్రమ పద్ధతిలో చేపల పెంపకంలో (బొచ్చే, శీలవతి, మోసు, బంగారుతీగ) ఒక హెక్టార్ (సుమారు 2.5 ఎకరాలు)లో 5,000-8,000 పిల్లచేపలు వేసుకోవచ్చు.
- సాంద్ర పద్ధతిలో చేపల పెంపకం (ఏరేషన్, క్రమంగా మంచి ఆహారం వేసే పద్ధతి) లో, ఒక హెక్టార్‌లో 10,000-15,000 చేప పిల్లలు వేసుకోవచ్చు. కానీ ఇది కేవలం నీటి నాణ్యతను సమర్థవంతంగా నియంత్రించినప్పుడు, రోజుకు తగిన మోతాదులో మేత వేసినప్పుడు మరియు ఉత్తమ నిర్వహణ పద్ధతులను అమలు చేసినప్పుడే సాధ్యం.

అధిక సంఖ్యలో చేపలు వేయడము వల్ల వాటి పెరుగుదల తగ్గుతుంది, రోగాలను ఎదుర్కొనే శక్తి తగ్గిపోతుంది, మరణాలు 40% వరకు పెరుగుతాయి అని శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయి.

## 3. శాస్త్రీయ ఆహార పద్ధతులు

చేపలు ఆరోగ్యంగా పెరగడానికి మరియు రోగనిరోధక శక్తి పెంచుకోవడానికి సమతుల్య ఆహారం అవసరం. సరైన ఆహారం ఇవ్వకపోవడం వల్లే చాలా వరకు చేపల మరణాలు జరుగుతున్నాయి.

**ఆహారం వేసే ముందు గమనించవలసిన విషయాలు**

- చేపల మొత్తం బరువు ప్రకారం రోజుకు 2-5% వరకు ఆహారం ఇవ్వాలి.
- ఆహారం రోజుకు రెండు సార్లు (ఉదయం, సాయంత్రం) వేయాలి.
- వేసిన ఆహారం 20 నిమిషాల్లో పూర్తిగా తిన్నాయా లేదా అన్నది చూసుకోవాలి. తినకపోతే ఆహారం తగ్గించాలి.

**ఆహారంలో క్రింద తెలిపిన పోషకాలు ఉండేల చూసుకోవాలి**

- ప్రోటీన్ (25-30%) - చేపల పెరుగుదలకు అవసరం.
- కొవ్వులు మరియు కార్బోహైడ్రేట్లు - శక్తి కోసం అవసరం.
- విటమిన్లు మరియు ఖనిజాలు - రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

## 4. వాతావరణం మరియు వాతావరణ మార్పులు చేపల ఆరోగ్యంపై ప్రభావం

చేపలు చల్లని రక్తజంతువులు అంటే వాటి శరీర పనితీరు నేరుగా నీటి ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుంది.

- **అతి వేడి నీరు (>32° సెల్సియస్):** నీటిలో ఆక్సిజన్ తగ్గి చేపలు ఒత్తిడికి గురవుతాయి.
- **చల్లని నీరు (<18° సెల్సియస్):** కార్ప్ చేపల పెరుగుదల నెమ్మదిస్తుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది.
- **వర్షపు రోజులు:** నీటిలో మొక్కలు ఫోటోసింథసిస్ (ఆహారం తయారు చేయడం) తక్కువ చేయడం వల్ల ఆక్సిజన్ తగ్గుతుంది.

**రైతులకు ఉపయోగకరమైన సూచనలు:**

- వేసవిలో చెరువు లోతు కనీసం 1.5-2 మీటర్లు ఉంచితే నీరు ఎక్కువ వేడెక్కదు.
- వర్షాకాలంలో బురద లేదా కలుషిత నీరు చేపల చెరువులోకి రాకుండా జాగ్రత్త పడాలి.
- వరుసగా మబ్బు ఉన్న రోజుల్లో చెరువులో ఎరేషన్ పెట్టాలి.

## 5. ముగింపు

చేపల పెంపకంలో చేపల మరణాలు రైతులకు పెద్ద మొత్తంలో నష్టాన్ని కలిగించే సమస్య. అయితే వాటిలో ఎక్కువ శాతం కారణాలు నీటి నాణ్యత సరిగా లేకపోవడం వలన, అధిక సాంద్రతలో చేప పిల్లలు వేసుకోవడం ద్వారా, సరైన ఆహారపు పద్ధతులు పాటించక పోవడం కారణంగా, మరియు వాతావరణ మార్పులు సంభవించడం వలన జరుగుతుంది. కానీ సరైన నిర్వహణ చర్యలు తీసుకుంటే ఈ సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. రైతులు నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం, సున్నం వేయడం, సరైన సాంద్రతలో చేప పిల్లలను వదలడం, సమతుల్యమైన ఆహారం ఇవ్వడం మరియు వాతావరణ మార్పుల సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం వంటి పద్ధతులను పాటిస్తే చేపలను ఆరోగ్యంగా ఉంచి, రైతులకు అధిక లాభాలను తెచ్చి పెడతాయి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9110755909

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | | | |
| 1 | 03.11.2025 | వరి విత్తనోత్పత్తిలో మెళకువలు & యాసంగి కాలానికి అనువైన వరి రకాలు, వాటి లక్షణాలు మరియు సాగులో మెళకువలు | డా॥ పి. మధుకర్, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, ఫోన్ నెం. 9908850198 |
| 2 | 12.11.2025 | యాసంగి అపరాల సాగులో మెళకువలు | డా॥ యం. మధు, శాస్త్రవేత్త (అగ్రానమి) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 6301553434 |
| 3 | 19.11.2025 | శనగ మరియు జొన్న, సాగు తొలి దశలో చేపట్టవలసిన యాజమాన్య పనులు | డా॥ శ్రీధర్ చౌహాన్, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, అదిలాబాద్, ఫోన్ నెం. 9441167821 |
| II. టి-శాట్ (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1 | 03.11.2025 | యాసంగి చిరుధాన్యాల పంటల ఆవశ్యకత - మేలైన యాజమాన్య పద్ధతులు | డా॥ ఎస్. మహేశ్వరమ్మ, సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) విత్తన పరిశోధన సాంకేతిక విభాగం, రాజేంద్రనగర్, ఫోన్ నెం.8978229445 |
| 2 | 10.11.2025 | యాసంగి పంటల్లో సమగ్ర పోషక యాజమాన్యం | డా॥ సిహెచ్. రాములు, శాస్త్రవేత్త (ఎస్.ఎస్.ఎ.సి.) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 7013036957 |
| 3 | 17.11.2025 | యాసంగి ఆముదం రకాలు మరియు యాజమాన్య పద్ధతులు | డా॥ కె. సదయ్య, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8885331799 |
| 4 | 24.11.2025 | యాసంగి నూనె గింజల పంటలలో సస్యరక్షణ | డా॥ ఓ. శైల, శాస్త్రవేత్త (ఎంటమాలజీ) కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, ఫోన్ నెం.: 9951461694 |
| III. టి-శాట్ - (శనివారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1 | 01.11.2025 | రబీ పంటలకు అనువైన యాంత్రీకరణ పరికరాలు | డా॥ ఆర్. జయ ప్రకాష్, శాస్త్రవేత్త (ఎఫ్.యం.పి.ఇ.) ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ ఎఫ్.ఐ.యం.ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, ఫోన్ నెం. 8106128182 |
| 2 | 15.11.2025 | జీవ నియంత్రణ పద్ధతులు మెళకువలు | డా॥ ఎ. రామకృష్ణ బాబు, శాస్త్రవేత్త (ఎంటమాలజీ) & హెడ్ ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ బయో కంట్రోల్, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 8500032381 |
| 3 | 22.11.2025 | అడవి పందులు మరియు కోతుల బెడద నుండి రబీ పంటల రక్షణ | డా॥ వి. సునీత, సీనియర్ శాస్త్రవేత్త (ఎంటమాలజీ) సకశేరుక చీడపీడల యాజమాన్య విభాగం, రాజేంద్రనగర్ ఫోన్ నెం. 9985581919 |
| 4 | 29.11.2025 | రబీ పంటలలో పోషక యాజమాన్యం | డా॥ డి. విజయలక్ష్మి, శాస్త్రవేత్త (ఎస్.ఎస్.ఎ.సి.) ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ అగ్రో ఫారెస్ట్, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9912780362 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునీత దేవి మరియు డా॥ సి. పద్మవేణి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. ప్రతి పొలానికి నీటిపారుదల సౌకర్యాలను అందించడం, పంట ఉత్పాదకతను పెంచడం, రైతులకు సులభమైన రవాణ సౌకర్యాలను అందించడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంభించేలా రైతులను ప్రోత్సహించడం కోసం కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 11న ప్రారంభించిన పథకం ఏది?**

ఎ) పీఎం ధన్-ధాన్య కృషి యోజన పథకం
బి) పీఎం కిసాన్ మాన్‌ధన యోజన
సి) పిఎం-కిసాన్ సమ్మాన్ నిధి
డి) ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన

**2. భారతదేశంలో పప్పుదినుసుల ఉత్పత్తిలో అగ్రగామి రాష్ట్రం ఏది?**

ఎ) మహారాష్ట్ర   బి) ఉత్తరప్రదేశ్
సి) రాజస్థాన్   డి) మధ్యప్రదేశ్

**3. వివిధ పంటలలో ఆశించే తామర పురుగుల నివారణకు ఏ రంగు జిగురు అట్టలు పెట్టుకోవాలి?**

ఎ) తెలుపు   బి) పసుపు
సి) ఎరుపు   డి) నీలం

**4. బెట్టను తట్టుకునే యాసంగికి అనువైన మినుము రకం?**

ఎ) యల్‌బిజి 752   బి) పియం 31
సి) యంబిజి 207   డి) యల్‌బిజి 20

**5. వరి పంటలో ఆశించే కాండం తొలుచు పురుగు యొక్క నష్ట పరిమితి స్థాయి ఎంత?**

ఎ) 5% చనిపోయిన మొవ్వులు
బి) 10% చనిపోయిన మొవ్వులు
సి) 15% చనిపోయిన మొవ్వులు
డి) 20% చనిపోయిన మొవ్వులు

**6. ఐ సి ఏ ఆర్ ఆధ్వర్యంలోని భారతీయ నీటి యాజమాన్య సంస్థ ఎక్కడ ఉంది?**

ఎ) కొచ్చిన్   బి) భువనేశ్వర్
సి) పూనె   డి) నాగపూర్

**7. పందిరి కూరగాయల్లో మొక్కలు 2-4 ఆకుల దశల్లో ఉన్నప్పుడు బోరాక్స్ పిచికారి ఎందుకు చేయాలి?**

ఎ) మగపూలు ఎక్కువగా రావడానికి
బి) ఆడపూలు ఎక్కువగా రావడానికి
సి) పురుగుల నియంత్రణకు
డి) ఏదీకాదు

**8. యాసంగి పంటగా కుసుమను వేసుకోవడానికి అనుకూల మైన సమయం ఏది?**

ఎ) సెప్టెంబర్ మొదటి వారం
బి) డిసెంబర్ చివరి వరకు
సి) అక్టోబర్ రెండవ పక్షం నుండి నవంబర్ మొదటి పక్షం వరకు
డి) అక్టోబర్ రెండవ పక్షం నుండి డిసెంబర్ చివరి వరకు

**9. ప్రొద్దు తిరుగుడు హైబ్రిడ్ విత్తనోత్పత్తికి యాసంగి కాలం అనువైనది. ఆడ, మగ వరుసలు ఏ నిష్పత్తిలో నాటాలి?**

ఎ) 5:1   బి) 4:1
సి) 3:1   డి) 2:1

**10. తెలంగాణలో ఈత, తాటి ఉత్పత్తుల పెంపుదల కోసం ఉద్యాన పరిశోధన కేంద్రం ఎక్కడ ఏర్పాటు చేశారు?**

ఎ) పాలెం   బి) కొండమల్లేపల్లి
సి) నేలకొండపల్లి   డి) సూర్యాపేట

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ఉద్యకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం 23 అక్టోబర్, 2025న విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొ॥ ఎమ్. కోదండరాం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, ఏడాది కాలంలో ప్రొ॥ అల్దాస్ జానయ్య అనేక మంచి కార్యక్రమాలను చేపట్టారని అభినందించాడు. స్వరాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని విధానాలను రూపొందించాలని అన్నారు. తెలంగాణ విద్యా కమీషన్ చైర్‌పర్సన్ శ్రీ ఆకునూరి మురళి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య అద్భుతాలు సృష్టించారని, వ్యవసాయ కూలీల పిల్లలకి ప్రత్యేకంగా సీట్లు ఇవ్వడం గొప్ప నిర్ణయం అని అన్నారు. తెలంగాణ గాయకుడు, కవి, ఎమ్ఎల్‌సి శ్రీ గోరటి వెంకన్న మాట్లాడుతూ, సమాజానికి వెన్నుముక అయిన వ్యవసాయ రంగానికి చేదోడు వాదోడుగా నిరంతరం ఉండాలని శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులకు సూచించారు. వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర్ రావు గారి నిరంతర సూచనలు, సలహాలతోనే తాను విశ్వవిద్యాలయాన్ని నడిపిస్తున్నాని, విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది సహకారంతో ఈ ఏడాదిలో అనేక నిర్ణయాలు అమలు చేయగలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయ పరిధిలోని బొటానికల్ గార్డెన్‌లో ఔషధ మొక్కలు

మాధాపూర్‌లోని ఆర్పిజియం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో, పర్యావరణ స్వచ్ఛంద సంస్థ నిర్మాణ్ భాగస్వామ్యంతో, విశ్వవిద్యాలయ పరిధిలోని బొటానికల్ గార్డెన్‌లో 22 ఔషధ వృక్ష జాతులతో కూడిన ఔషధ వృక్ష బ్లాక్ స్థాపన కోసం అక్టోబర్ 11, 2025న మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్క నాటి తదనంతరం మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని కాపాడటానికి, సందర్శించే విద్యార్థులు, పండితులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రేమికులకు అవగాహన కల్పించడానికి మరియు వ్యవసాయ అటవీ సంరక్షణ కింద సిల్వి-ఔషధ వ్యవస్థపై పరిశోధనలను మరింతగా పెంచడానికి ఈ బ్లాక్ ఒక అద్భుతమైన ప్రదేశంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయం మరియు వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం

విశ్వవిద్యాలయం మరియు వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ అక్టోబర్ 14న వ్యవసాయ విద్య, పరిశోధన రంగాలలో వివిధ కార్యక్రమాలను సంయుక్తంగా చేపట్టేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ గత ఏడాది కాలం నుండి 4 అంతర్జాతీయ మరియు 5 జాతీయ సంస్థలతో వ్యవసాయ విద్య మరియు పరిశోధన రంగాలలో పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని వివిధ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామని అందులో భాగంగానే ఈ విద్యా సంవత్సరంలో 25 మంది విద్యార్థులకు పిజెటిఏయు-వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ డ్యుయెల్ డిగ్రీ ప్రోగ్రామ్ కింద ప్రవేశాలు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో పుస్తక ప్రదర్శన

విశ్వవిద్యాలయం పరిధిలోని నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో 25, 26 అక్టోబర్, 2025న పుస్తక ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సిహెచ్. విద్యాసాగర్ ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో హైదరాబాద్, న్యూఢిల్లీకి చెందిన 8 పుస్తక ప్రచురణ సంస్థలు స్టాల్‌లను ఏర్పాటు చేసి, ఇందులో వ్యవసాయ కోర్సులు, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులు పాల్గొని వివిధ పుస్తకాలను పరిశీలించారు.

## అటవీ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, భువనగిరి ఆధ్వర్యంలో యావపూర్ గ్రామంలో గిరిజన ఉప ప్రణాళిక ఆర్థిక సహాయంతో అటవీ వ్యవసాయం అన్న అంశంపై అక్టోబర్ 22, 2025న శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గిరిజన ఉప ప్రణాళిక ముఖ్య లక్ష్యాలు, అటవీ వ్యవసాయం యాజమాన్య పద్ధతులు, పెరటికోళ్ళ పెంపకం, పశుసంపద, సమగ్ర వ్యవసాయం వంటి అంశాలపై శాస్త్రవేత్తలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

డా॥ వి. సుధాకర్, పిఆర్ఓ మరియు మార్ఫ్ బాబు

# వంగ సాగు బహు బాగు అంటున్న తాండూరు రైతు విజయ గాథ

సి. యమున, టి. లక్ష్మణ్ మరియు ఎం. రత్నమాల,

ఏరువాక కేంద్రం, తాండూర్





బెల్కటూరు (గ్రా), తాండూర్ (మం), వికారాబాద్ (జిల్లా) కి చెందిన శ్రీ కాపు నరసింహ రెడ్డి మరియు ఆయన భార్య శ్రీమతి కాపు సుశీల తమకు ఉన్న 15 ఏకరాల భూమిలో వర్షాధారంగా మరియు నీటి సదుపాయంతో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. పత్తి, కంది పంటలను వర్షాధారంగా సాగుచేసుకుంటూ అలాగే నీటి సదుపాయం ఉండటం వలన వరితో పాటు మిర్చి, టమాట, వంకాయ వంటి కూరగాయలను పండిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతికూల వాతావరణ పరిస్థతులు, సరైన గిట్టుబాటు ధరలు లేకపోవటం, కూలీల కొరత, అలాగే దీర్ఘకాలమైన సాంప్రదాయ పంటలో నికర ఆదాయం తగ్గటం వంటి మొదలైన సమస్యల వలన నరసింహ రెడ్డి కూరగాయల పంటల వైపు ఎక్కువగా దృష్టి పెట్టారు. కాని వీటిలో కూడ పురుగు మరియు తెగుళ్ళ ప్రభావం వలన అనుకున్న స్థాయిలో పంట దిగుబడి పొందకపోగా ఎక్కువగా రసాయన మందులు వాడకంతో పెట్టుబడి ఖర్చు పెరిగింది. తాండూరు ఏరువాక కేంద్రం వారు 2022వ సంవత్సరంలో బెల్కటూరు గ్రామంలో కూరగాయల యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమమం ద్వారా నరసింహ రెడ్డి కూరగాయల సాగుపై తన సమస్యలను శాస్త్రవేత్తలతో చర్చించి సమగ్ర పురుగు మరియు తెగుళ్ళ నివారణ చర్యల గురించి తగిన సూచనలు పొందారు. గత సంవత్సరం తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వంగలో సమగ్ర పురుగుల యాజమాన్యం పై రైతు పొలంలో ప్రథమ శ్రేణి ప్రదర్శన చేపట్టడం జరిగింది, దీంట్లో భాగంగా రైతుకు వివిధ సమగ్ర పురుగుల యాజమాన్య పద్ధతుల పై అవగాహన కల్పించి జిగురు అట్టలను మరియు లింగాకర్షణ బుట్టలను ప్రోత్సాహకంగ ఇవ్వటం జరిగింది .

**రైతు అవలంభించిన సమగ్ర పురుగు యాజమాన్య పద్ధతులు :**

- నారును సొంతంగా ప్రోట్రే ల లో పెంచుకోవటం.
- నారు దశలో కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు వేయటం.
- పూత దశ కంటే ముందు లింగాకర్షణ బుట్టలు ఎకరానికి నాలుగు చొప్పున అమర్చటం.
- పంట తొలిదశ నుంచే 20-40 పసుపు రంగు మరియు నీలి రంగు జిగురు అట్టలను పొలంలో అమర్చటం.
- పంట మొదటి దశలోనే పురుగు ఆశించిన కొమ్మలను సమయానుసారంగా నిర్మూలించటం.
- పొలంలో అక్కడక్కడ పక్షి స్థావరాలను అమర్చటం.
- గుడ్డు దశ మరియు చిన్న పురుగు దశలో ఉండగానే వేప నూనె 10,000 పిపియం పిచికారి చేసుకోవడం.
- సమయానుసారంగా పురుగు ఉధృతిని బట్టి క్లోరంట్రా నిలిప్రోల్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ వంటి పురుగు మందులను తగిన మోతాదులో వాడటం.

**రైతు అభిప్రాయం:**

సమగ్ర పురుగు యాజమాన్యంలో భాగంగా లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టలను పొలంలో అమర్చటం వలన కొమ్మ తొలుచు, కాయ తొలుచు పురుగు మరియు రసం పీల్చు పురుగులైనటువంటి తెల్ల దోమ, పచ్చ దోమ ఉధృతి గత

సంవత్సరంతో పోల్చితే తగ్గటం జరిగింది. గ్రామంలో ఇతర రైతు పొలాల్లో పోల్చి చూస్తే దిగుబడి 56 టన్నులు /హె, పొందటమే గాక కాయ నాణ్యత బాగుండటం వల్ల మంచి ధర కూడా అందింది. నికర ఆదాయం రూ. 1,60000/- వచ్చి 1:2:4 ఆదాయ నిష్పత్తిని పొందడం జరిగింది .

**స్థిరత్వం / కొనసాగింపు :** శ్రీ నరసింహా రెడ్డి గారు, కేవలం పురుగు మందులు వాడకం పై ఆధార పడకుండా సమగ్ర పురుగు యాజమాన్య చర్యలను చేపట్టడం వలన సాగు ఖర్చును తగ్గించుకొని దిగుబడిని పెంచుకున్నారు, తద్వార మానవాళికి ముప్పు అయిన పురుగు మందుల అవశేషాలను తగ్గించడమే కాక నేల మరియు వాతావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించడంలో భాగమయ్యారు. దీనివలన బెల్కటూరు గ్రామ రైతులు కాకుండా చుట్టు పక్కల గ్రామాలలో కూరగాయలను సాగు చేసే ఇతర రైతులు కూడ ఈ విధానాలను అవలంభించటం ప్రారంభించారు.

### సాగు ఖర్చు మరియు ఆదాయ వివరాలు:

| సాగు ఖర్చు మరియు ఆదాయ వివరాలు | ప్రథమ శ్రేణి ప్రదర్శన పొలంలో | రైతు పద్ధతిలో |
|---|---|---|
| దిగుబడి (టన్నులు /హె.) | 56 | 48.5 |
| సాగు ఖర్చు (రూ./హె.) | 1,20000 | 1,34000 |
| మొత్తం ఆదాయం (రూ./హె.) | 2,80,000 | 2,42,500 |
| నికర ఆదాయం (రూ./హె.) | 1,60,000 | 1,08500 |
| ఖర్చు : ఆదాయం నిష్పత్తి | 1:2.4 | 1:1.8 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8897997946**

### 28వ పేజీలోని పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 క | 2 పా | స్ | కి | సా | న్ | యా | ప్ | | 3 సు | | |
| | ము | | | | రా | | | | డి | | |
| | పో | | | | 4 బో | | | | దో | | |
| | డ | | | | | | 5 కు | సు | మ | | |
| | తె | | | | | | | | | | డ్ |
| లు | గు | తె | ర్రి | వె 6 | | | | | | | రై |
| | లు | | | | ల్ | ప్రో | లి | ని | ట్రా | రాం | క్లో 7 |
| | | | | | | | | | | | డ్రో |
| | 8 ఉ | | డి | | | | క్స్ | ని | ఫో | డ్రో | హై 9 |
| | ల్లి | | మి | | | | | | | | ప్ |
| 10 ట్రై | కో | గ్రా | 11 మా | | | | | | | | ర్టా |
| | డు | | | | | | మ్ | జి | డా | ర్భం | కా 12 |

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. ఎ 2. సి 3. డి 4. సి 5. బి 6. బి 7. బి 8. సి 9. సి 10. బి**

# రైతు సేవలో విశ్వవిద్యాలయం.....





















RNI No : TELTEL/2015/60296
Total No. of Pages : 52

November, 2025

Postal Regd.No:HSE/1013/2024-2026
Date of Publication : 06.11.2025
Date of Posting : 09.11.2025

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001



## తాండూరు జొన్న-55 (ఎస్ వి టి 55)

### మొవ్వ చంపు ఈగ, కత్తెర పురుగు మరియు కాండం కుళ్ళు తెగులును తట్టుకునే యాసంగికి అనువైన మధ్యకాలిక రకము

To

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. C. Padma Veni on behalf of Professor Jayashankar Telangana Agricultural University, Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. C. Padma Veni, RNI File No. 1262077, Title-Code: TELTEL00152